సోమవారం
08-9-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 348
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

భూటాన్‌లో అదానీ జల విద్యుత్ ప్రాజెక్టు

న్యూఢిల్లీ: భూటాన్ ప్రభుత్వ రంగ యుటిలిటీ డ్రక్ గ్రీన్ పవర్‌తో కలిసి 570 మెగావాట్ల సామర్థ్యం కలిగిన జల విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటుకు అదానీ పవర్ ఒప్పందం కుదుర్చుకున్నది. సుమారు రూ.6,000 కోట్లతో చేపట్టే ఈ ప్రాజెక్టు కోసం భూటాన్ ప్రధాని దాషో షెరింగ్ టోబ్గే, అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ సమక్షంలో ఒప్పందంపై సంతకాలు జరిగాయి.

వాంగ్చు ప్రాజెక్టులో విద్యుత్ ప్లాంటు, సంబంధిత మౌలిక సదుపాయాల ఏర్పాటుకు పెట్టుబడి పెట్టనున్నారు. 2026 ప్రథమార్థం నాటికి నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి.

ఉత్తమ దర్శకురాలిగా అనుపర్ణ రాయ్

వెనిస్ (ఇటలీ): భారతీయ యువ దర్శకురాలు అనుపర్ణ రాయ్ చరిత్ర సృష్టించారు. వెనీస్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ 82వ ఎడిషన్‌లో ఉత్తమ దర్శకురాలిగా అవార్డు పొందారు. ఆమె సినిమా 'సాంగ్స్ ఆఫ్ ఫర్గాటెన్ ట్రీస్'కు ఈ అవార్డు దక్కింది. ఓరిజాంటి పోటీలో అనుపర్ణ ఉత్తమ డైరెక్టర్ అవార్డు గెలుచుకున్నారు. అనుపర్ణకు ఓరిజాంటి జ్యూరీ అధ్యక్షురాలిగా ఉన్న ఫ్రెంచ్ డైరెక్టర్ జూలియా దుకోర్నావు అవార్డు ప్రదానం చేశారు. ముంబైలో ఇద్దరు వలస మహిళల జీవితాలను చిత్రిస్తూ తీసిన సినిమా 'సాంగ్స్ ఆఫ్

- మిగతా 2 లో

అమరావతి క్వాంటం వ్యాలీకి రెండు కమిటీలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమరావతిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేసి రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి క్వాంటం టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ (ఏక్యూసీసీ) పనులను పర్యవేక్షించేందుకు అపెక్స్ కమిటీ, ఎక్స్‌పర్ట్ కమిటీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అపెక్స్ కమిటీకి ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.కమకోటి చైర్మన్‌గా, ఎక్స్‌పర్ట్ కమిటీకి ఐఐటీ తిరుపతి డైరెక్టర్ ప్రొఫెసర్

- మిగతా 2 లో

విజయవాడ, విశాఖ మెట్రో టెండర్ల గడువు పొడిగింపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చంద్రబాబు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విజయవాడ, విశాఖ మెట్రో టెండర్ల గడువును పొడిగించారు. ఈ మేరకు ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఎండీ రామకృష్ణారెడ్డి ఆదివారం తెలిపారు. విజయవాడ మెట్రోకు అక్టోబరు 14 వరకు, విశాఖ మెట్రోకు అక్టోబరు 7 వరకు పొడిగించారు. టెండర్ల ప్రీబిడ్ సమావేశంలో కాంట్రాక్ట్ సంస్థల నుంచి వినతులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. విశాఖ మెట్రో ఫేజ్1 కింద 46.23 కిలో మీటర్ల తొలిదశ నిర్మాణానికి, విజయవాడ మెట్రో ఫేజ్1లో 38 కిలోమీటర్ల నిర్మాణానికి టెండర్లు పిలిచారు.

ఇదీ లోకం!

అయితే అస్సలు నమ్మకు, ఇవాళ లైన్‌లో ఉండి ఇబ్బంది పడతావు!

భారత్ స్ఫూర్తి కోసం ఓటేయండి

ఎంపీలకు జస్టిస్ సుదర్శన్ రెడ్డి పిలుపు

న్యూఢిల్లీ: పౌరులను పణంగా పెట్టి కొందరి ప్రయోజనాల కోసం పనిచేస్తూ, సామాన్యులను మోదీ ప్రభుత్వం అణచివేస్తోందని జస్టిస్ సుదర్శన్ రెడ్డి విమర్శించారు. దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలు, మైనారిటీలు, మహిళలు, యువతకు అన్యాయం చేస్తోందని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యం అలంకార ప్రాయంంగా మారిందని వ్యాఖ్యానించారు. 'రాజకీయ పార్టీలపై అభిమానంతో కాదు... దేశంపై ఉన్న ప్రేమతో భారత్ స్ఫూర్తి కోసం నన్ను ఉప రాష్ట్రపతిగా ఎన్నుకోండి' అంటూ ఆదివారం ఓ వీడియో సందేశం ద్వారా ఎంపీలకు ఇండియా ఐక్యసంఘటన అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పిలుపునిచ్చారు. తనను ఎన్నుకోవడమంటే పార్లమెంటరీ సంప్రదాయాలను పరిరక్షించుకోవడం... చట్టసభల్లో చర్చలు

- మిగతా 2 లో

ఉప రాష్ట్రపతి ఎన్నికపై ఉత్కంఠ

గెలుపుపై ఎన్డీయే, ఇండియా ధీమా

- ఏర్పాట్లలో అధికార-విపక్షాలు నిమగ్నం
- రహస్య బ్యాలెట్... క్రాస్ ఓటింగ్‌పై ఆశలు
- ఓటు వేయడంపై ఎంపీలకు శిక్షణ
- నేడు ప్రతిపక్షాల మాక్ పోల్, ఖర్గే విందు



న్యూఢిల్లీ: ఉప రాష్ట్రపతి ఎన్నికపై ఉత్కంఠ నెలకొన్నది. గెలవబోయేది ఎవరన్న చర్చ కొనసాగుతోంది. తమ అభ్యర్థులను గెలిపించుకోవడం కోసం అధికార ఎన్డీయే, ప్రతిపక్ష ఇండియా ప్రయత్నిస్తున్నాయి. ఎన్డీయే అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్, బీజేపీ సీనియర్ నేత సీపీ రాధాకృష్ణన్, ఇండియా ఐక్య సంఘటన తరపున సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బి.సుదర్శన్ రెడ్డి పోటీ చేస్తున్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నిక మంగళవారం జరగనుంది. తమకు సంఖ్యాబలం ఉన్నందున రాధాకృష్ణన్‌ను గెలిపించుకోగలమన్న ధీమాతో ఎన్డీయే ఉన్నది. రాజ్యాంగ పరిరక్షకుడు ఉప రాష్ట్రపతిగా ఉంటే దేశానికి మేలు జరుగుతుందని భావిస్తున్న ఇండియా ఐక్య సంఘటన...పార్టీలకతీతంగా జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతు లభిస్తుందని నమ్ముతోంది. ఎన్డీయేకు 439, ఇండియాకు 324 మంది ఎంపీల మద్దతు ఉన్నట్లు తెలుస్తోంది. బీజేడీ ఎంపీలు ఏడుగురు, బీఆర్‌ఎస్ నుంచి నలుగురు, అకాలీ దళ్, జేపీఎం, వీఓటీపీపీ నుంచి ఒక్కొక్కరు, ముగ్గురు స్వతంత్రులు ఎవరి పక్షమో తేలలేదు. సరైన సమయంలో తగిన నిర్ణయం తీసుకుంటామని బీజేడీ ఎంపీ శస్మిత్ పాత్ర, బీఆర్‌ఎస్ ఎంపీ కె.సురేశ్‌రెడ్డి

- మిగతా 2 లో

ఎనిమిదేళ్లు ప్రజల సొమ్ము దోపిడీ

- ఓటమి భయంతోనే జీఎస్టీ శ్లాబుల కుదింపు
- ప్రాంతీయపార్టీలను ధ్వంసం చేశారు
- ట్రంప్‌కు మోదీ దాసోహం
- బీజేపీపై నిప్పులు చెరిగిన నారాయణ

విశాలాంధ్ర-హైదరాబాద్: దేశ వ్యాప్తంగా బీజేపీకి వ్యతిరేక పవనాలు వీస్తుండడంతో పాటు బీహార్ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే ఎనిమిదేళ్ల తర్వాత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జీఎస్టీ స్లాబులను తగ్గించిందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. జీఎస్టీ కౌన్సిల్‌ను సంస్కరించాలని నారాయణ డిమాండ్ చేశారు. అమెరికా సామ్రాజ్యవాద వ్యతిరేక దేశాలను కలుపుకుపోతేనే ట్రంప్ దిగొస్తారని ప్రధాని మోదీకి సూచించారు. ఉప రాష్ట్రపతి ఎన్నికలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి ఓటు వేయకపోతే బీజేపీ-బీఆర్‌ఎస్ మధ్య అవగాహన ఉందని అనుకునే పరిస్థితి వస్తుందని నారాయణ అన్నారు. హైదరాబాద్ మఖ్దూం భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహతో కలిసి నారాయణ మాట్లాడుతూ తాము మొదటి నుంచి జీఎస్టీ వల్ల ప్రజలకు భారమని చెబుతున్నప్పటికీ, కేంద్రంలోని మోదీసర్కారు పెడచెవిన పెట్టిందన్నారు. ఎనిమిదేళ్ల పాటు ప్రజలను దోచుకున్నారని దుయ్యబట్టారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ప్రధాని మోదీ లొంగిపోయారని, బానిస మనస్తత్వంతో ఉన్నారని మండిపడ్డారు. వివిధ రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలను బీజేపీ ధ్వంసం చేస్తోందన్నారు. ప్రాంతీయ పార్టీలతో జతకట్టడం లేదా స్నేహంగా ఉంటూ ఆయా పార్టీల నెత్తిపైన భస్మాసుర హస్తంగా మారుతోందని ఎద్దేవా చేశారు. జమ్మూకాశ్మీర్‌లో పీడీపీ, మహారాష్ట్రలో శివసేన, ఎన్సీపీని చీల్చిందని, నేతల కుటుంబాల్లో చిచ్చుపెట్టిందని నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలో కేజ్రీవాల్ జైలుకు పంపించారని, ఇక తెలంగాణలో కవిత కూడా జైలుకు పోయారన్నారు. బీఆర్ ఎస్ ఎప్పుడైతే బీజేపీ పంచన చేరిందో ఆ పార్టీ కొంప కొల్లేరయిందని, చివరకు కవిత బయటికి వచ్చి రాజకీయ పార్టీ పెట్టుకునే పరిస్థితి వచ్చిందన్నారు. ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు పంజాబ్‌లో సీపీఐ జాతీయ మహాసభలు జరుగనున్నాయని, ఈ సభల్లో జాతీయ రాజకీయ, ఇతరత్రా అనేక అంశాలపై చర్చించనున్నట్టు వివరించారు.

కవిత వ్యాఖ్యలను సుమోటోగా స్వీకరించాలి

బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి అంశంలో కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలను దర్యాప్తు సంస్థలు సుమోటోగా స్వీకరించి, విచారణ చేపట్టాలని నారాయణ డిమాండ్ చేశారు. కవిత చేసిన వ్యాఖ్యలతో సంబంధం లేదని హరీశ్ తప్పుకున్నప్పటికీ, కేసీఆర్ మాత్రం బాధ్యతగా సమాధానం చెప్పాలని, లేదంటే కవిత ఆరోపణలు వాస్తవంగా భావించాల్సి వస్తుందన్నారు. బీఆర్‌ఎస్ అంతర్గత వ్యవహారాలతో

- మిగతా 2 లో

ఏం చేయాలబ్బా...

దగ్గరపడుతున్న సుప్రీం గడువు

పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ భేటీ

విశాలాంధ్ర-హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డి తన నివాసంలో పార్టీ మారిన ఎమ్మెల్యేలతో ఆదివారం అత్యవసర భేటీ అయ్యారు. సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలకు కొద్ది రోజుల క్రితం స్పీకర్ నోటీసుల జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఏం చేయాలనే అంశంపై సీఎం చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసులో భాగంగా బీఆర్ఎస్ నుంచి పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేలకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ నోటీసులు జారీ చేశారు. అయితే.. ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు ఎమ్మెల్యేలు తాము బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతున్నామంటూ... వివిధ సందర్భాల్లో ప్రకటించారు. శాసనసభ రికార్డుల్లోనూ పది మంది ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలుగానే ఉన్నారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే... సుప్రీంకోర్టు నిర్దేశించిన గడువు లోగా పది మంది ఎమ్మెల్యేలపై విచారణ పూర్తి చేసి స్పీకర్ నిర్ణయం ప్రకటిస్తారా లేక పెండింగ్‌లో పెడతారా అన్నది చర్చనీయాంశంగా మారింది.

జపాన్ ప్రధాని ఇషిబా రాజీనామా

టోక్యో: జపాన్ ప్రధాని షిగెరూ ఇషిబా ఆదివారం తన రాజీనామాను ప్రకటించారు. జులైలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో చారిత్రక ఓటమికి బాధ్యత వహించాలని సొంత పార్టీ నుంచి తీవ్ర ఒత్తిడి ఎదురవుతుండటంతో బాధ్యతల్లో నుంచి తప్పుకోవాలని నిర్ణయించారు. ఆయన దాదాపు నెల రోజుల పాటు పార్టీ సభ్యులను శాంతింపజేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. చివరికి అధికార లిబరల్ డెమొక్రటిక్ పార్టీలో చీలికను నివారించడం కోసం ప్రధాని పగ్గాలను వదులుకోవాలన్న నిర్ణయానికి వచ్చారు. గతేడాది అక్టోబరులో ప్రధాని పీఠాన్ని అధిష్ఠించిన ఇషిబా... తాను తప్పుకుంటే జపాన్‌లో రాజకీయ శూన్యత ఏర్పడుతుందని, బాహ్య సమస్యలు, సవాళ్లు పెరుగుతాయని పార్టీకి నచ్చజెప్పే ప్రయత్నాన్ని చేసినప్పటికీ రాజీనామా కోసం డిమాండ్ తీవ్రంగా ఉండటంతో ఆయన అందుకు అంగీకరించారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. తన స్థానంలో కొత్త నాయకుడిని ఎన్నుకునే ప్రక్రియను మొదలు పెడతానని, సోమవారం కార్యాచరణ అవసరం లేదని టీవీ మాధ్యమంగా ఇషిబా ప్రకటించారు. ఆయనపై వర్చువల్‌గా అవిశ్వాస తీర్మానానికి సొంత పార్టీ సిద్ధం కావడం, సోమవారం కొత్త నాయకుడి ఎన్నికపై నిర్ణయించాలని భావించడంతో ఇషిబా ఈ ప్రకటన చేశారు. కొత్త

- మిగతా 2 లో

మద్యం కేసులో ముగ్గురి విడుదల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మద్యం కేసులో ముగ్గురు నిందితులకు బెయిల్ లభించింది. రిటైర్డ్ అధికారులు ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, వికాట్ కంపెనీ డైరెక్టర్ బాలజీ గోవిందప్పకు శనివారమే బెయిల్ మంజూరు కాగా కొన్ని నాటకీయ పరిణామాలు, సాంకేతిక సమస్యలతో జైలు అధికారులు వారి విడుదలను జాప్యం చేశారు. దీంతో ఏసీబీ కోర్టును ఆశ్రయించేందుకు ఆ ముగ్గురి న్యాయవాదులు సిద్ధమయ్యారు. ఈలోగా

- మిగతా 2 లో

ఐఏఎస్‌లకు స్థాన చలనం?

బదిలీలపై ఏపీ ప్రభుత్వం కసరత్తు



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్రంలో త్వరలోనే ఐఏఎస్ అధికారుల బదిలీలు జరగనున్నాయి. అసెంబ్లీ శీతాకాల సమావేశాల ప్రారంభానికి ముందే రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టరేట్ల వరకూ ఐఎఎస్‌ల బదిలీలు చేపట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ మేరకు ప్రభుత్వం స్థాయిలో కసరత్తు ప్రారంభమైందని, కొంత మంది అధికారులను కొత్త బాధ్యతలకు మారుస్తారని అధికార వర్గాల సమాచారం. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 14 నెలలు దాటుతున్నా ఇంకా కొన్ని శాఖల్లో ఉన్నత స్థాయిలో వైసీపీకి అనుకూలంగా వ్యవహరించే అధికారులు కొందరు సచివాలయ స్థాయిలో చక్రం తిప్పుతున్నారని ప్రచారం జరుగుతోంది. కొందరు అధికారులయితే ఇప్పటికీ అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల మాటలను ,సిఫార్సులను ఖాతరు చేయడం లేదని కూడా తెలుస్తోంది. ఇటీవల అధికార పార్టీకి చెందిన మైలవరం శాసనసభ్యుడు వసంత వెంకట కృష్ణప్రసాద్ ఓ ఉన్నత స్థాయి అధికారిపై బహిరంగంగానే విమర్శలు, ఆరోపణలు చేశారు. తాను వైసీపీ నుంచి టీడీపీలో చేరినందు వల్ల ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించినా రోడ్డు నిర్మాణ విషయంలో తాము సూచించిన దానికి భిన్నంగా వ్యవహరిస్తూ ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ఇలా ఒక ఎమ్మెల్యే బాహాటంగా అధికారిపై ఆరోపణ చేశారు. అంతే కాకుండా సచివాలయంలో మంత్రుల మాటలను సైతం కొందరు ఉన్నతాధికారులు పెడచెవిన పెడుతున్నారని కూడా అంటున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర పరిపాలన మరింత చురుకుగా సాగేందుకు, అభివృద్ధి- సంక్షేమ కార్యక్రమాల అమలులో వేగం పెంచేందుకు మార్పులు చేయాలని భావిస్తున్నారని సమాచారం. ఈ నెల 18వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో ఈ లోపుగానే బదిలీలు చేయాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కసరత్తు చేస్తున్నారని సమాచారం. మంత్రులు, ఎమ్మెల్యేల ద్వారా వస్తున్న ఫిర్యాదులతో పాటు ఇంటెలిజెన్స్ వర్గాల నుంచి సమాచారాన్ని జోడించుకుని సదరు అధికారులకు స్థానచలనం కల్పించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఐఏఎస్ అధికారుల బదిలీ అంశం ఇప్పుడు అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

కంపెనీలో కార్మికుడిగా చేరి...

ముంబై పోలీసు పక్కా వివరాల సేకరణ

గతంలో అరెస్టు నుంచి తప్పించుకున్న సంస్థ యజమాని

చర్లపల్లి డ్రగ్స్ కేసులో వెలుగులోకి కీలకాంశాలు

విశాలాంధ్ర-హైదరాబాద్: చర్లపల్లి డ్రగ్స్ కేసులో కీలక అంశాలు వెలుగు చూస్తున్నాయి. వాగ్దేవీ ల్యాబోరేటరీస్‌పై ముంబై పోలీసులు ఆకస్మిక దాడులు చేయగా... డ్రగ్స్ తయారీ యూనిట్ బయటపడిన విషయం తెలిసిందే. ఈ సంస్థ యాజమాని గతంలోనూ పోలీసులకు పట్టుబడినట్లు దర్యాప్తులో తేలింది. తన పలుకుబడితో డ్రగ్స్ కేసులో అరెస్టు కాకుండా తప్పించుకున్నాడు. ముంబైలో డ్రగ్స్ సరఫరా చేస్తున్న బంగ్లాదేశ్ మహిళను అరెస్టు చేసి... కేసు దర్యాప్తు చేస్తుండగా ఈ ల్యాబొరేటరీలో డ్రగ్స్ తయారీ యూనిట్ విషయం బయటపడింది. ఈ నేపథ్యంలో ముంబై నార్కోటిక్ పోలీసులు వాగ్దేవీ ల్యాబొరేటరీస్‌పై నిఘాపెట్టారు. ముంబై పోలీసుల్లో ఒకరు కార్మికుడిగా ల్యాబొరేటరీస్‌లో చేరారు. నెల రోజులపాటు ప్లాన్ చేసి వివరాలను పక్కాగా సేకరించారు. అనంతరం శనివారం పోలీసులు దాడి చేసి రూ.కోట్లు విలువ చేసే డ్రగ్స్, ఎండీ డ్రగ్స్ తయారీకి వినియోగించే 35,500 లీటర్ల ముడి సరుకును స్వాధీనం చేసుకున్నారు. 5.79 కిలోల మెఫిడ్రోన్, 950 కిలోల పొడి పదార్థం, మిథైలెనెడియాక్సీ మెథాంఫెటమైన్‌ను స్వాధీనం చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

వెనిజులా ఆక్రమణకు

ట్రంప్ కుట్ర

కరేబియన్ సముద్రంపై యుద్ధమేఘాలు

వాషింగ్టన్: ఏడు యుద్ధాలు ఆపినట్లు పదేపదే చెప్పుకొంటున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా ఓ కొత్త యుద్ధానికి తెరతీస్తున్నారు. అందులో భాగంగా కరేబియన్ సముద్రంలో భారీ యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, అత్యాధునిక యుద్ధ విమానాలు మోహరించారు. ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వలున్న దేశం చుట్టూ ఇవి సమయం కోసం ఎదురు చూస్తూ కాచుకు కూర్చొన్నాయి. దీంతో కరేబియన్ జలాలపై యుద్ధమేఘాలు కమ్ముకొన్నాయి. ఏ క్షణమైనా అమెరికా దళాలు వెనుజువెలాలో చొరబడొచ్చని వార్తలు

- మిగతా 2 లో

805 డ్రోన్లతో రష్యా దాడి

13 రకాల క్షిపణుల ప్రయోగం

తొలిసారి ఉక్రెయిన్ ప్రభుత్వ భవనం ధ్వంసం

కీవ్: రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చింది. ఒకవైపు శాంతి చర్చల కసరత్తు... మరోవైపు బాంబుల వర్షం, పరస్పరం దాడులు కొనసాగుతున్నాయి. యుద్ధం మొదలైనప్పటి నుంచి జరగనంత తీవ్రంగా రష్యా ఆదివారం దాడి చేసింది. 805 డ్రోన్లతో ఉక్రెయిన్‌పై విరుచుకుపడింది. 13 రకాల క్షిపణులనూ ప్రయోగించింది. కేవలం రెండు వారాల వ్యవధితో ఉక్రెయిన్‌పై రష్యా జరిపిన అతిపెద్ద దాడిగా, ఇప్పటివరకు జరిపిన దాడుల్లో అత్యంత తీవ్రమైనదిగా ఇది నిలిచింది. ఈ మేరకు ఉక్రెయిన్ వైమానిక దళం వెల్లడించింది. 747 డ్రోన్లు, నాలుగు క్షిపణులను గగనతలంలోనే ధ్వంసం చేసినట్లు తెలిపింది. ఉక్రెయిన్‌వ్యాప్తంగా 37 ప్రాంతాల్లో 56 డ్రోన్లు, తొమ్మిది క్షిపణులు దాడి చేయగా, తాము ధ్వంసం చేసిన డ్రోన్లు, క్షిపణుల శకలాలు ఎనిమిది చోట్ల పడ్డాయని వెల్లడించింది. ఈ దాడుల్లో ఏడాది చిన్నారి సహా ఇద్దరు చనిపోగా, 15 మందికి గాయాలయ్యాయని తెలిపింది. రష్యా ఎప్పుడు ప్రభుత్వ కార్యాలయాలు, భవనాలను లక్ష్యం చేసుకోలేదు. కానీ మొట్టమొదటిసారిగా ఒక ప్రభుత్వ భవనం తాజా దాడిలో ధ్వంసమైందని ఉక్రెయిన్ ప్రధాని యూలియా వెల్లడించారు. భవనాలను పునర్నిర్మించుకోగలం కానీ పోయిన ప్రాణాలను తిరిగి తేలేమన్నారు. ఈ విధ్వంసాన్ని మాటలతోనే కాకుండా చేతలతోనే యావత్ ప్రపంచం ప్రతిఘటించాలని, ఆంక్షల ఒత్తిడిని మరింత పెంచాలని, ముఖ్యంగా రష్యా చమురు, గ్యాస్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

ఉక్రెయిన్‌లోనే 60 శాతం అస్త్రాల తయారీ: జెలెన్‌స్కీ

తమ సైన్యం వినియోగించే ఆయుధాల్లో దాదాపు 60 శాతాన్ని దేశీయంగా తయారు చేసుకుంటున్నట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ వెల్లడించారు. రష్యాపై యుద్ధంలో వాడే అస్త్రాలలో అత్యధికంగా సొంతంగా తయారు చేసుకున్నవేనని చెప్పారు. వీటిలో అత్యాధునిక సాంకేతికతలతో తయారైన శక్తిమంతమైన ఆయుధాలు ఉన్నాయని తెలిపారు. డెన్మార్క్‌లో ఆయుధాల తయారీకి ఉమ్మడి ప్రాజెక్టు ఉండటాన్ని ప్రస్తావించారు. 1991లో సోవియట్ నుంచి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి వివిధ ఆపరేషన్లలో అగ్రభాగాన వినియోగించిన ఆయుధాల్లో దాదాపు 50 శాతం దేశీయంగా తయారు చేసినవేనని చెప్పారు. రష్యా డ్రోన్లు, క్షిపణి దాడులను ప్రతిఘటించడం కోసం గగనతల రక్షణ వ్యవస్థకు ఊతమిచ్చేందుకు ఉక్రెయిన్ ప్రధానంగా డ్రోన్ల తయారీపై దృష్టిని కేంద్రీకరించింది. ఇప్పుడు ఇవే డ్రోన్లు రష్యా వైమానిక దాడులను సమర్థంగా ప్రతిఘటిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

హమాస్ లొంగుబాటుతోనే యుద్ధానికి తెర

బందీలను విడుదల చేయాలి: ఇజ్రాయిల్

టెల్అవీవ్: గాజా స్వాధీనం దిశగా ఇజ్రాయిల్ చర్యలు మరింత ముమ్మరమయ్యాయి. నివాస ప్రాంతాలు, శిబిరాలపై దాడులు తీవ్రంగా కొనసాగుతున్నాయి. గాజా నగరాన్ని ఖాళీ చేయాలని హెచ్చరించిన ఇజ్రాయిల్ దళాలు ఆదివారం బాంబుల వర్షం కురిపించాయి. స్కూలు, గుడారాలు, ఇళ్లపై దాడులు చేసి 21 మందిని హతమార్చాయి. శనివారం జరిపిన దాడుల్లో 87 మంది పలస్తీనియన్లు చనిపోగా, 409 మందికి గాయాలయ్యాయి. 2023 అక్టోబరు నుంచి చనిపోయిన వారి సంఖ్య 64,368కు చేరింది. గాయపడిన వారి సంఖ్య 1,62,776గా ఉంది. మార్చి నుంచి ఇజ్రాయిల్ ఏకపక్షంగా కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూ 11,911 మంది ప్రాణాలు తీసింది. 50,735 మందిని గాయపరిచింది. గత 24 గంటల్లో 31 మంది సహాయ సిబ్బంది చనిపోగా, 132 మంది గాయపడ్డారు. అదే సమయంలో ముగ్గురు పిల్లలు సహా ఐదుగురి ఆకలితో ప్రాణాలు వదిలారు. గాజాలో కరువు ప్రకటించిన తర్వాత 23 మంది పిల్లలు సహా 109 ఆకలి చావులు నమోదయ్యాయి. ఈ పరిస్థితులపై ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది. పలస్తీనాకు మద్దతుగా ప్రజలు వీధుల్లోకి వస్తున్నారు. బ్రిటన్ రాజధాని లండన్‌లో వేలాది మంది వీధుల్లోకి వచ్చి పలస్తీనాకు మద్దతుగా భారీ ర్యాలీ నిర్వహించారు.

ఇజ్రాయిల్‌లోనూ నిరసనలు జరుగుతున్నాయి. తమ ఆత్మీయులను క్షేమంగా ఇంటికి చేర్చాలని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును ఆ దేశ పౌరులు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనూ ఇజ్రాయిల్ మరింత కర్కశంగా వ్యవహరిస్తోంది. ప్రపంచ దేశాలు ఆక్షేపిస్తున్నా దురాక్రమణను తీవ్రంగా కొనసాగిస్తోంది. హమాస్ ఆయుధాలు వీడితేనే యుద్ధాన్ని ఆపుతామని చెబుతోంది. 'హమాస్ లొంగిపోవాలని, బందీలను విడుదల చేయాలని, అప్పుడే యుద్ధం ఆగుతుంది' అని ఇజ్రాయిల్ విదేశాంగ మంత్రి గిడియాన్ సార్ తేల్చిచెప్పారు. అయితే గాజా నుంచి దళాలను ఉపసంహరించుకొని, యుద్ధాన్ని పూర్తి స్థాయిలో ఆపేందుకు ఇజ్రాయిల్ అంగీకరిస్తే, బందీలందరినీ వదిలిపెడతామని హమాస్ మళ్లీ పునరుద్ఘాటించిన క్రమంలో ఇజ్రాయిల్ మంత్రి తాజా ప్రకటన వెలువడింది.

భారత్ ఏ చట్టాలు ఉల్లంఘించలేదు

నవారో వ్యాఖ్యల్లో నిజం లేదు: 'ఎక్స్' నిజ నిర్ధారణ

వాషింగ్టన్: రష్యాతో భారత్ కొనసాగిస్తున్న విధానాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు వాణిజ్య సలహాదారు పీటర్ నవారో పదే పదే విమర్శలు గుప్పిస్తున్నారు. ఆయన చెప్పేదంతా అబద్ధమని ఎక్స్ తేల్చింది. తన ఫ్యాక్ట్ చెక్ ద్వారా రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తోంది ఇంధన భద్రత కోసమేనని, ఎలాంటి ఆంక్షలను, చట్టాలను ఉల్లంఘించలేదని తేల్చింది. రష్యా నుంచి కొన్ని వస్తువులను అమెరికా దిగుమతి చేసుకోవడాన్ని ప్రస్తావించింది. నవారో వ్యాఖ్యలు కపటమైనవిగా 'ఎక్స్' పేర్కొంది. కాగా, 'భారత్ అత్యధిక సుంకాలు విధించడం వల్ల అమెరికా ఉద్యోగాలు దెబ్బతింటున్నాయి. లాభం కోసమే ఆ దేశం రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోంది. ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధానికి దోహదమవుతుంది. యుద్ధంలో రెండు దేశాల ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు' అని నవారో ఎక్స్‌లో పెట్టిన పోస్టుపై ఫ్యాక్ట్ చెక్ జరిగింది.

భగ్గుమన్న నవారో: తన వ్యాఖ్యల్లో నిజం లేదని ఎక్స్ తేల్చినప్పటికీ నవారో సమర్థించుకున్నారు. ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇదో చెత్త ఫ్యాక్ట్ చెక్ చెత్త అని విమర్శించారు. భారత్ లాభాపేక్ష కోసమే రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుందంటూ తన వ్యాఖ్యలను నవారో సమర్థించుకున్నారు. ఉక్రెయిన్ భూభాగాన్ని రష్యా ఆక్రమించక ముందు ఈ కొనుగోళ్లు జరగలేదని తెలిపారు. ఉక్రెయిన్ ప్రజలను చంపడం, అమెరికన్ల ఉద్యోగాలు తీసుకోవడం ఆపాలంటూ పిచ్చి ప్రేలాపణలు చేశారు. దీనిపైనా 'ఎక్స్' ఫ్యాక్ట్ చెక్ జరిగింది. రష్యా నుంచి యురేనియం వంటి వాటిని అమెరికా దిగుమతి చేసుకుంటోందని తెలిపింది. అమెరికా ద్వంద్వ ప్రమాణాలకు తాజా వైఖరి అద్దంపట్టిందని దుయ్యబట్టింది.

ఉప రాష్ట్రపతి ఎన్నికపై ఉత్కంఠ

(మొదటిపేజీ తరువాయి)

వేర్వేరుగా తెలిపారు. ఇండియాలో భాగంగా లేనప్పటికీ జస్టిస్ సుదర్శన్ రెడ్డికి ఆమ్ ఆద్మీ పార్టీ మద్దతు ప్రకటించింది. 11 మంది సభ్యులున్న వైసీపీ... రాధాకృష్ణన్‌కు మద్దతు తెలిపింది. ఉప రాష్ట్రపతి ఎన్నిక రహస్య బ్యాలెట్ విధానంలో జరగబోతోంది. అందువల్ల ఎన్డీయేకు క్రాస్ ఓటింగ్ భయం పట్టుకుంది. ప్రస్తుతం 781 మంది ఓటు వేయనున్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నికను రాజ్యాంగం వర్సెస్ ఆర్ఎస్ఎస్-బీజేపీగా ప్రతిపక్షం ప్రచారం చేస్తోంది. ఫలితం ఏమైనా గట్టి పోటీ ఇవ్వాలన్న ఉద్దేశంతో ఉప రాష్ట్రపతి ఎన్నికను ఇండియా ఐక్య సంఘటన ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. క్రాస్ ఓటింగ్ కచ్చితంగా జరుగుతుందని, అది తమకు అనుకూలంగా పరిణమిస్తుందని ఆశిస్తోంది. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తెలుగు వారు అయినందున ఆయనకు టీడీపీ, వైసీపీ, జనసేన ఎంపీలు మద్దతివ్వాలని కోరుతోంది. మిమ్మల్ని జైలుకు పంపిన టీడీపీ-బీజేపీ అభ్యర్థికి ఓటేస్తారా లేక రాజ్యాంగాన్ని కాపాడటం కోసం పోరాడుతున్న జస్టిస్ రెడ్డికి మద్దతిస్తారా అంటూ వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డిని కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాకూర్ ప్రశ్నించారు. ప్రతిపక్ష సభ్యులు 324 మంది ఓట్లు వేసి... అభ్యర్థి ఓడిపోయినా అత్యధిక ఓట్లు పొందిన ప్రత్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నిలుస్తారు. 2002లో సుశీల్ కుమార్ షిండే (305 ఓట్లు) రికార్డును బద్దలు కొట్టగలుగుతారు. అప్పట్లో ఉప రాష్ట్రపతి ఎన్నికకు గట్టి పోటీ నెలకొంది. భైరాన్‌సింగ్ షెకావత్ 454 ఓట్లతో గెలిచారు. అయితే ఎన్డీయే అభ్యర్థికి ఈసారి 500కు మించి ఓట్లు వచ్చే పరిస్థితి లేదు. 2022 ఎన్నికల్లో తృణమూల్ ఎంపీలు ఓటు వేయలేదు. జగదీప్ ధన్కర్‌కు 528 ఓట్లు రాగా అంతకుముందు ఎం.వెంకయ్య నాయుడు 516 ఓట్లు సాధించారు.

ఈనెల 9న జరగబోయే ఉప రాష్ట్రపతి ఎన్నిక కోసం తమ ఎంపీలను బీజేపీ సన్నద్ధం చేస్తోంది. మాక్ పోలింగ్‌తో శిక్షణ ఇస్తోంది. ప్రతిపక్షం కూడా సోమవారం సంవిధాన్ సదన్‌లోని సెంట్రల్ హాల్‌లో మాక్ పోల్ నిర్వహించనున్నది. అదే రోజు సాయంత్రం ప్రతిపక్ష ఎంపీలందరికీ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విందు ఏర్పాటు చేశారు. సోమవారం మధ్యాహ్నం 2.20 గంటలకు మాక్ పోల్... రాత్రి 7.30 గంటలకు ఖర్గే విందు జరుగుతాయి. వారాంతంలో వరుస సమావేశాలతో కాంగ్రెస్ బిజీ అయింది. మాక్ పోల్స్, ఉపరాష్ట్రపతి ఎన్నికలో ఓటింగ్ కోసం ఢిల్లీకి చేరుకునే ప్రతి 15 మంది ఎంపీల కోసం ఒక సమన్వయకర్తను నియమించింది. మిత్రపక్షాలతో సమన్వయం కోసం వేరుగా కాంగ్రెస్ బృందాలు ఏర్పాటయ్యాయి. చెల్లని ఓట్లు పడకుండా శిక్షణా తరగతులు, మాక్ పోలింగ్ దోహదపడతాయని రెండు పక్షాల ఎన్నికల మేనేజర్లు భావిస్తున్నారు. 2022లో 15, 2017లో 11 చొప్పున చెల్లని ఓట్లు పడ్డాయి. అత్యధికంగా 1997లో 46 ఎంపీల ఓట్లు చెల్లనివిగా ప్రకటించారు.

ఉప రాష్ట్రపతి ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోదీ ఉన్నారు. పార్లమెంటు హౌస్‌లోని వసుధా రూమ్ నెం.ఎఫ్ 101లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. సాయంత్రం 6 గంటల నుంచి ఓట్లు లెక్కిస్తారు. అదే రోజు ఫలితం ప్రకటిస్తారు. ఈ మేరకు రాజ్యసభ సెక్రటేరియట్ ప్రకటన తెలిపింది. ప్రస్తుతం ఎలక్టోరల్ కాలేజీలో 233 మంది రాజ్యసభ సభ్యులు (ఐదు ఖాళీలున్నాయి), 12 మంది నామినేటెడ్ సభ్యులు, 543 మంది లోక్‌సభ ఎంపీలు (ఒక ఖాళీ ఉంది) 17వ ఉప రాష్ట్రపతిని ఎన్నుకోనున్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి సురవరం

సంస్మరణ సభలో హరినాథరెడ్డి

విశాలాంధ్ర-తిరుపతి: సురవరం సుధాకర్ రెడ్డి బహుముఖ ప్రజ్ఞాశాలి అని, ఆయన జీవితంలో ఎన్నడూ నిత్య విద్యార్థిగానే ఉండేవారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి కొనియాడారు. మాజీ ఎంపీ, సీపీఐ సీనియర్ నేత సురవరం సంస్మరణ సభ ఆదివారం స్థానిక గంధమనేని శివయ్య భవనన్ జరిగింది. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా విచ్చేసిన హరినాథరెడ్డి మాట్లాడుతూ... సురవరం సుధాకర్ రెడ్డి జీవితం యువతరానికి ఎంతో ఆదర్శమన్నారు. ఆయన అభ్యుదయ భావాలు, పోరాట స్ఫూర్తి, ఆయన ప్రసంగాలు, ఆయన ఆలోచన విధానం అనుసరణీయమన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజన నిర్ణయాల్లో ఆయన ప్రధాన భూమిక పోషించారని, అదే విధంగా దేశ రాజకీయాల్లో, రాష్ట్ర ఆర్థిక, సామాజిక పరిస్థితుల దృష్ట్యా అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. చిత్తూరు జిల్లా నిర్మాణంలో అనేక సూచనలు, సలహాలు ఇచ్చారన్నారు. సుధాకర్ రెడ్డి మరణం కమ్యూనిస్టు పార్టీకే కాక అభ్యుదయ, ప్రజాస్వామ్య వాదులకు తీరని లోటని అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు మాట్లాడుతూ యువ కమ్యూనిస్టులు, కార్యకర్తలకు వెన్నుదన్నుగా నిలిచారని గుర్తు చేశారు. జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ ... ఆయనకు తరతరాలుగా వచ్చిన ఆస్తిని విద్యార్థి యువజన సంఘాల ప్రయోజనార్థం విరాళంగా ఇవ్వడం గొప్ప విషయమన్నారు. బి. తులసేంద్ర, రాఘవ శర్మ, దేవేంద్ర రెడ్డి, భాస్కర్ నాయుడు, పార్థసారథి, గుర్రప్ప నాయుడు, పార్టీ చిత్తూరు జిల్లా సహాయ కార్యదర్శి జనార్ధన్, లక్ష్మయ్య, మోహన్ కుమార్ రాజు, రమణ పాల్గొన్నారు.

'భారత్ స్ఫూర్తి' కోసం ఓటేయండి

(మొదటిపేజీ తరువాయి)

హుందాగా జరిగే పరిస్థితిని పునరుద్ధరించుకోవడం... ప్రజాస్వామ్యానికి నిలయంగా రాజ్యసభకు హామీ ఇవ్వడమేనని ఆయన నొక్కిచెప్పారు. ప్రజాస్వామ్యం ప్రభుత్వ వ్యవస్థల్లో కాదు... భారతదేశ స్ఫూర్తిలో ఉంటుందని నిరూపించడం ప్రతి ఎంపీ కర్తవ్యమన్నారు. ఉప రాష్ట్రపతిగా ఎన్నికైతే పార్లమెంటరీ వ్యవస్థ హుందాతనాన్ని కాపాడటానికి కట్టుబడతానని, నిష్పాక్షికంగా కార్యకలాపాలు నిర్వహిస్తానని జస్టిస్ రెడ్డి హామీనిచ్చారు. 'నా కోసం కాదు...భారత్‌ను సార్వభౌమ, ప్రజాస్వామిక, గణతంత్ర దేశంగా కొనసాగించడానికి మీ మద్దతు కోరుతున్నా. ఈ ఎన్నికల్లో పార్టీ విప్ లేదు. రహస్య బ్యాలెట్ ఉంటుంది. రాజకీయ పార్టీకి నిబద్ధత ప్రధానం కాదు. దేశంపై మీకున్న ప్రేమే ముఖ్యం. దాని ఆధారంగానే మీ ఎంపిక ఉండాలి' అని ఎంపీలకు హితవు పలికారు. భారత్ స్ఫూర్తిని కాపాడుకోవాల్సిన నైతిక బాధ్యత ఎంపీలందరిపై ఉందని నొక్కిచెప్పారు. 'మీ ఉప రాష్ట్రపతిని ఎన్నుకోవడం కోసం కాకుండా భారత్ స్ఫూర్తి కోసం ఓటు వేయండి. కలిసికట్టుగా గణతంత్రాన్ని బలోపేతం చేసుకుందాం. భవిష్యత్తు తరాలు గర్వించే వారసత్వాన్ని అందిద్దాం' అంటూ జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాజకీయ ఆకాంక్షలతో తాను పోటీకి దిగలేదని, ప్రజాస్వామ్య పరిరక్షణ, బలోపేతం కోసమే బరిలో నిలిచానని చెప్పారు. పార్లమెంటరీ కార్యాచరణ ఎల్లప్పుడు పారదర్శకంగా, సమ్మిళితంగా ఉండటానికే ప్రాధాన్యత ఇస్తానని జస్టిస్ సుదర్శన్ రెడ్డి హామీనిచ్చారు.

యూరియా...ఏదయా?

- పంటల సాగుకు అందక రైతుల దిగాలు
- కృత్రిమ కొరత...యథేచ్ఛగా నల్లబజారు దందా
- చోద్యం చూస్తున్న ప్రభుత్వం
- నేడు మండల కేంద్రాల్లో ధర్నాలకు సీపీఐ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: యూరియా, డీఏపీ వంటి ఎరువులు అందక రైతులు గగ్గోలు పెడుతున్నారు. రైతు సమస్యల పరిష్కారంలో కూటమి సర్కారు నిర్లక్ష్యం చూపుతుందన్న విమర్శలు న్నాయి. యూరియాతో పాటు వారికి అవసరమైన ఎరువులందించకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని, కృత్రిమ కొరతను సృష్టించి... యూరియాను బ్లాక్ మార్కెట్‌కు యథేచ్ఛగా తరలిస్తున్నా రని, ఈ వ్యవహారంలో కూటమి నేతలున్నారని రైతులు మండిపడుతున్నారు. రాష్ట్రంలో రైతులు అత్యధికంగా 80శాతం వరి సాగుచేస్తున్నారు. దీంతోపాటు వేరు శెనగ, పత్తి, మొక్క జొన్నలకు యూరియా అవసరం. ప్రస్తుతం పొట్టదశలో వరి పంట ఉండగా...ఈ దశలో 40 శాతం నత్రజనితో మిళితమైన యూరియా అవసరం ఉంది. దానిని సరఫరా చేయడంలో ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కన్పిస్తోంది. రైతులకు కనీసం ఒక బస్తా యూరియా ఇవ్వలేని పరిస్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్న విమర్శలున్నాయి. యూరియాపై రూ.100, డీఏపీపై రూ.200 అదనంగా బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నప్పటికీ ప్రభుత్వాధికారులు, విజిలెన్స్ శాఖాధికారులు, పోలీసులు చోద్యం చూస్తున్నారని రైతులు ధ్వజమెత్తుతున్నారు. బ్లాక్ మార్కెట్‌లో విక్రయాలు కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకోనందునే ఈ పరిస్థితి ఉత్పన్నమైంది. ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకుగాను రైతులనే బాధ్యులుగా చేయడాన్ని వారు మండిపడుతున్నారు. బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టి రాష్ట్రవ్యాప్తంగా రైతాంగానికి ఎరువులను సక్రమంగా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గం పిలుపునిచ్చింది.

ఈ ఏడాదే యూరియా కొరతెందుకు?

గతేడాది రాష్ట్రానికి 39లక్షల మెట్రికల్ టన్నుల ఎరువులు అవసరం అవసరం రాగా..అందులో యూరియా 6.65లక్షల టన్నులు ఉంది. ఈ ఏడాది సాగు విస్తీర్ణం 70శాతమే. గతేడాది కంటే తగ్గింది. దానికితోడు అదనంగా యూరియా, ఎరువులు రప్పించామని ప్రభుత్వం చెబుతోంది. మరి రైతులు ఎందుకు రోడ్డెక్కుతున్నారు?. ఆ పంపిణీ చేసిన యూరియా ఎటెళ్లిపోయింది? దీనికి చంద్రబాబు ప్రభుత్వం సమాధానం చెప్పాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. పంపిణీ చేసిన యూరియాపై జిల్లాల వారీగా శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. వ్యవసాయాధికారులే యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించారన్న సంఘటనలు వెలుగు చూశాయి. ఎన్టీఆర్‌జిల్లా ఎ.కొండూరు మండలం వ్యవసాయాధికారిని 50టన్నుల యూరియాతోపాటు ఎరువులు విక్రయించిన వ్యవహారంపై ప్రభుత్వం సస్పెండ్ చేసిన విషయం విదితమే. ఎరువుల కొరతపై సీఎం చంద్రబాబు అధికారులతో రెండు సార్లు సమీక్షలు నిర్వహించగా...వాటి కొరత లేకుండా చూస్తామని అధికారులు వివరించారు. రాష్ట్రానికి అదనంగా 41 వేల టన్నుల ఎరువులు రానున్నాయని, కాకినాడ పోర్టుకు ఒక వెజల్ వస్తుందని, దాని ద్వారా 15వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులోకి వస్తాయని ఈ సమీక్షలో సీఎం దృష్టికి అధికారులు తీసుకెళ్లారు.

వెనిజులా ఆక్రమణకు ట్రంప్ కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

వస్తున్నాయి. వెనుజులా ముఠాల నుంచి మాదకద్రవ్యాలు అమెరికాను ముంచెత్తుతున్నాయని ట్రంప్ మొదటి నుంచి ఆరోపిస్తున్నారు. ఆ ముఠాలను అంతం చేసే సాకుతో సైనికదళాలను రంగంలోకి దింపారు. ఈ ముఠాలతో వెనుజులా అధ్యక్షుడు నికోలస్ మదురోకు సంబంధాలున్నాయని ట్రంప్ కార్యవర్గం ఇప్పటికే తీవ్ర ఆరోపణలు చేసింది. ఆయనను పట్టించే సమాచారం ఇస్తే ఏకంగా 50 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.430 కోట్లు) బహుమతి ప్రకటించింది. మదురో సర్కారు రోజులు లెక్కపెట్టుకో వాలని ట్రంప్ స్వయంగా సోషల్ మీడియాలో హెచ్చరించారు. మదురో ఎన్నికను అమెరికా గుర్తించడం లేదని శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవెట్టి వెల్లడించారు. దీంతో అక్కడ ప్రభుత్వాన్ని కూల్చే ఉద్దేశం ట్రంప్ కార్యవర్గానికి ఉన్నట్లు స్పష్టమవుతోంది. కాగా, యుద్ధ విమానాలు, జలాంతర్గాములు, యుద్ధ నౌకలను అమెరికా మోహరించడాన్ని మదురో తీవ్రంగా ఖండించారు. గత 100 ఏళ్లలో తమ దేశం ఎదుర్కొన్న అత్యధిక ముప్పుగా ఆయన అభివర్ణించారు. 8 నౌకల్లో 1200 క్షిపణులను తమపై గురిపెట్టారని ఆరోపించారు. అమెరికాతో పోలిస్తే వెనిజులా సైన్యం చాలా చిన్నది. 1,23,000 సైనికులు, 8,000 రిజర్విస్టులు, 2,20,000 మంది పౌర సైన్యం ఉంది. 80 లక్షల మంది పౌరులను సిద్ధం చేస్తానంటూ మదురో ఇటీవలే ప్రకటించారు.

అమరావతి క్వాంటం వ్యాలీకి రెండు కమిటీలు

(మొదటిపేజీ తరువాయి)

కె.ఎస్.సత్యనారాయణ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ కమిటీల్లో ఐఐటీ, ఐఐఎస్‌సీ, ఇస్రో, సీఎస్ఐఆర్, సీడీఏసీ, మైక్రోసాఫ్ట్, ఐబీఎం, టీసీఎస్, ఏడబ్ల్యుఎస్, ఎన్‌వీఐడీఐఏ వంటి దేశీయ, అంతర్జాతీయ నిపుణులు సభ్యులుగా ఉన్నారు. ప్రభుత్వం తెలిపిన ప్రకారం, ఈ కమిటీలు ఎస్క్యూఎం క్రింద వ్యూహాత్మక మార్గదర్శనం, సాంకేతిక పర్యవేక్షణ, పరిశోధన-పరిశ్రమ సహకారం, స్టార్టప్ ప్రోత్సాహం, నైపుణ్య అభివృద్ధి వంటి అంశాలను పర్యవేక్షిస్తాయి. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి భాస్కర్ కాటంనేని ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

జపాన్ ప్రధాని ఇషిబా రాజీనామా

(మొదటిపేజీ తరువాయి)

నాయకుడి ఎన్నికకు అక్టోబరులో తేదీని ఖరారు చేసే అవకాశం న్నది. అధికార పార్టీ నాయకుడి రేసులో ఎవరు ఉంటారన్న చర్చ మొదలైంది. దీంతో ఆర్థిక భద్రతా శాఖ మాజీ మంత్రి సనే తకైచితో పాటు మాజీ ప్రధాని కిషిదా మద్దతుగల కేబినెట్ ప్రధాన కార్యదర్శి యోషిమాసా హయాషి పేర్లు తెరపైకి వచ్చాయి. ఉభయ సభల్లో మెజారిటీ రాకపోతే తదుపరి ఎల్‌డీఎఫ్ నాయకుడి పయనం సవాళ్ల భరితంగా ఉంటుందని రాజకీయ నిపుణులు అభిప్రాయపడ్డారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీలతో కలిసి బిల్లులను ఆమోదింపజేయించుకోవాల్సి వస్తుందన్నారు. కాదంటే తరచూ అవిశ్వాస తీర్మానాలు తప్పబోవని హెచ్చరించారు. కాగా, ప్రభుత్వాన్ని కూల్చి పెద్ద సంకీర్ణం ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు ఆరాటపడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో తదుపరి ప్రధానిపై ఉత్కంఠ నెలకొన్నది.

ఉత్తమ దర్శకురాలిగా అనుపర్ణ రాయ్

(మొదటిపేజీ తరువాయి)

ఫర్గాటెన్ ట్రీస్'. ఒంటరితనం, జీవనోపాధి, క్షణిక సంబంధాల థీమ్‌తో ఈ సినిమా రూపొందిచారు. ఓరిజాంటి విభాగంలో భారత్ నుంచి ఈ సినిమా మాత్రమే పాల్గొనడం విశేషం. ప్రముఖ దర్శకుడు అనురాగ్ కశ్యప్ నిర్మాణంలో ఈ సినిమా తెరకెక్కింది. ఈ చరిత్రాత్మక విజయం భారతీయ సినిమాను అంతర్జాతీయంగా మరింత ఎత్తుకు తీసుకెళ్లింది. అవార్డు స్వీకరణ సమయంలో తెల్లటి శారీలో కనిపించిన అనుపర్ణ రాయ్... 'ఈ క్షణం స్వప్నంలా ఉంది' అంటూ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. జ్యూరీ, నిర్మాతలు, కళాకారులు, అనురాగ్ కశ్యప్‌లకు ఆమె ధన్యవాదాలు చెప్పారు. ఈ భారతీయ సినిమా... అంతర్జాతీయ వేదికపై కొత్త మైలురాయిని నిర్మించడంలో కీలక పాత్ర పోషించిందని అనుపర్ణ అన్నారు.

మద్యం కేసులో ముగ్గురి విడుదల

(మొదటిపేజీ తరువాయి)

నిందితులు విడుదల అయ్యారు. తమ నివాసాలకు చేరుకున్నారు. ఉద్దేశపూర్వకంగా తమను విడుదల చేయడంలో ఆలస్యం చేశారని జైలు అధికారుల తీరుపై ధనుంజయరెడ్డి అసహనం వ్యక్తంచేశారు. ఏసీబీ కోర్టు ఇచ్చిన బెయిల్‌ను సవాల్ చేస్తూ రాష్ట్ర హైకోర్టులో సిట్ అధికారుల బృందం ఆదివారం హౌస్ మోషన్ పిటిషన్ వేసింది. ఏ31 ధనుంజయరెడ్డి, ఏ32 కృష్ణ మోహన్ రెడ్డి, ఏ33 బాలాజీ గోవిందప్ప బెయిల్ ఆర్డర్లపై స్టే విధించాలని హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసులో తాజా పురోగతి చర్చనీయాంశమైంది. విడుదలైన ముగ్గురికి వైసీపీ తరపున ఘన స్వాగతం లభించింది.

ఎనిమిదేళ్లు ప్రజల సొమ్ము దోపిడీ

(మొదటిపేజీ తరువాయి)

తమకు సంబంధంల లేదని, కానీ మొదటి నుంచి ఆ పార్టీలో క్రియాశీలకంగా ఉన్న కవిత స్వయంగా నిర్దిష్టమైన అవినీతి ఆరోపణలు చేశారని, ఇది ప్రజా సొమ్ముకు సంబంధించిన అంశమని నారాయణ అన్నారు.

సుదర్శన్‌రెడ్డికి ఓటు వేస్తారా? లేదా? బీఆర్ఎస్‌కు కూనంనేని సూటి ప్రశ్న

గత ఉప రాష్ట్రపతి ఎన్నికలో తెలుగు వ్యక్తి అని వెంకయ్యనాయుడుకు మద్దతు ఇచ్చిన బీఆర్ఎస్... ప్రస్తుత ఎన్నికల్లో కూడా తెలుగువ్యక్తి, తెలంగాణ బిడ్డ, జస్టిస్ సుదర్శన్ రెడ్డికి ఓటు వేస్తారా?,లేదా స్పష్టత ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు వివిధ సందర్భాల్లో కేంద్రంలోని బీజేపీకి మద్దతుగా బీఆర్ ఎస్ ఓటు వేసిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్‌పై రకరకాలుగా ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఇప్పటికైనా ఆ పార్టీ స్పష్టత ఇవ్వాలన్నారు. కమ్యూనిస్టులుగా తాము అధికారంలో లేకపోయినా నిత్యం ప్రజల పక్షాన నిలబడుతామని, అలాగే బీఆర్ఎస్ కూడా ఉండాలని తాము ఆకాంక్షిస్తున్నా మన్నారు. బీజేపీని నమ్ముకుంటే దెబ్బతింటారని ఆయన బీఆర్ఎస్‌ను హెచ్చరించారు.

ప్రాణహిత-చేవేళ్ల ప్రాజెక్ట్ తిరిగి చేపట్టాలి

ప్రాణహిత-చేవేళ్ల ప్రాజెక్ట్ తిరిగి చేపట్టాలని, 5వ ప్యాకేజీ వద్ద చిన్న ఎత్తిపోతలను నిర్మించాలని ప్రభుత్వానికి కూనంనేని సూచించారు. సుందిళ్ల, మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను ఉపయోగిస్తారా? లేదా? ప్రభుత్వం సమాధానం చెప్పాలని, ఈ బ్యారేజీలను ఉపయోగిస్తే రూ.14వేల కోట్లు విద్యుత్ బిల్లుల రూపేణా ఖర్చవుతుందని వివరించారు. రూ. 36వేల కోట్లతో పూర్తయ్యే ప్రాణహిత -చేవేళ్ల ప్రాజెక్ట్ జస్టిస్ పీసీ ఘోష్ నివేదిక ప్రకారం రూ.1,46,000 కోట్ల అంచనాలు పెరిగాయన్నారు. ఏదో విధంగా నిధులు దుర్వినియోగం జరిగిందని, కేవలం ఇద్దరు, ముగ్గురు అధికారుల వద్దనే వెయ్యి కోట్ల రూపాయలు దొరికాయని కూనంనేని తెలిపారు. రాష్ట్రంలో ఎంత మేరకు యూరియా డిమాండ్ ఉంది?, సరఫరా ఎంత చేయాలనే విషయమై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే కేంద్రానికి లేఖ రాయాలని సూచించారు. యూరియా సరఫరాలోని లోపాలను గుర్తించి, ఒక వేళ బ్లాక్‌లో ఉంటే బయటికి తీయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. రైతాంగ సమస్యలను పరిష్కరించాలన్నారు.

ప్రతి పక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలను ఇబ్బందులకు గురిచేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం నిర్వహించేందుకు ముఖ్యమంత్రి పిలుపునివ్వాలని కూనంనేని సాంబశివరావు సూచించారు. జీఎస్టీ పేరుతో కేంద్రం దోపిడీకి పాల్పడిందన్నారు. ప్రధాని మోదీ పెద్దన్న పాత్రను పోషించడంలేదని, రాష్ట్రంపై పెత్తనం చెలాయిస్తున్నారని దుయ్యబట్టారు. బీసీలకు నష్టం జరిగితే ఊరుకోబోమని సీఎంను హెచ్చరిస్తున్న బీజేపీ... తెలంగాణ రాష్ట్రం ఆమోదించిన బిల్లులను ఆపుతున్నారని, దొంగ నాటకాలాడుతున్నారని దుయ్యబట్టారు. బీసీ బిల్లులను ఆమోదించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని బీజేపీకి సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై సిబిఐ పారదర్శక విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కేసు విషయంలో సీబీఐ న్యాయబద్ధంగా ఉంటుందా?, రాజకీయ ప్రయోజనాలకు సీబీఐని వాడుకుంటారా? లేదా బీఆర్ ఎస్ మెడపైన కత్తిపెట్టి లొంగతీసుకునేందుకు ప్రయత్నిస్తారా? అనేది చూడాలని కూనంనేని సాంబశివరావు అన్నారు. రాష్ట్రాల హక్కులను కేంద్రం హరిస్తోందని, కొన్ని వస్తువులకు జీఎస్టీ తగ్గించి, మరి కొన్ని వస్తువులకు అదనంగా పెంచారని, రాష్ట్రాలకు ఇవ్వాల్సిన జీఎస్టీ నిధులు ఇస్తున్నారా? అని ప్రశ్నించారు. పోలవరం తరహాలో తెలంగాణలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇవ్వాలని, వివిధ రంగాలకు కేంద్రం సహాయం చేస్తే తెలంగాణ ఆర్థిక ఇబ్బందుల నుంచి కొద్దిగా బయట పడుతుందని తెలిపారు.

ఆ విషయంలో ట్రంప్, మోదీ ఆలోచనలు ఒక్కటే...

ట్రంప్‌తో సంబంధాలు పోతే ఎలా అని ప్రధాని మోదీ సంకుచిత ఆలోచనలో ఉన్నారని కూనంనేని సాంబశివరావు ఎద్దేవా చేశారు. సామ్రాజ్యవాదానికి ట్రంప్ నాయకుడని, సామ్రాజ్యవాదానికి దయ, జాలి ఉండబదోని,ఆర్థిక ప్రయోజనాలే వారికి ముఖ్యమని వివరించారు. కమ్యూనిస్టుల విషయంలో ట్రంప్, మోదీ ఆలోచనలు ఒకే విధంగా ఉన్నాయని... కమ్యూనిస్టులు,మావోయిస్టులు,నక్సలైట్లు దేశానికి శత్రువులా? అని కూనంనేని నిలదీశారు. వారు తప్పు చేస్తే కేసులు పెట్టుకోవచ్చన్నారు. సార్వభౌమత్వాన్ని నిలబెట్టేందుకు ఇప్పటికైనా మోదీ ప్రయత్నించాలన్నారు. ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డిని దేశానికి శత్రువునిగా చిత్రీకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో సెక్యూలరిజం,సోషలిజం అనే పదాలను తొలగిస్తారా? అని ప్రశ్నించారు. గతంలో బీజేపీ కూడా గాంధేయ సోషలిస్టు అని రాసుకున్నదని కూనంనేని గుర్తు చేశారు.

ఘనంగా రావి నారాయణరెడ్డి వర్ధంతి

విశాలాంధ్ర - కొండమల్లేపల్లి : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ అమరజీవి రావి నారాయణరెడ్డి ఆదివారం 34వ వర్ధంతి సందర్భంగా దేవరకొండలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్ సిపిఐ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు అనంతరం వారి చిత్రపటానికి పులమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ భూమికోసం, భుక్తికోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో రావి అగ్రభాగాన ఉండి పోరాటం నిర్వహించారన్నారు. అనంతరం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి నుండి ఎంపీగా పోటీ చేసి మొదటి ప్రధానమంత్రి నెహ్రూకు మించిన ఓట్లు సాధించి పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించారని అన్నారు. రావి జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చాలని, నేటి యువత రావి నారాయణరెడ్డి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి వలమల్ల ఆంజనేయులు, మండల కార్యవర్గ సభ్యులు పల్లా రంగారెడ్డి, వెంకట్రాములు, మైనొద్దీన్, వెంకటయ్య, శ్రీను, జూలూరి జ్యోతిబస్ నాయకులు గంగలి పర్వతాలు, రాజమల్లయ్య, ఆనందచారి, ఎండి జాకీర్, శ్రీను, శ్రీరామదాసు పాండు, పర్వతాలు, బక్కయ్య, అంజమ్మ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఏఎస్ఐ సుబ్బారావుకు సన్మానం

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో : ములుగు జిల్లా ఏటూరు నాగారం పోలీస్ స్టేషన్ నుండి కొత్తగూడెంకు బదిలీపై వెళుతున్న ఏఎస్ఐ సుబ్బారావును, ఏటూరునాగారం సిఐ అనుముల శ్రీనివాస్, ఎస్ఐ రాజ్ కుమార్ ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా సిఐ, ఎస్ఐ శ్రీనివాస్, రాజ్ కుమార్ మాట్లాడుతూ సుబ్బారావు ఇక్కడ ఏఎస్ఐ పనిచేసి ప్రజలతో పాటు పోలీస్ శాఖలో మంచి పేరు తెచ్చుకున్నారని, ఉద్యోగులకు బదిలీలు సహజం అని, ఇక్కడ పని చేసి మంచి పేరు తెచ్చుకున్న విధంగా బదిలీపై వెళ్తున్న కొత్తగూడెంలో మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చుకోవాలని కోరారు. అనంతరం బదిలీపై వెళుతున్న ఏ.ఎస్.ఐ సుబ్బారావును ఏటూరు నాగారం జామ మసీదు కమిటీ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, జామ మసీద్ కమిటి అధ్యక్షులు అబ్బాల్, హరీఫ్, ముస్తాఫ్ ఉసెన్, రజాక్, తదితరులు పాల్గొన్నారు.

పేపర్ మిల్లు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో - కొమరం భీం : కాగజ్ నగర్ ఎస్పిఎం జేక్ పేపర్ మిల్ 2018 పునః ప్రారంభం అయినప్పటి నుండి కార్మికులకు చెందవలసిన కార్మిక హక్కుల ఉల్లంఘన జరుగుతుందన్నారు. కార్మిక కమిటీ పేరిట యాజమాన్యం కుమ్మక్కై కార్మిక సంఘం ఎన్నికలు జరగకుండానే 4 సం.లు అగ్రిమెంట్ చేసి కార్మికులకు తీవ్ర అన్యాయం చేశారని, మిల్లులో కనీసం క్యాంటీన్ సౌకర్యం లేదని, మిల్లులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. మిల్లులో యజమాన్యం కమిటీ నిరంకుశ పాలన కొనసాగుతుందని, వెంటనే కార్మిక కమిటీని రద్దు చేయాలని, మిల్లులో క్యాంటీన్ సౌకర్యం కల్పించాలని, వార్షిక బోనస్ మిల్లు లాభాలలో వాటా ఇవ్వాలన్నారు. పర్మనెంట్ కార్మికులు ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్‌కు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్సీ సానుకూలంగా స్పంది స్తూ కార్మిక సమస్యలపై వెంటనే తెలంగాణ కార్మిక శాఖ మంత్రి వివేక్ దృష్టికి తీసుకు వెళ్తానని, ఎస్పిఎం జెకె యజమాన్యంతో చర్చలు జరిపి కార్మికులకు తగు న్యాయం చేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రైతుల ప్రయోజనాలకు అనుగుణంగా కుంటల పునర్నిర్మాణం

విశాలాంధ్ర - వనపర్తి : పెద్దగూడెం తండా రైతుల కోరిక మేరకు క్రాస్ రోడ్డు ప్రక్కన వాటర్ షెడ్ అంతర్భాగంలో నిర్మించిన కుంటను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నాయకులు రైతులతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు ఈ కుంటను ఆధునీకరించడం ద్వారా 50 ఎకరాలకు సాగునీరు అందుతుందని ఈ కుంట చిన్నదిగా ఉండడంతో చాలిచాలని సాగునీరు అందుతుందని కాబట్టి కుంట ఎత్తు నాలుగు ఫీట్లు పెంచి భీమా కాలువ ద్వారా పైపు లైన్ వేసి పునరుద్ధరించాలని రైతులు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డినీ కోరారు. ఈ ప్రాంతాన్ని సునిశితంగా పరిశీలించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి రైతుల సంక్షేమమే లక్ష్యం అని నిపుణుల సలహాతో సాధ్య అసాధ్యాలను చర్చించి భీమా కాలువ నుండి పైప్ లైన్ వేయించి కుంటను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు.కార్యకర్తలతో ఉత్సాహంగా గడిపిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మండల పర్యటనలో భాగంగా కార్యకర్త గోవిందు నాయకు నూతన స్కూటీనీ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి స్వయంగా నడిపి ఉత్సాహపరిచారు. అనంతరం ఒక టీ స్టాల్ దగ్గర నాయకులు, కార్యకర్తలతో కలసి తేనీరు సేవించి పార్టీ గురించి ప్రజా సమస్యల గూర్చి చర్చించి పలు సూచనలు చేశారు. మండల పార్టీ అధ్యక్షులు కే.మాణిక్యం, మాధవ్ రెడ్డి, నరసింహ, ధర్మా నాయక్, మహేశ్వర్ రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, చిట్యాల రాము, కృష్ణా నాయక్, రూప్లనాయక్, భీముడు, గోవిందు, పాండు, శంకర్, హనుమంతు నారియా పాల్గొన్నారు.

టాటా ఎఐఎ కంపెనీలో చీఫ్ బిజినెస్ లీడర్‌గా నాగేంద్రరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : టాటా ఎఐఎ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో సేవలందిస్తున్న కొత్తగూడెం వాసి తానికొండ నాగేంద్ర రెడ్డి తక్కువ కాలంలోనే అసాధారణ ప్రతిభ కనబరిచి చీఫ్ బిజినెస్ లీడర్‌గా స్థాయికి ఎదగడం పట్ల స్థానికంగా పలువురు అభినందిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి మొదటి సిబిఐ ఆఫీసర్‌గా నిలిచిన ఆయన ఇంతకు ముందు వేలాది నిరుద్యోగులకు శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించారు. అనంతరం టాటా లైఫ్ ఇన్సూరెన్స్‌లో కెరీర్ ప్రారంభించి ఇన్సూరెన్స్ రంగంలో కూడా ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఇన్సూరెన్స్ ద్వారా వేల కుటుంబాలకు ఆర్థిక రక్షణ కల్పిస్తున్నారు. పట్టుదలతో శ్రమిస్తూ ఆయన నాయకత్వ నైపుణ్యాలను నిరూపించుకున్నారని పలువురు అభినందిస్తున్నారు. కష్టమర్ల విశ్వాసాన్ని గెలుచుకుని ఈ ప్రతిష్టాత్మక ప్రమోషన్ సాధించారని కొనియాడుతున్నారు. ఆయన సిబిఐ అధికారిగా ఎదిగిన సందర్భంలో కంపెనీ ఎంప్లాయీస్‌తో పాటు సంస్థ లీడర్స్, అడ్వైజర్స్ అభినందనలు వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ పోరాట నిప్పు కణిక రావి నారాయణరెడ్డి

వర్ధంతి సభలో సీపీఐ నేత బాగం

విశాలాంధ్ర - ఖమ్మం : తెలంగాణలో పోరాట అగ్గి రగిల్చిన వారిలో సుప్రసిద్ధ కమ్యూనిస్టు రావి నారాయణరెడ్డి ఒకరని ఆయన పోరాట నిప్పు కణిక అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. నిజాం నిరంకుశ పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూసి బానిసలుగా బతుకుతున్న ప్రజలను చైతన్యపరిచిన ఘనుడు రావి నారాయణ రెడ్డి అన్నారు. రావి నారాయణరెడ్డి 34వ వర్ధంతి సందర్భంగా స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో ఆదివారం ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి సిపిఐ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో హేమంతరావు మాట్లాడుతూ తెలంగాణలో నాటి పరిస్థితులను చూసి తెలంగాణ విముక్తి తప్ప మరో మార్గం లేదని సాయుధ పోరాటంలో రావి నారాయణరెడ్డి ముందు వరుసలో నిలిచారన్నారు. పల్లె పల్లెలో రైతాంగ పోరాటాన్ని రగిల్చిన మహనీయుల్లో రావి నారాయణ రెడ్డి ఒకరన్నారు. రావి నారాయణరెడ్డి తన జీవిత కాలం కమ్యూనిస్టుగా జీవించారన్నారు. భారతదేశ పార్లమెంటరీ వ్యవస్థలో తొలిసారి జరిగిన ఎన్నికల్లో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కంటే అత్యధిక మెజార్టీతో గెలిచి దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టుల సత్తాను చాటారన్నారు. సాయుధ పోరాటంలో అసువులు బాసిన వారికి అండగా నిలబడడంలోనూ పోరాటంలో పాల్గొన్న వారికి పింఛన్లు ఇప్పించడంలోనూ రావి నారాయణ రెడ్డి కృషి మరువలేనిదన్నారు. నారాయణరెడ్డి పోరాట వారసులుగా సిపిఐ కార్యకర్తలు భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని హేమంతరావు పిలుపునిచ్చారు. పార్టీ 100వ సంవత్సరంలోకి అడుగిడిందని వంద సంవత్సరాల కమ్యూనిస్టు పార్టీ పోరాట చరిత్రను మననం చేసుకుంటూ భవిష్యత్తు పోరాట కార్యాచరణను రూపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఎస్కె జానిమియా, కొండపర్తి -గోవిందరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, రావి శివరామకృష్ణ, మిడికంటి వెంకటరెడ్డి, తాటి వెంకటేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు, సాంబశివరెడ్డి, జిల్లా నాయకులు నూనె శశిధర్, వరదా నర్సింహారావు, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, మద్దోజు శ్రావణ్, బోడా వీరన్న, జాకీర్, సురేందర్, శ్రీనాథ్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిరస్థాయిగా పిప్పిరి చంద్రశేఖర్ వైద్యసేవలు

విశాలాంధ్ర బ్యూరో - మెదక్ : మెదక్, రంగారెడ్డి జిల్లాల ప్రాంతీయ ఆసుపత్రుల సమన్వయకర్త (డిసిహెచ్) డాక్టర్ పిప్పిరి చంద్రశేఖర్ చేసిన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని పలువురు పేర్కొన్నారు. ఆదివారం డా. పిప్పిరి చంద్రశేఖర్ ఉద్యోగ విరమణ ఆత్మీయ అభినందన సభ మెదక్ వెంకటేశ్వర గార్డెన్స్‌లో నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. మెదక్, రంగారెడ్డి జిల్లాలో నిరుపేద ప్రజలకు వైద్య సేవలు అందించారని పేర్కొన్నారు. మెదక్ ప్రాంతంలో జన్మించడం ఇక్కడి ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్లు బట్టి జగపతి, చంద్రపాల్, మల్లికార్జున్ గౌడ్, ఇఫ్కో మాజీ డైరెక్టర్ ఎం.దేవేందర్ రెడ్డి, టీజీఎస్పీ డీసీఎల్ మాజీ చైర్మన్ శ్రీరంగారావు, మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, ఏడుపాయల మాజీ డైరెక్టర్ రాగి చక్రపాణి, హెచ్చిబి అధినేతలు రాగి రమేష్, రాగి వెంకటేష్, మాజీ కౌన్సిలర్లు రాగి వనజ, మామిళ్ళ ఆంజనేయులు, ఏఎంసీ మాజీ చైర్మన్ మేడి మదుసూదన్‌రావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ సురేందర్, డాక్టర్ ఎం.శివదయాల్, డాక్టర్ ధనరాజ్, డాక్టర్ పెంటా గౌడ్, డాక్టర్ నవీన్, డాక్టర్ వీణ డాక్టర్ సురేష్, డాక్టర్ చంద్రమౌళి, సీనియర్ అడ్వకేట్ కే జనార్దన్ రెడ్డి, మేడిశెట్టి శ్యామ్‌రావు నీలకంఠం నాగరాజు గౌడ్ ఆకుల రామకృష్ణ రాజు టీయూడబ్ల్యూజే మెదక్ జిల్లా అధ్యక్షులు ఏ.శంకర్ దయాల్‌చారి, కామాటి కృష్ణ చెవిటి అశోక్ నీలం సందీప్ హుస్సేన్ తదితరులు పాల్గొని డాక్టర్ చంద్రశేఖర్‌ను సత్కరించారు. స్వగ్రామం బ్యాతోల్ గ్రామస్తులు ప్రత్యేకంగా సత్కరించి సేవలు కొనియాడారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

విశాలాంధ్ర - కారేపల్లి : సమాజంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులను సన్మార్గంలో నడిపించే విధంగా పాఠ్యాంశాలు బోధించాలని వైరా మాజీ శాసన సభ్యురాలు డాక్టర్ బానోతు చంద్రావతి అన్నారు. సింగరేణి మండలం నుండి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన బానోత్ శామ్ లాల్, బానోత్ సీతారాములును బిఆర్ఎస్ పార్టీ నేత, వైరా మాజీ శాసన సభ్యురాలు డాక్టర్ బానోత్ చంద్రావతి ఆదివారం ఖమ్మం పట్టణంలోని ఆమె నివాసంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుమూల గ్రామీణ ప్రాంతాలలో ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్ది తమ వృత్తికి వన్నె తెచ్చి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. అంకితభావంతో పనిచేసిన ఉపాధ్యాయులే ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తింపబడతారన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బానోత్ వీరు నాయక్, జిల్లా అధ్యక్షులు మంగ్య నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ నాయక్, శ్యామ్ లాల్, లింగ, రాందాస్, కిషన్ రాథోడ్, రాంజీ, శ్రీను, సీతారాములు, కిషన్, చిరంజీవి వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

మైదం మహేష్ కుటుంబానికి అండగా బిఆర్ఎస్

విశాలాంధ్ర -ములుగు జిల్లా బ్యూరో : ములుగు మున్సిపల్ కార్యాలయం పని పారిశుద్ధ్య కార్మికుడు మైదం మహేష్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు, మృతి చెందిన మహేష్, వారి కుటుంబాన్ని పరామర్శించి, వారి కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) నా ద్వారా వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలుపమని వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలపడం జరిగిందని పేర్కొన్నారు. ములుగు మండల కేంద్రంలోని మాధవరావు పల్లి గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు మైదం మహేష్ గత ఐదు నెలల నుండి జీతాలు రావడం లేదని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న మైదం మహేష్ మృతి చెందడం బాధాకరం అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికులను చిన్న చూపు చూస్తున్న ఈ ప్రభుత్వానికి, ప్రజలే బుద్ధి చెప్తారని, బాధితునికి న్యాయం జరిగేలా చూస్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పోరిక గోవింద నాయక్ ములుగు మండల బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన వినాయక నిమజ్జనం

విశాలాంధ్ర బ్యూరో - మెదక్ : మెదక్ జిల్లాలో వినాయక నిమజ్జనం ఆదివారం సాయంత్రం ప్రశాంతంగా ముగిసింది. గురువారం సాయంత్రం మొదలైన నిమజ్జన శోభాయాత్ర ఆదివారం సాయంత్రంతో సమాప్తమైంది. మెదక్ పట్టణంలో ఈసారి కాశీ పండితుల మహా హారతి, కేరళ వాయిద్యం, ప్రభలు, జాల్నా బ్యాండు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కలెక్టర్ రాహుల్ రాజ్ ఆధ్వర్యంలో కొంటూరు పెద్ద చెరువు వద్ద భారీ ఏర్పాట్లు చేశారు. ఎస్పీ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఎక్కడ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశారు.

యూనియన్ పోరాట ఫలితమే ఇన్సూరెన్స్‌పై జిఎస్టి రద్దు

విశాలాంధ్ర - కోదాడ : ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ పోరాట ఫలితమే వ్యక్తిగత జీవిత, ఆరోగ్య భీమాలపై ప్రభుత్వం జిఎస్టి రద్దు చేసిందని యూనియన్ డివిజన్ కార్యదర్శి డి.రఘు పేర్కొన్నారు. ఆదివారం కోదాడ ఎల్ఐసి కార్యాలయంలో జరిగిన కోదాడ, సూర్యాపేట బ్రాంచ్‌ల యూనియన్ సంయుక్త సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సంస్థలో నూతన ఉద్యోగాల నియామకాలను వెంటనే చేపట్టడంతో పాటు, 1996 బ్యాచ్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి పి.బాలస్వామి, డివిజన్ నాయకులు జావిద్, కోదాడ సూర్యాపేట బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు విజయ శంకర్, కన్నయ్య, మోషన్ సింగ్, ప్రభాకర్, సువర్ణ రాణి, ఉపేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా సకాలంలో అందించండి

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : రైతులు ప్రధానంగా ఎదుర్కొంటున్న యూరియాతోపాటు అటవీ అధికారులు పంటల ధ్వంసం చేస్తున్న సమస్యలను పరిష్కరించాలి సిపిఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తగూడెంలోని కూలీ లైన్‌లో నాయకులు ఎస్కే ఉమర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఇందులో పాల్గొన్న నాగేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ అదును సమయములో రైతులు సాగు చేసుకుంటున్న పంటలకు యూరియా అంధకపోవడం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం అన్నారు. రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా సమస్యను తక్షణమే పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రైతులు తెల్లవారుజాము 3 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు లైన్‌లో నిలబడితే ఒక బస్తా కూడా దొరకడం లేదన్నారు. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వలేదని పైగా వారిపై అక్రమ కేసులు పెడుతు హింసకు గురి చేస్తున్నారని విమర్శించారు. న్యూడెమొక్రసీ జిల్లా నాయకులు ఎస్ కే. ఉమర్, కుంజ కృష్ణ, మారుతి రాఘవులు, రమేష్, కొండపనేని సత్యనారాయణ, పామర్తి లక్ష్మయ్య, ఆదినారాయణ, నాగరాజు, మోటు పాల్గొన్నారు.

జంపన్న వాగులో ఈతకు వెళ్లి యువకుడి మృతి

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర పరిసరాలలో గల జంపన్న వాగులో ఈతకు వెళ్లి యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం మధ్యాహ్నం జరిగింది. వివరాల ప్రకారం జనగామ జిల్లా కుర్మా వాడకు చెందిన కానుగంటి మనిష్ 23 తన స్నేహితులతో కలిసి మేడారం అమ్మవార్ల దర్శనానికి వచ్చారు. సమ్మక్క సారలమ్మ గద్దెల దర్శనం అనంతరం మొక్కులు కానుకలు చెల్లించారు. వెంటనే స్నేహితులతో కలిసి సమీపంలోని జంపన్న వాగులోకి వెళ్లారు. ప్రమాదవశాత్తు మనీష్ వాగులో మునిగి గల్లంతయ్యారు. తోటి స్నేహితులు వాగులో గాలింపులు చేపట్టినప్పటికీ లభ్యం కాలేదు. దీంతో పోలీసులకు ఆర్డిఎఫ్ బృందానికి సమాచారం అందించారు. వెంటనే రంగంలోకి దిగిన ఎన్ డి ఆర్ ఎఫ్ బృందం మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్‌లు, రెవెన్యూ, ఎన్ డి ఆర్ ఎఫ్ బృందం గజ ఈతగాళ్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి

కమ్యూనిస్టు కార్యకర్తలు కృషి చేయాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కమ్యూనిస్టు కార్యకర్తలు కృషి చేయాలని, అవసరమైతే ప్రజలను సమీకరించి ఉద్యమాలు చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా తెలిపారు. సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌లో ఆదివారం జరిగిన సిపిఐ లక్ష్మీదేవిపల్లి మండల సమితి సమావేశానికి అయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం స్థానిక శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లో తీసుకెళ్లడం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, పోడు భూముల సమస్య, ఫారెస్టు అధికారుల దాడులు తదితర డిమాండ్ల పరిస్కారంకోసం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం జరగనున్న కలెక్టర్ కార్యాలయం ముట్టడికి పార్టీలకతీతంగా జిల్లా నలుమూలల నుంచి వ్యవసాయ కార్మికులు, పార్టీ, ప్రజాసంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. అదేవిధంగా 9న కొత్తగూడెం క్లబ్ లో సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి, అమరజీవి సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల నాయకులు దీటి లక్ష్మి పతి, కె రత్నకుమారి, మామిడాల ధనలక్ష్మి, నూనావత్ గోవిందు, కంటెం శ్రీనివాసరావు, శాపావత్ రవి, కళ్లెం పూర్ణచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ కుటుంబాలకు పీటర్, ప్రమీల దంపతులు ఆదర్శం

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : సమాజంలో శాంతిని నెలకొల్పేందుకు, ప్రజల మధ్య సోదరభావాన్ని నింపేందుకు యేసుక్రీస్తు బోధనలను ప్రచారం చేస్తూ తమవంతు కృషిని కొనసాగించిన కోరి జాన్ ఫీటర్, జయ ప్రమీలాలు క్రైస్తవ కుటుంబాలకు ఆదర్శమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా కొనియాడారు. నేటితరం వారి అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రామవరం ఏరియా వన్నందాస్ గడ్డకు చెందిన చర్చి కమిటీ మాజీ నాయకులు జాన్ పీటర్ సతీమణి, చర్చి స్త్రీలమైత్రం సంఘం నాయకురాలు జయ ప్రమీల (60) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. మృతదేహాన్ని సందర్శించిన సాబీర్ పాషా పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన అంతమయాత్రలో కాఫిన్ ను మోసి వారి కుటుంబంతో ఉన్న సాన్నిహిత్యాన్ని చాటారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కమ్యూనిస్టులను ఫీటర్ కుటుంబం ఆదరించేవారన్నారు. ప్రజా ఉద్యమాలను ప్రోత్సహించేవారని గుర్తు చేసారు. ఈ కార్యక్రమంలొ సిపిఐ నాయకులు మునిగడప వెంకటేశ్వర్లు, గుత్తుల శ్రీనివాస్, ఎస్ వి. రామారావు, తొగరు నరేంద్ర కుమార్, ఆది మల్లయ్య, కదారి మల్లేష్ తదితరులు వున్నారు.

ఉపాధ్యాయులు జాతి నిర్మాతలు

విశాలాంధ్ర - కొత్తగూడెం : సమాజంలో ఎక్కడై నా ఉపాధ్యాయులు జాతి నిర్మాతలుగా, దిశా నిర్దేశకులుగా ఉంటారని రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ ఎస్.వి.రామ్ ప్రసాద్ అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం జరిగిన నేషన్ బిల్డర్ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అయన మాట్లాడారు. రోటరీ ముఖ్యంగా శాంతి సందేశాన్ని ప్రపంచవ్యాప్తంగా వ్యాప్తి చేయడమే కాక, పోలియో నిర్మూలనకి కృషి చేస్తుందన్నారు. రోటరీ కార్యక్రమా ల్లో భాగంగా విద్య, పర్యావరణ పరిరక్షణ, మాతా శిశు ఆరోగ్య పరిరక్షణ, మహిళా సాధికారత, సమాజ అభివృద్ధి వంటి రంగాలలో పనిచేస్తూ దాదాపు 220 దేశాలలో విస్తరించి ఉన్న అతిపెద్ద సేవా సంస్థ అని వివరించారు. ఈ సందర్భంగా హాజరైన మరో అతిథి పూర్వ జిల్లా గవర్నర్ జె.అబ్రహం మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం 36 సంవత్సరాల చరిత్ర కలిగి ఉందన్నారు. రాష్ట్రంలోనే మొట్టమొదటి లింబ్ సెంటర్‌ను ఏర్పాటు చేసిన క్లబ్ అని తెలిపారు. జిల్లాలోని డిగ్రీ కళాశాలలు, ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల నుండి అత్యుత్తమ సేవలందించిన 15 మంది ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులను సత్కరించారు. ఇదే కార్యక్రమంలో వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన నలుగురు వ్యక్తులకు కూడా ఒకేషనల్ అవార్డు అందజేశారు. కొత్తగూడెం అధ్యక్షులు జక్కుల రవికుమార్, ప్రధాన కార్యదర్శి ఎస్. చలపతిరావు, రోటరీ వొకేషనల్ డైరెక్టర్ పి. సుజాత, క్లబ్ ట్రైనర్ ఉండేటి ఆనందకుమార్, సీనియర్ రోటరీ సభ్యులు అంకం పాపయ్య, రోటరీ సభ్యులు నాగరాజశేఖర్, ప్రసన్నకుమార్, పి. వెంకట్రామయ్య, పాతూరి. దుర్గారాణి, పోసాని. అరుణ, సిరిమళ్ళ సత్యనారాయణ, పగడాల. సుధారాణి, అవార్డు గ్రహీతలైన ఉపాధ్యాయులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

చంద్ర గ్రహణం ఒక సహజ ఖగోళ సంఘటన

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : చంద్రగ్రహణం అనేది ఖగోళ సహజమైన ప్రక్రియ మాత్రమే అని దీనిపై ఉన్న మూఢనమ్మకాలను నివారించాల్సిన బాధ్యత సమాజంలోని విజ్ఞులపై ఎంతైనా ఉందని శాస్త్రీయ అధ్యయన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు చార్వాక అన్నారు. ఆదివారం సంపూర్ణ చంద్రగ్రహణం జరగనున్న నేపథ్యంలో ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. పూర్వ కాలంలో చంద్ర గ్రహణాన్ని ఒక అద్భుతం గానో లేదా శకునం గానో భావించేవరని గుర్తు చేసారు. సమాజంలో ఎవరి విశ్వాసాలు వారికి ఉన్నప్పటికీ శాస్త్రీయ దృక్పథం కూడా ఎంతైనా అవసరమన్నారు. అప్పుడే చైతన్యవంత నవ సమాజ నిర్మాణం సాధ్యమన్నారు. ప్రపంచ సమాజం ఆధునికంగా అభివృద్ధి చెందినప్పటికీ మన భారతదేశంలొ ఇంకా అధిక శాతం మంది చంద్రగ్రహణంపై అనేక అపోహలు, మూఢనమ్మకాలు కలిగి ఉండటం బాధాకరమన్నారు. చంద్ర గ్రహణం అనేది సూర్యుడు, భూమి, చంద్రుడు ఒకే సరళరేఖలోకి వచ్చినప్పుడు భూమి నీడ చంద్రుడిపై పడుతుందన్నారు. దీన్నే చంద్ర గ్రహణం అంటారన్నారు. ఈ సమయంలో భూమి నీడ పూర్తిగా చంద్రుడి మీద పడినప్పుడు దాన్ని సంపూర్ణ చంద్ర గ్రహణం అంటారని చార్వాక వివరించారు. అలాగే భూమి నీడ చంద్రుడిపై ఒక భాగం మాత్రమే పడితే దాన్ని పాక్షిక చంద్ర గ్రహణం అంటారన్నారు. కానీ మన దేశంలో గ్రహణ సమయంలో చాలా రకాల మూఢనమ్మకాలు ఇప్పటికీ అనుసరించటం శోచనీయమన్నారు. ముఖ్యంగా గ్రహణ సమయంలో సూత కాలమని ఆ సమయంలో ఎటువంటి పనులు చేయొద్దని అలా చేస్తే అరిష్టం మని నమ్మడం విచిత్రమన్నారు. గ్రహణ సమయంలో తినడం, తాగడం, గర్భిణీ స్త్రీలు బయటికి రావద్దని, గ్రహణం వల్ల అనర్థాలు సంభవిస్తాయి ఇలా ఎన్నో రకాల మూఢ నమ్మకాలు ఇప్పటికీ మనదేశంలో నమ్ముతున్నారని చెప్పారు. గ్రహణ సమయం అద్భుత ఆవిష్కరణ అని దీన్ని ప్రతిఒక్కరు చూడాలని కోరారు. ఖగోళ శాస్త్రజ్ఞులకు పరిశోధనకు ఒక మంచి అవకాశం ఇస్తుందన్నారు. మూఢనమ్మకాలను విద్యావంతులు నిర్మూలించాలని పిలుపునిచ్చారు.

కవితా వైతాళికుడు కాళోజీ

సాహితి

డా. తిరునగరి శ్రీనివాస్
9441464764

సమాజమే తన కార్యరంగమని భావించిన కవికి ప్రజల పక్షాన నిలిచి నిలేయాల్సిన అన్యాయాలెన్నో స్పష్టంగా కన్పిస్తాయి. తన అక్షరం చేయాల్సిన యుద్ధం ప్రజలున్న చోటే అని నిర్ణయించుకొని సమాజంలో పేరుకుపోయిన అన్యాయం, అకృత్యం, అసమానతలపై ధైర్యంగా నిరసన గళం వినిపించిన కవి కాళోజీ. పేదోడి పక్షాన నిలిచి అక్షరాయుధం ప్రయోగించిన కవి కాళోజీ. చెప్పాలనుకున్నది చెప్పేసి, రాయాలనుకున్నది రాసేసి కుండబద్ధలు కొట్టిన జనం కవి, అక్షర శ్రీమంతుడు కాళోజీ.

తాడిత, పీడిత ప్రజల పక్షపాతిగా నిఖార్సైన కవిత్వాన్ని నిగ్గుటద్దంగా చూపిన ప్రజామిత్రుడు కాళోజీ. ఆవేదన, ఆలోచన, చేతనలు ఆయన కవిత్వంలోని ప్రతిపదంలో తలెత్తి కన్పిస్తాయి. నిజంగా ఆయన సిరాలోంచి ఒలికి కాగితంపై రాలిన ప్రతి అక్షరం లక్షలకు కాదు కోట్ల మెదళ్లకు పెను కదలికే. ప్రతి అక్షరాన్ని నిప్పురవ్వ అంటుకున్న బతుకు పాటగా, నిజం రాతగా మార్చిన మహనీయ, మానవీయ కవి కాళోజీ.

మన పిల్లలను చంపి మనల బంధించిన
మానవాధములను మండలాధీశులను
మరచిపోకుండా గురుతుంచుకోవాలె
కసి ఆరిపోకుండ బుసకొట్టుచుండాలె
కాలంబు రాగానే కాటేసి తీరాలె

అంటూ రజాకార్లపై ఆయన రాసిన కవిత మొత్తం ప్రజల కోపాగ్నికి ప్రతీక. కాళోజీ అంతర్జాతీయ కవి. ఖండాంతరాలకు ఆయన కవిత్వ జ్యోతులు ప్రసరించాయి. ఏ వెలుగులకీ ప్రస్థానం అని ప్రశ్నించినపుడు ప్రతి పేదవాడి గుండెల్లో కవిత్వ దీప శిఖగా తప్పనిసరిగా నిలిచి వెలిగే కవి కాళోజీ.

కవిగా ఖచ్చితమైన అభిప్రాయాలను నొక్కి చెప్పిన కాళోజీ వెనకాడని కవిత్వాన్ని సామాజిక యవనికపై దర్శింపజేశారు. ప్రజలు మాట్లాడే జీవభాష వ్యవహారికమేనని అన్నారు. జీవధాతువు ముమ్మాటికీ మాండలికమేనని చెప్పి అదే కోవలో, కోణంలో కవిత్వాన్ని రాసి మెప్పించి ఒప్పించారు కాళోజీ.

రెండున్నర జిల్లాలదే దండి బాస అయినప్పుడు
తక్కినోళ్ల నోళ్ల యాస/ తొక్కి నొక్కబడ్డప్పుడు
ప్రత్యేకంగా రాజ్యంపాలు/ కోరడం తప్పదు. అంటే ఆంధ్రప్రాంతపు



భాషావాదులను ఏనాడో హెచ్చరించారు కాళోజీ. పాతివ్రత్యం అన్న పదానికి పార్టీవ్రత్యం అన్న పదబంధాన్ని కాళోజీయే రూపొందించి సమకాలీన స్వార్థ రాజకీయాలను కవిత్వ ఎజెండాతో ఎండగట్టిన ధీశాలి.

సమకాలీన సామాజిక దృక్పథం మెండుగా కలిగిన కాళోజీ కవితామూర్తిమత్వానికి ప్రతిబింబం నా గొడవ. నిజానికి సమాజంలోని అందరి గొడవను తన గొడవగా చేసుకొని ఈ కవిత్వ సంకలనాన్ని వెలకట్టలేని అమూల్య ఆధునిక కవిత్వ నిధిగా అందించారు కాళోజీ. ఎక్కడా రాజీపడని ధోరణిని నా గొడవలో కనబరిచిన కవిగా పీడిత పక్షపాతిగా కాళోజీ కనిపించారు. కులమతాతీత ప్రజాస్వామ్య వైఖరిని కనబరిచి తన ప్రగతిశీల దృక్పథమేమిటో అర్థమయ్యేలా చేశారు. బతుకే ప్రజలు, ఉద్యమాలుగా సామాజిక జీవనాన్ని కొనసాగిస్తూ కవిత్వంతో ఎంతో శక్తినిచ్చే భావప్రసారాన్ని కాళోజీ అందించడంలో సఫలీకృతులయ్యారు.

స్వేచ్ఛ, వ్యక్తిత్వం అన్న రెండు మనిషి ప్రధానాంశాలని చెప్పి కవిత్వంలో వాటిని నూటికి నూరుశాతం ఆచరించి చూపిన మానవీయ కవి కాళోజీ. నిరసన గళానికి, ఎలుగెత్తే ప్రశ్నకు నిజరూపం కాళోజీ.

కవిగా, ఉద్యమకారునిగా ఆయనది వైవిధ్యమైన పాత్ర. తెలంగాణ వైతాళికునిగా కాళోజీని పేర్కొని తీరాలి. ఇక్కడి సాంస్కృతిక వాతావరణంలోంచి ఆయన క్రమంగా ఎదిగి శిఖర ప్రస్థానం చేశారు. తెలంగాణేతరుల మనసును కూడా గెలుచుకున్న విశిష్ట ప్రజాకవి కాళోజీ, ప్రజాస్వామ్యంలో ఓటు విలువను తెలియజెబుతూ ఓటు వేసేప్పుడే ఆలోచనకు పదను పెట్టమని ప్రజలను హెచ్చరించిన ప్రజాస్వామ్య సామ్యవాది కాళోజీ. నీ అభిప్రాయాల్ని స్వేచ్ఛగా ప్రకటించే నీ హక్కుల కోసం అవసరమైతే నా ప్రాణాలైనా ఇచ్చి పోరాడుతా అని చెప్పిన కాళోజీ నిరంకుశ ప్రభుత్వాలను వెనకా ముందులు చూడకుండా నిర్భీతితో ఎదిరించారనడానికి ఆయన కవిత్వమే నిదర్శనం.

జీవితం, కవిత్వం రెండింటినీ తన చివరి ఊపిరి వరకు భావితరాలకు ఆదర్శప్రాయంగా నడిపిన మహాకవి, తెలంగాణ సాహిత్యపు సిరి కాళోజీ. జీవించినంత కాలం రాసి, వెళ్లిపోయిన తరువాత కూడా తన జ్ఞాపకాలను కవిత్వంతో గుర్తు చేస్తూ పదనిర్దేశనం చేస్తున్న కవిగా సదాస్మరణీయులు కాళోజీ. పుటకనీది, చావు నీది, బతుకంతా దేశానిది అన్నట్టుగా దేశం, సమాజం కోసం బతికిన కవి ఆయన. తన అభిప్రాయాలకు సన్నిహిత భావాలు ఇతర భాషలలో కనపడ్డప్పుడు వాటితో తాదాత్మ్యం పొంది తెలుగు పాఠకుల కోసం అనువదించారు కాళోజీ. ఖలీల్ జిబ్రాన్ రాసిన దిప్రాఫెట్‌ను ఆయన తెలుగులోకి జీవనగీతగా కాళోజీ అనువదించారు. నిర్భయంగా మాట్లాడి అదే ప్రకంపనాన్ని కవిత్వంలోనూ చూపిన ధీశాలి కాళోజీ. మహాకవి శ్రీశ్రీ కాళోజీని ఫ్రెంచ్‌కవి లూయీ ఆరగాన్‌తో పోల్చారు. మహా విశ్వాసాన్ని వెల్లడించిన కవిత్వాన్ని రాసిన ఖచ్చితమైన కవి కాళోజీ. నిరంకుశత్వంపై ఎగసిన బావుటా. అన్యాయంపై ఎగిసిపడ్డ కవితాగ్ని శిఖ. ధిక్కార స్వర సమరశీలి.

తెలంగాణ సాంస్కృతిక వారసత్వం నుంచి ఎదిగి వచ్చిన అక్షర కాంతిపుంజం కాళోజీ. పోరాడేతత్వం, సామాజిక స్పృహ ఉన్నంత కాలం కాళోజీ కనిపించి, వినిపిస్తూనే వుంటారు. కవిత్వంగా, కాలాతీతుడైన ప్రజాకవిగా కాళోజీకి తాను ప్రాతినిథ్యం వహిస్తున్న ప్రజలు, వాళ్ల ప్రయోజనాలు, విలువలు బాగా తెలుసు కనుకే వర్గ దృష్టికాకుండా మానవతా దృష్టిని కనబరచి కవిత్వం రాశారు. శ్రీశ్రీని ప్రజలు ఎలా తీసుకున్నారో కాళోజీని కూడా అలాగే తీసుకున్నారు.

పదవులకు, ప్రలోభాలకు, ఆస్తులకు, అంతస్తులకు లోబడని దటీజ్ కాళోజీ అంటారొక చోట వరవరరావు. నాకు స్నేహితులూ స్ట్రేంజర్సే... కానీ పరిచయస్తులు వుండరు అని స్వయంగా తానే చెప్పుకున్న కాళోజీ కవిత్వానికి పరిచయస్తులు కాని వారుండరంటే అతిశయోక్తి కాదు. అణగారిన శ్రమజీవులు నిర్మిస్తున్న పోరాట చరిత్రను అవగతం చేసుకుని అడుగులేసిన కవి. పథికుడెవరో, పామరుడెవరో, మిత్రుడెవరో, శత్రువెవరో తెలియక ఎంతో నిజాయితీగా, నిర్భయంగా సాగిన కవితాప్రయాణం కాళోజీది. ఎవరి మాట కోసమో, పొగడ్త కోసమో, సంకీర్తన కోసమో ఆయన సిరా పొంగి ప్రవహించలేదు. సహజంగా, స్వేచ్ఛగా జన జీవన సజీవ సత్యాల్ని ఆవిష్కరించింది.

జన ప్రవాహమే తన కవిత్వానికి పుట్టుక అన్నది గ్రహించి నడిచిన పోరాటపు అగ్నిశిఖ కాళోజీ. మాట్లాడని నోరు, కష్టం చేసి తిననోచని చేతులు, సేవచేసి ప్రేమించనోచని శరీరం, మనిషి స్పర్శనోచని మనిషి కాళోజీ స్వభావానికి సరిపడవు. కంట్లో కన్నీరును కత్తిగా మలచుకోండి అని ఒకచోట అంటారు కాళోజీ. తన బతుకంతా దేశానిదైన మనిషిగా ఆయన కన్పిస్తారు. ఎక్కడ అన్యాయం జరిగినా అక్కడే ధిక్కార స్వరమై వినిపించారు. పోరాడే తత్వం, సామాజిక స్పృహ, మనిషి చుట్టూరా కాటేసే కాలనాగులు కదులుతూ సమస్యలు చీకట్లను పెనవేస్తున్నంత కాలం - కాళోజీ కవితా రక్షణ కవచమై కనిపించి, విన్పిస్తూనే వుంటారు కవిత్వంగా, కాలాతీతుడైన ప్రజల కవిగా కాళోజీ బతుకు ఆదర్శం... అది మనిషితనానికి కొలమాన సదృశం. ప్రజల కవితకు ఒరవడులు అద్ది నిప్పుసెగల వెలుతురుని పరివ్యాప్తంగా ప్రసరింపజేసిన మానవ జీవన కవితా వీచిక కాళోజీ. నిర్భీతికి, నిర్భయత్వానికి నిదర్శనం కాళోజీ. సమాజాన్ని తన కవిత్వంతో ప్రభావితం చేసిన అత్యంత శక్తిమంతుడు. స్వచ్ఛత, సూటిదనం, నచ్చకుంటే నిరసన, విపరీత ప్రవృత్తుల పట్ల ఖండన వంటి లక్షణాలు కాళోజీకి రక్తగతమయ్యాయి. సామాజిక కవిగా, పేదోడి అక్షర చిరునామాగా చిరస్థాయి కీర్తిని కాళోజీ పొందారు.

(9 సెప్టెంబర్ కాళోజీ జయంతి...)

ఎగరేసిన ఎర్రజెండా చరితరా

పల్లవి:
ఎగరేసిన ఎర్రజెండా చరితరా
సురవరం
మనదేశపు అరుణారుణ కాంతిరా
సుధాకరం
ఎల్లలు లేని జెండా ఎత్తినవాడు
ప్రాణం పోయేవరకు దించనివాడు
లాల్ సలాం లాల్ సలాం అందుకో
సృజనశీలి
లాల్ సలాం లాల్ సలాం
పోరు దండమందుకో
త్యాగశీలి

చరణం:
నీ స్వరమే భాస్వరం
నీ పలుకే చైతన్యం
నీ పిలుపే ప్రభంజనం
నీ అడుగే నీరాజనం
నువ్వు నడిచిన మార్గాన
పీడిత జన విప్లవం
ఎనలేని ఉద్యమాల
మార్గదర్శివి
ఎర్రజెండా జాతీయ
కార్యదర్శివి

చరణం 2
నీ అడుగే సంచలనం
నీ మౌనమే ఓ యుద్ధం
నీ చెలిమే సిద్ధాంతం
నీ తోడే మాకు బలం
నువ్వు చూపిన ఎర్రబాట
సదా మాకు ఆచరణం
ఎన్నుకున్న సిద్ధాంతపు
వెన్నుపూసవి
ఎర్ర ఎర్రని వనంలో
వెలుగు రేఖవి

చరణం 3
నీ మరణం ఓ జననం
నీ దూరం సమీపం
నీ గమనం గతి తర్కం
నువ్వు ఎగిరిన పతాకం
నువ్వు నింగిన అరుణతార
జ్వలించే అగ్నిధార
అధ్యయనపు ఆలోచన
అగ్రగామివి
శిఖరాగ్రం నిలిచిన
సింధూరానివి

దేవరకొండ శ్రీనివాస్,
ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు

మట్టి-మనిషి



మనిషితో బంధం కన్నా
మట్టితో బంధం మిన్న

మగని కట్టే తాళి కన్నా
మాగాణికి కట్టే కంచె మిన్న

మాతృత్వంలో మాధుర్యం కన్నా
మట్టిలో మొలిచే విత్తు మిన్న

మాస్టారు నేర్పిన రాత కన్నా
మట్టిలో రాసిన నాగలి రాత మిన్న

మనిషిని నమ్మి మోసపోవడం కన్నా
మట్టిని నమ్మి మేల్కొవడం మిన్న

మనిషి కోరే ధన మూటలు కన్నా
మడిలో పండే ధాన్య మూటలు మిన్న

మనిషికి అక్షరజ్ఞానం కన్నా
మట్టి అందించే అన్నం విత్తు మిన్న
మనిషి మేధస్సుతో అభివృద్ధి అబద్ధం.

అది అతని సౌకర్యంకోసం శ్రమించే స్వార్థం
మానవ లోకంలో సకల జీవరాశులకు
కడుపు నింపేది మట్టి మనిషే.....
మనిషి కనుగొన్న యంత్రంలో
మనిషి యాంత్రికుడుగా మారి
కనుమరుగయ్యేడెమో......???
మట్టినినమ్మే మనిషిమాత్రం
మట్టి కొట్టుకుపోలేదు
మట్టిలో మాణిక్యం అయ్యాడు.

మనిషిని కన్న అమ్మ కన్నా
మొక్కను కన్న అమ్మ మిన్న
మనిషి జీవనం మట్టితో....
మనిషి మరణంతో మట్టి గర్భంలో....

మనిషి మరణం తరువాత
ఒడి చేరే ఈ అమ్మే మిన్న..... ??

డా. జి. మాలతి,
9490824860

రాబోయే తరాల వెలుగు - ఈ తెలుగు కథకుల సాహితీ జిలుగు

శైలజామిత్ర, 9290900879

గ్రంథ సమీక్ష

తెలుగు కథా సాహిత్యం అనేది కేవలం పదాల సమాహారం కాదు. అది మన మనసుల లోతుల్లో అల్లుకున్న భావాల, అనుభవాల, విలువల ప్రతిబింబం. వీరు రచించిన ప్రతి రచన వెనుక, ఒక వ్యక్తి మాత్రమే కాదు, ఒకయుగం, ఒకసమాజం, ఒకతరం శ్వాసిస్తుంది. ముఖ్యంగా తెలుగు కథా సాహిత్యంలో భాష, శ్వాస అన్నీ అనుభవాల అద్దాలే. ప్రఖ్యాత కథారచయిత ఎమ్ఆర్వీ సత్యనారాయణమూర్తి గారు చేసిన పరిశోధన వంటి ఈ రచన ఎందరో మహానుభావుల సాహిత్య యాత్ర. ఇది ప్రతి తరానికి అందివ్వాల్సిన ఖనిజం. తెలుగు భాషలో కథకు ఎంతో ప్రాధాన్యత వుంది. మంచికథ కనిపిస్తే ఆలకించి వినే పాఠకులూ వున్నారు. అందుకే కాబోలు ఈ రచయిత ఇంతటి మహోన్నత కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

వీరు చేసిన ఈ పరిశోధనలో ఎందరో కథా ప్రముఖులు వున్నారు. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి మొదలుకొని పాలగుమ్మి పద్మరాజు, పెద్దిభొట్ల సుబ్బరామయ్య, పోరంకి దక్షిణామూర్తి, పాలగుమ్మి పద్మరాజు, మాలతీచందూర్, మధురాంతకం రాజారాం, చాసో భరాగో, మునిపల్లెరాజు, బుచ్చిబాబు, కేతు విశ్వనాథరెడ్డి, దేవరకొండ బాలగంగాధర తిలక్, భానుమతీ రామకృష్ణ, మునిమాణిక్య నరసింహారావు వంటి ప్రతిష్టాత్మకమైన కలాల గురించి చర్చ లేదా పరిశోధన అంటే నిజంగా ఇది చారిత్రక నిర్ణయమే. శ్రీపాద వారి కలం చాతుర్యానికి, పద్మరాజు అంతర్జాతీయ ఖ్యాతికి, సుబ్బరామయ్య మధ్యతరగతి మనసు వాసనకు ఈ వ్యాసాలు ఆత్మీయ నివాళులు. వీరు రచించిన కథల సన్నివేశాలు మన కళ్లముందు తిరిగేలా, పాత్రలు మనతో పక్కపక్కన నడిచేలా, సంఘటనలు మన హృదయాన్ని కదిలించేలా ఈ రచయిత వివరిస్తూవచ్చారు. ఈ వ్యాసాలు కేవలం సాహితీచరిత్రలు కావు. భాషపై మమకారం, పాఠకుని హృదయానికి చేరే ఆత్మీయత. చదువరులు ఈ పుటల్లోకి అడుగుపెట్టినపుడు, కథల మాధుర్యాన్ని మాత్రమే కాక, వాటి వెనుక దాగిన కాలపువాసన, మానవత్వపు తాకిడి, సమాజపు చలనం కూడా అనుభూతి చేస్తారు. ఈ ప్రయత్నం తెలుగు కథాసాహిత్యం పట్ల ఈ రచయితకు ఉన్న ప్రేమను, గౌరవాన్ని, కృతజ్ఞతను తెలుపడమే కాకుండా సమకాలీన పాఠకుడి హృదయంలో కొత్త వెలుగులు వెలిగిస్తాయనడంలో సందేహం లేదు.

అలాగే ఈ సంకలనంలో కథాప్రసిద్ధులు శ్రీ పోరంకి దక్షిణామూర్తి, మాలతీ చందూర్, మధురాంతకం రాజారాం, మునిపల్లె రాజు, బుచ్చిబాబు వీరిలో ఒక్కొక్కరూ తమదైన పద్ధతిలో కథారచనకు పట్టంకట్టి తెలుగు భాషను సంపన్నం చేశారు. వారి రచనలు మనకు కేవలం కథలు, వ్యాసాలు, నవలలు మాత్రమే కాదు మానవ మనస్తత్వం, సామాజిక మార్పు, సాంస్కృతిక విలువలపై ఆలోచించేటట్లు చేసే అద్దాలవంటివి.

నిజానికి ఈ వ్యాసాలను పాఠకులకు అందించే ఈ రచయిత ఎమ్ఆర్వీ సత్యనారాయణమూర్తి కూడా చక్కని కథా రచయిత. కథా రచనలో వీరి శైలికి ఒక ప్రత్యేకత వుంది. తెలుగు సాహిత్యానికి నిరంతరం తమ వంతు సేవ చేస్తూ తెలుగు సాహితీ చరిత్రలో నిలిచిపోయే దిశగా వీరి ప్రయాణం సాగుతుందనేది నిర్వివాదాంశం. ఉదాహరణకు ఈ వ్యాసాలలో ప్రతి రచయిత గురించి చెప్పినప్పుడు, అది కేవలం బయోగ్రఫీ కాదని పాఠకుడు గ్రహించాలనే ప్రయత్నిస్తారు. ఇక్కడ వ్యక్తిగత పరిచయం, అనుభవాలు, ఆప్యాయతా క్షణాలు, సాహిత్యానుభవం ఇవన్నీ ఒకే గూటిలో కూర్చబడి ఉన్నాయి. అందుకే ఈ పుటలు చదివేటప్పుడు, మనం గ్రంథాలయంలో కూర్చుని పుస్తకాలను తిరగేస్తున్నట్టు కాదు వారి సన్నిధిలో కూర్చుని, వారుచెప్పే మాటలు వింటున్నట్టు అనిపిస్తుంది. అదే ఈ రచయిత ఘనత.

ఈ సంకలనం ద్వారా పాతతరానికి జీవాన్ని అందిస్తూ, కొత్తతరానికి దారిచూపేలా సాగింది. ఇది గతాన్ని మాత్రమే కాదు, భవిష్యత్తును కూడా స్పృశించే ఒక యాత్ర. తెలుగు సాహిత్యం అనేది వేల సంవత్సరాల పర్యవసానం. ఈ భాషలో రాసిన ప్రతిరచన, మన భౌతిక చరిత్రకంటే లోతైన ఒక సాంస్కృతిక వంశవృక్షానికి సాక్ష్యం. ఆ వృక్షానికి మూలాలు భక్తి, జ్ఞానం, అనుభవం, ఆత్మాన్వేషణలతో నిండి ఉన్నాయి.

ఇరవయ్యవ శతాబ్దం మధ్య నుంచి, తెలుగు సాహిత్యం నూతన దిశల్లో విస్తరించింది. సాంప్రదాయపు బాటలోనే కాక, ఆధునికత, సామాజిక చైతన్యం, వ్యక్తిగత అన్వేషణలతో కొత్త అధ్యాయాలు రచించిన వారున్నారు. ఇలాంటి పరిణామంలో ముద్రవేసిన వ్యక్తులలో పోరంకి దక్షిణామూర్తి, మాలతీ చందూర్, పాలగుమ్మి, బుచ్చిబాబు వంటి మహాకథకులు ప్రత్యేక స్థానం పొందారు. వీరి రచనలు కేవలం సాహిత్య కృతులు మాత్రమే కాక, సమాజపు అంతరంగాన్ని ప్రతిబింబించే చారిత్రక పత్రాలు. వారి పదాల వెనుక కాలానికి చెందిన తత్త్వం, ఆవేదన, ఆశ, తిరుగుబాటు అన్నీ కనిపిస్తాయి. ఈ సంకలనంలో ప్రతి

రచయిత గురించి చెప్పిన సందర్భం, పాఠకుడికి కేవలం "ఎవరు" అనే సమాధానమే కాదు, "ఎందుకు" అనే లోతైన ప్రశ్నకు జవాబు కూడా ఇస్తుంది.

ఈ వ్యాసాలు సాహిత్య చరిత్రలోని ఒక స్వర్ణయుగానికి మానవీయ ముఖచిత్రాలు. వీటిని చదవడంఅనేది కాలంతో పాటు ప్రయాణం చేయడం లాంటిది. ఆ యుగపువాసన, మాటల మాధుర్యం, మనుషుల ఆప్యాయతను మళ్లీ అనుభవించడం. భవిష్యత్తు తరాలు ఈ వ్యక్తులను పుస్తకాల పుటలలో కాక, మనసులలో నిలుపుకునేలా చేయడమే ఈ గ్రంథకర్త ఉద్దేశ్యం.

నిజానికి తెలుగు సాహిత్యంలో కేతు విశ్వనాథరెడ్డి రాయలసీమ గ్రామీణ జీవితం, మానవతా దృక్కోణం, స్త్రీ స్వేచ్ఛ, పురుషాధిపత్యంపై విమర్శలతో ప్రసిద్ధి చెందారు. వీరి కథల్లో స్త్రీ ఆత్మగౌరవం, స్వతంత్రత, ఆత్మవిశ్వాసం ప్రతిఫలిస్తాయి. వీరి రచనలు అనేక భాషల్లోకి అనువాదం అయ్యాయి. దేవరకొండ బాల గంగాధరతిలక్ పేదరికం, సామాజిక అసమానతలు, స్వార్థపరుల వాస్తవ రూపాన్ని చూపిన ఘాటైన కథకుడు. నల్లజర్ల రోడ్డు, దొంగ వంటి కథల్లో పేదల పట్ల సానుభూతి, అవినీతిపై వ్యతిరేకత వ్యక్తమవుతుంది. మునిమాణిక్యం నరసింహారావు హాస్యరచనలో ప్రత్యేక ముద్ర వేశారు. మధ్యతరగతి కుటుంబ జీవితం, భార్యాభర్తల అనుబంధం, చిన్న చిన్న సన్నివేశాల్లో హాస్యం, మమత కలిపిన కథలు రాశారు. కాంతం కథల్లో గృహ హాస్యానికి తోడు కరుణరసాన్ని పండించారు. కనుపర్తి వరలక్ష్మమ్మ జాతీయ చైతన్యం, సాంఘిక సంస్కరణలు, స్త్రీ సమస్యలను చర్చిస్తూ వాస్తవ సంఘటనల ఆధారంగా కథలు రాశారు. సౌదామిని అనే కలం పేరుతో పత్రికలలో రచనలు చేస్తూ స్త్రీ చైతన్యాన్ని, కుటుంబ న్యాయాన్ని, సమాజపరమైన ఆలోచనలను ముందుకు తెచ్చారు.

తెలుగు కథాసాహిత్యం అనేది అనేక ముత్యాల సమాహారం. వాటిలో కొన్ని మాత్రమే కాలానుగుణంగా వెలుగొందుతుంటే, కొన్ని మాత్రం తరాలు మారినా పాఠకుల హృదయాల్లో అజరామరాలుగా నిలుస్తాయి. రాచకొండ విశ్వనాథ శాస్త్రి "రావిశాస్త్రి" అని అందరికీ తెలిసిన ఈ మహానుభావుడు అలాంటి అరుదైన కథా రచయితల్లో ఒకరు. వీరి కలం నుంచి వచ్చిన ప్రతి కథలోనూ కేవలం వినోదంకాదు, సమాజంలో అణగారిన వారి గాథ, బలహీనుల బాధ, అన్యాయానికి వ్యతిరేకంగా వినిపించే గళం, మనసును కదిలించే కరుణా రసం తళుకులు కనిపిస్తాయి. బడుగు, బలహీన వర్గాల వాస్తవ జీవనాన్ని, వారి భాషలోనే, వారిశైలిలోనే చెప్పిన కథకుడిగా ఆయన ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించారు. ఈ వ్యాసం ద్వారా మనం రావిశాస్త్రి జీవిత ప్రయాణాన్ని, ఆయన రచనల వెనుక ఉన్న ఆత్మస్ఫూర్తిని, వీరు సృష్టించిన చిరస్మరణీయ కథలను మరోసారి గుర్తుచేసుకుంటాం. పుస్తకాల పుటల్లో మాత్రమే కాదు, పాఠకుల మనసుల్లోనూ ఆయన పాత్రలు ఇంకా జీవిస్తూనే ఉంటాయి.

చాసో (చాగంటి సోమయాజులు) అభ్యుదయ సాహిత్య ఉద్యమంలో ఆచరణతో ముందుండి, తన కలంతో దిగువ వర్గాల నిజ జీవితాన్నే కథా వస్తువుగా మలిచిన మహనీయుడు. గవిరి, చిన్నాజీ, ముసలమ్మ వంటి ఆయన పాత్రలు పాఠకుల మనసుల్లో ఎన్నటికీ చెరిగిపోని ముద్ర వేసాయి. ఆయన కథల్లో మాండలిక భాష, సామాజిక చైతన్యం, కరుణా కలగలిపి, పాఠకుని మనసును ఒక్కసారిగా తాకుతాయి. భమిడిపాటి రామగోపాలం (భరాగో) మధ్యతరగతి జీవితంలోని చిన్నచిన్న సంఘటనలలోని మధురానుభూతులను, భర్త-భార్యల అనుబంధంలోని ఆప్యాయతలను, సహజమైన హాస్యాన్ని చక్కగా అల్లిన కథకుడు. మీకూ కథలే ఇష్టం వంటి కథలు మనసును నవ్వించడమే కాదు, మృదువుగా తడిపేస్తాయి కూడా. ఈ వ్యాసాల ద్వారా, ఉత్తరాంధ్ర సాహిత్య పంథాలోని ఈ మహనీయుల కృషి, వారసత్వం, కథల్లో దాగి ఉన్న సామాజిక, మానవతా విలువలను మళ్లీ ఒకసారి గుర్తుచేసుకుంటాం.

తెలుగు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయిన పేరు భానుమతి రామకృష్ణ. సినీరంగంలోనే కాదు, సంగీతం, రచన, దర్శకత్వం, హాస్యరచన వంటి అనేక రంగాలలో తన ముద్ర వేసి, నిజమైన బహుముఖ ప్రజ్ఞాశాలిగా నిలిచారు. ఆమె సృష్టించిన "అత్తగారు" పాత్ర తెలుగు పాఠకుల మనసుల్లో చిరునవ్వులు పూయించింది. సాధారణ కుటుంబ సంఘటనలను సున్నితంగా, హాస్య రసంతో మేళవించి, పాఠకుల ముందుకు తేవడంలో ఆమెకు సాటిలేదు. ఈ వ్యాసాల్లో భానుమతి అత్తగారి కథలు మనకు వినోదం మాత్రమే కాకుండా, మనుషుల స్వభావాలపై లోతైన పరిశీలన, జీవన విలువలపై చమత్కారమైన సూచనలు కూడా అందిస్తాయి.

గతం గ్రంథాలకే పరిమితం అయ్యిందని చాలామంది వారిని స్మరించడం లేదనే చెప్పాలి. ఈ కాలంలో మన ముందు తరం వారు వేసిన అడుగులు కూడా గమనించాలనేదే ఈ రచయిత వుద్దేశ్యం. ఒక రచయిత తన జీవిత కాలంలో గొప్పరచన చేయక మానరు. కానీ రచన చేయడమే కాదు. మనంచేసే పనిలో క్రమశిక్షణ, నిర్దిష్టత, స్వచ్ఛత, వాస్తవం వంటి విలువైన ప్రకరణలు ఎంతలా నమ్మేవారో అనేది గ్రహించాలి. ఎందుకంటే రచన సమాజానికి సంబంధించినది. సమాజ శ్రేయస్సును నిత్యం కోరుకునేది. అలాంటప్పుడు మనం మన రచనల ద్వారా ఏమి చెబుతున్నామో దానిని ఒక రచయిత పాటించడం అవసరం కదా అనే విషయాన్ని తెలుసుకుని వుండాలి. అలా తెలపాలనేదే ఈ రచయిత ఎమ్ఆర్వీ సత్యనారాయణ మూర్తి మూల వుద్దేశ్యం. ఈ ప్రయత్నం రాబోయే తరాలకు ఎంతో ఉపయుక్తమైంది.

ఐటీ సంస్థలను కాపాడుకుంటాం: కేంద్రమంత్రి

న్యూఢిల్లీ: దాదాపు 300 బిలియన్ డాలర్ల విలువైన భారత ఐటీ పరిశ్రమను కాపాడేందుకు అమెరికాతో కలిసి పనిచేస్తున్నామని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. ఆయన ఆదివారం ఓ ఆంగ్ల వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అనేక విషయాలు మాట్లాడారు. అమెరికాలో ట్రంప్ సర్కారు భారత ఐటీ ఔట్‌సోర్సింగ్ సంస్థలను లక్ష్యంగా చేసుకోవచ్చనే భయాలు వ్యాపిస్తున్న వేళ మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, ఇతర సర్వీస్ ఆపరేషన్లను భారత్‌లో నిర్వహిస్తున్న బహుళజాతి సంస్థలతో నిత్యం సంప్రదింపులు చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. మరోవైపు అమెరికా, ఐరోపా, జపాన్, ఆసియా దేశాల ప్రభుత్వాలతోనూ మాట్లాడుతున్నట్లు చెప్పారు. అదే సమయంలో కేవలం ఐటీ రంగంపైనే ఆధారపడకుండా ప్రభుత్వం ఎలక్ట్రానిక్స్, తయారీ రంగాలను ప్రోత్సహించేందుకు వేగంగా చర్యలు చేపడుతోందన్నారు. ఇటీవల కాలంలో స్మార్ట్ ఫోన్ల మార్కెట్‌లో భారత్ వాటా పెరిగిందన్నారు. భారత ఐటీ సేవల రంగంలో దాదాపు 5.67 మిలియన్ల మంది ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు.

ట్రంప్ శాంతి బహుమతి ఆరాటం: సల్మాన్

ముంబై: నోబెల్ శాంతి బహుమతి కోసం ఆరాటపడుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై బాలీవుడ్ అగ్రకథానాయకుడు సల్మాన్ ఖాన్ పరోక్షంగా విమర్శలు చేశారు. బిగ్‌బాస్ 19వ సీజన్ తొలి వీకెండ్ ఎపిసోడ్‌లో హోస్ట్ సల్మాన్. హౌస్‌లో జరిగే గొడవలు, విభేదాలపై కంటెస్టెంట్‌లతో మాట్లాడారు. కొంత మంది పోటీదారులు వివాదాలకు ఆజ్యం పోస్తూ... శాంతి దూతలుగా నటిస్తున్నారంటూ సల్మాన్ మండిపడ్డారు. 'ప్రపంచంలో ఏం జరుగుతోంది? సమస్యలను వ్యాప్తి చేసే వారే... శాంతి బహుమతి కావాలని కోరుకుంటున్నారు' అని వ్యాఖ్యానించారు. ట్రంప్ పేరును సల్మాన్ ప్రస్తావించనప్పటికీ... అమెరికా అధ్యక్షుడిపైనే ఈ వ్యాఖ్యలు చేశారంటూ వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. 'బీబీలో ట్రంప్‌పై విరుచుకుపడ్డ సల్మాన్' అనే కాప్షన్‌తో ఓ నెటిజన్ వీడియో పోస్ట్ చేశారు. సల్మాన్ మంచి పని చేశారంటూ ట్రంప్ స్పందన కోసం వేచి ఉందామని మరొక నెటిజన్ రాసుకొచ్చారు. భారత్- పాక్‌తో సహా ఏడు యుద్ధాలు ఆపానంటూ సందర్భం వచ్చినప్పుడల్లా ట్రంప్ చెబుతూనే ఉన్నారు. ట్రంప్ వ్యాఖ్యలను భారత్ ఖండించింది.

రెండో తరగతి విద్యార్థినితో 100 గుంజీలు

రాయ్‌పూర్: క్రమశిక్షణ పేరుతో ఓ టీచర్ రెండో తరగతి విద్యార్థినితో 100 గుంజీలు తీయించింది. దీంతో ఆ చిన్నారి తీవ్ర అనారోగ్యానికి గురైంది. చత్తీస్‌గఢ్‌లో చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రతాప్‌గఢ్‌లోని ఓ పాఠశాలలో అడగకుండా టాయిలెట్‌కు వెళ్లిందనే కారణంతో ఎనిమిదేళ్ల బాలికతో ఉపాధ్యాయురాలు నమ్రతా గుప్తా బలవంతంగా 100 గుంజీలు తీయించింది. అనంతరం చిన్నారిని కర్రతో కొట్టింది. బాలిక తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో కుటుంబసభ్యులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. ఎక్కువ మొత్తంలో గుంజీలు తీయడంతో బాలిక కాళ్లలో కండరాలు దెబ్బతిన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయంపై పాఠశాల ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని విద్యార్థిని కుటుంబసభ్యులు ఆరోపించారు. టీచర్ గుంజీలు తీయించడం వల్ల ప్రస్తుతం తమ చిన్నారి నడవలేకపోతోందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం జిల్లా విద్యాశాఖ దృష్టికి వెళ్లడంతో ఘటనపై దర్యాప్తునకు ఓ బృందాన్ని ఏర్పాటు చేసింది. అయితే బాలికతో గుంజీలు తీయించిన ఉపాధ్యాయురాలు ఆమె చదువుతున్న తరగతికి ఎలాంటి క్లాసులు చెప్పరని దర్యాప్తులో తేలింది. ఆ ఉపాధ్యాయురాలిని తక్షణమే సస్పెండ్ చేశామని, పాఠశాల ప్రిన్సిపల్ రాజీవ్ సింగ్‌ను సెలవులపై పంపామని అధికారులు తెలిపారు.

రేపు పంజాబ్‌కు మోదీ

న్యూఢిల్లీ: పంజాబ్‌లో గత ఏభై ఏళ్లలో కనీవినీ ఎరుగని విధంగా వరదలు బీభత్సం సృష్టించడం, పెద్దఎత్తున ఆస్తి, పంటనష్టం సంభవించడం, లెక్కకు మిక్కిలిగా నిరాశ్రయులు కావడంతో ఆ రాష్ట్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటించనున్నారు. సహాయ, పునరావాస కార్యక్రమాలు, అక్కడి పరిస్థితిని సమీక్షించేందుకు సెప్టెంబర్ 9న ఆయన పంజాబ్‌లో పర్యటించనున్నట్టు బీజేపీ పంజాబ్ విభాగం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపింది. గురుదాస్‌పూర్‌లో ప్రధాని పర్యటించి వరద బాధిత ప్రజలు, రైతులను కలుసుకుంటారని పేర్కొంది. బాధితులను ఆదుకునేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటారని వివరించింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పంజాబ్ ప్రజలకు అండగా నిలుస్తుందని, కష్టకాలంలో పూర్తి సహకారం అందిస్తుందని, ఇందుకు ప్రధాని పంజాబ్‌లో పర్యటించనుండటమే నిదర్శనమని బీజేపీ తెలిపింది.

ఆసుపత్రికి బాంబు బెదిరింపు

ముంబై: నగరంలోని నాయర్ ఆసుపత్రిలో బాంబు అమర్చినట్లు కాల్ రావడంతో ముంబై పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆసుపత్రిని పేల్చివేయడానికి రంగం సిద్ధం చేసినట్లు హెచ్చరిక కాల్ అందిందని, వెంటనే భద్రతా దళాలు అప్రతమ్తమై బాంబుకోసం గాలింపు చర్యలు చేపట్టాయని పోలీసు అధికారులు తెలిపారు. డీన్ అధికారిక చిరునామాకు శనివారం రాత్రి 11 గంటలకు బాంబు బెదిరింపు ఈ మెయిల్ వచ్చింది. వెంటనే అప్రమత్తమైన పోలీసు అధికారులు బాంబు గుర్తింపు, నిర్మూలన దళం (బీడీడీఎస్)తో కలిసి ఆసుపత్రిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కొన్ని గంటలపాటు తనిఖీలు నిర్వహించాక ఎటువంటి అనుమానాస్పద వస్తువు లభ్యంకాలేదు. ముంబై అంతటా వాహనాలలో 400 కిలోల ఆర్డీఎక్స్ మానవ బాంబులు అమర్చామంటూ బెదిరింపు కాల్ వచ్చిన రెండు రోజులకు తాజా ఘటన జరిగింది.

బీజేపీ గుండెల్లో దడ

- బీహార్‌లో ప్రజా వ్యతిరేకత
- పార్టీలో అంతర్గత కుమ్ములాట
- కొలిక్కిరాని పొత్తులు
- దిద్దుబాటుపై కాషాయ పెద్దల దృష్టి

పట్నా: రాబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు అధికార నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్డీఏ) పక్షాల మధ్య సీట్ల పంపకం ఇప్పట్లో కొలిక్కి వచ్చే సూచనలు కనబడటం లేదు. ప్రతిష్టంభన కొనసాగుతూనే ఉంది. సీట్ల సర్దుబాటులో బీజేపీ కంటే కనీసం ఒక్క సీటైనా ఎక్కువ సాధించుకోవాలని జేడీయూ పట్టుదలగా ఉంది. మరోపక్క కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని ఎల్జేపీ(ఆర్) కూడా తమకు 40 స్థానాలు కావాలని పట్టుబడుతోంది. ఈ నేపథ్యంలో ఎన్డీఏ అతిపెద్ద భాగస్వామి భారతీయ జనతా పార్టీ (బీజేపీ)... పొత్తులకు ముందు సొంత ఇంటిని చక్కబెట్టుకోవాలని నిర్ణయించుకుంది. ముఖ్యంగా రెండు అంశాలపై ఆ పార్టీ దృష్టి పెట్టింది. ఒకటి రాష్ట్ర నాయకుల మధ్య కుమ్ములాటలు, ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత. ఈ వారం ప్రారంభంలో దిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా-బీహార్ బీజేపీ నాయకుల మధ్య జరిగిన సుదీర్ఘ సమావేశంలో ప్రధానంగా ఈ రెండు అంశాలపైనే చర్చించారు. అంతర్గత కలహాలకు ముగింపు పలకాలని, ప్రజల్లో వ్యతిరేకతను తగ్గించడంపై దృష్టి పెట్టాలని అధిష్టానం స్పష్టం చేసింది. "గతంలో కూడా రాష్ట్ర సీనియర్ నాయకుల మధ్య గొడవలు, వివాదాలు ఉండేవి. కానీ అవన్నీ ఎన్నికలకు ముందే సద్దుమణిగేవి. మాజీ ఉప ముఖ్యమంత్రి సుశీల్ కుమార్ మోదీ బతికుండగా... ఎన్నికల సమయంలో ఆయన మాటను పార్టీలోని ప్రతి ఒక్కరూ ఏకగ్రీవంగా అంగీకరించారు. ప్రస్తుతం రాష్ట్ర పార్టీలో అగ్రశ్రేణి నాయకులు తమ ఇష్టానుసారం పార్టీని నడపాలనుకుంటున్నారు" అని షా అధ్యక్షత వహించిన సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకుడు ఒకరు స్పష్టం చేశారు. సమావేశంలో ప్రభుత్వ వ్యతిరేకతపై కూడా తీవ్రంగా చర్చించినట్లు పేరు తెలపడానికి ఇష్టపడని ఆ బీజేపీ నేత తెలిపారు. 243 మంది సభ్యులున్న బీహార్ అసెంబ్లీలో 80 సీట్లు కలిగిన కాషాయ పార్టీ అతిపెద్ద పార్టీగా ఉంది. అయితే ఈసారి కొన్ని సీట్లు మిత్రపక్షాలతో మార్పిడి చేసుకోవడం, కొంతమంది ప్రస్తుత శాసనసభ్యులకు తిరిగి ఎన్నికల్లో పోటీ చేయడానికి టికెట్లు ఇవ్వకపోవచ్చని తెలిపారు. పార్టీ, కూటమిలో కార్యకర్తలు, కార్మికులు, మద్దతుదారులు, ఓటర్ల ముందు ఐక్యంగా మెలగాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ కుమార్ జైస్వాల్ సహా సీనియర్ నాయకులను షా కోరారు. బీజేపీతో పాటు, ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ నేతృత్వంలోని జేడీయూ, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ ఎల్జేపీ (ఆర్), హిందుస్తానీ అవామ్ మోర్చా సెక్యులర్ (హెచ్ఏఎంఎస్) బీహార్‌లో ఎన్డీఏలో భాగస్వామ్య పక్షాలుగా ఉన్నాయి. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాబోయే ఎన్నికల దృష్ట్యా అనుసరించాల్సిన బ్లూప్రింట్‌ను రాష్ట్ర పార్టీకి అందజేశారు. ఇది ఎన్డీఏ పక్షాల ఉనికిని బూత్ స్థాయిలో బలోపేతం చేయడంపై దృష్టి పెడుతుంది. పంచాయతీ స్థాయి నాయకులు ప్రతి ఒక్కరూ తమ తమ ప్రాంతాలలోని 50 ఇళ్లకు చేరుకుని, కూటమి ప్రభుత్వం చేసిన పనులు, దాని భవిష్యత్తు ప్రణాళికలను వివరిస్తారు. "మేము ఎన్నికలను అత్యంత సీరియస్‌గా తీసుకుంటున్నాం. చత్తీస్‌గఢ్, జార్ఖండ్, గుజరాత్, తెలంగాణ, మహారాష్ట్ర, మణిపూర్‌తో సహా ఆరు రాష్ట్రాల నుండి మా పార్టీ సంస్థాగత ఇన్‌చార్జ్‌లు ఇక్కడ మకాం వేస్తారు. అదేవిధంగా, అనేక రాష్ట్రాల నుండి మహిళా నాయకుల బృందాలు సెప్టెంబర్ 10నాటికి చేరుకుని మహిళా ఓటర్లతో సంభాషించడానికి రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తాయి "అని బీజేపీ ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ప్రేమ్ రంజన్ పటేల్ ఓ వార్తాసంస్థకు తెలిపారు. ప్రతి ఐదు అసెంబ్లీ స్థానాలకు ఒక ఇన్‌చార్జ్‌ను నియమించే ప్రక్రియలో పార్టీ ఉందని పటేల్ తెలిపారు. వారిని ఇతర రాష్ట్రాల నుండి రప్పిస్తారు. అదేవిధంగా ప్రతి నియోజకవర్గంలో ఒక 'విస్తారక్' (పూర్తికాల ప్రచార నాయకులు) వారు బూత్ స్థాయిలో పార్టీ కార్యకర్తలతో రోజువారీ సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాన్ని తీసుకుంటారు. "మా దృష్టి బలహీనమైన ప్రాంతాలు, ప్రాంతాలపై ఉంటుంది. అలాగే పార్టీ పరిధిని విస్తరిస్తుంది" అని పటేల్ పేర్కొన్నారు. కాగా, సీట్ల పంపిణీపై జేడీయూ కూడా పెద్దగా ఆందోళన చెందడం లేదు. 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలను బట్టి, బీజేపీతో సమాన సంఖ్యలోనే అసెంబ్లీస్థానాల్లో పార్టీ పోటీ చేస్తుందని ఆ పార్టీ నాయకులు కార్యకర్తలకు భరోసా ఇస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, జేడీయూ వరుసగా 17 ,16 లోక్‌సభ సీట్లలో పోటీ చేసి...12 చొప్పున గెలుచుకున్నాయి. ఎల్జేపీ (ఆర్) ఐదు లోక్‌సభ స్థానాల్లో గెలుపొందగా... హెచ్ఏఎంఎస్ ఒక్క స్థానంలో విజయం సాధించింది. అసెంబ్లీ సీట్ల పంపకాల చర్చలు సెప్టెంబర్ 15 తర్వాత ప్రారంభమవుతాయని భావిస్తున్నప్పటికీ సెప్టెంబర్ 22న ప్రారంభమయ్యే దుర్గా పూజ (నవరాత్రులు) వరకు ఆలస్యం కావచ్చు. "శుభ సమయం కోసం వేచి ఉండండి. మిత్రపక్షాల మధ్య ఎటువంటి సమస్యలు లేవు. ఎల్జేపీ(ఆర్), దాని నాయకుడు చిరాగ్ పాస్వాన్ కూడా ఈ కూటమికి హృదయపూర్వకంగా మద్దతు ఇస్తారు" అని జేడీయూ సీనియర్ కార్యకర్త ఒకరు అన్నారు. జేడీయూ, బీజేపీ దాదాపు సమాన సీట్లలో పోటీ చేస్తాయని చెబుతూనే అవసరమైతే రెండు సీట్లు ఇస్తాయి లేదా తీసుకుంటాయన్నారు. ఎల్జేపీ(ఆర్) మూడవ స్థానంలో ఉంటుందని, ఆ తర్వాత హెచ్ఏఎంఎస్‌కు రెండు సీట్లు ఉంటాయని చెప్పుకొచ్చారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో మిత్రపక్షాల కుట్రలు, ఎన్డీఏ భాగస్వామి అయినప్పటికీ నితీశ్‌ను ప్రాభవాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో చిరాగ్ పార్టీ నిలబెట్టిన అభ్యర్థులు వంటి వివిధ కారణాల వల్ల జేడీయూ కేవలం 43 సీట్లతో (ఇప్పుడు 45 సీట్లు) మూడవ స్థానానికి పడిపోయింది. ప్రస్తుతం బీహార్‌లోని ఎన్డీఏ పక్షాలు ఐక్యంగా ఉన్నాయని బీజేపీ నాయకులు చెబుతున్నారు. సీట్ల పంపిణీ ప్రతి మిత్రపక్షాన్ని గౌరవించేలా బాధ్యతగా జరుగుతుందని, మా సీనియర్ నాయకులు దీనిని సరైన సమయంలో ప్రకటిస్తారని జేడీయూ ఎంఎల్‌సీ అనామిక సింగ్ తెలిపారు. కాగా, కేంద్ర ఆహార శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని ఎల్జేపీ... తనకు 40 సీట్లు కేటాయించాలని పట్టుపడుతోంది. ఈ పార్టీకి ప్రస్తుతం లోక్‌సభలో ఐదుగురు ఎంపీలు ఉన్నారు. కాగా చిరాగ్ పార్టీ కోరుతున్న స్థాయిలో సీట్లు కేటాయించేందుకు బీజేపీ, జేడీయూ సుముఖంగా లేవు. మహా అయితే ఆ పార్టీకి 20 సీట్లకు మించి వదిలే ప్రశ్నే లేదని చెబుతున్నాయి. పైగా కూటమిలో భాగస్వాములుగా ఉన్న ఉపేంద్ర కుష్వాహా నేతృత్వంలోని రాష్ట్రీయ లోక్‌మంచ్, జితన్ రామ్ మాంజీ నాయకత్వంలోని హిందుస్థాన్ ఆవామ్ మోర్చా పార్టీలకు కూడా కొన్ని సీట్లు కేటాయించాల్సి ఉంటుంది. సీట్ల సర్దుబాటుపై వచ్చే వారం తుది విడత చర్చలు జరుగుతాయని ఎన్డీఏ వర్గాలు తెలిపాయి. ఈ నెల 9న జరిగే ఉప రాష్ట్రపతి ఎన్నిక ఓటింగుకు సంబంధించి ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో పాల్గొనేందుకు ఎన్డీఏ ఎంపీలు, సీనియర్ నేతలు ప్రస్తుతం న్యూదిల్లీ చేరుకుంటున్నారు. సీట్ల సర్దుబాటుపై వారితో కూడా సంప్రదింపులు జరుపుతారు. 2020 శాసనసభ ఎన్నికలలో జేడీయూ 115, బీజేపీ 110 స్థానాలకు పోటీ చేశాయి. అయితే బీజేపీకి అత్యధికంగా 74 సీట్లు లభించగా జేడీయూకు 43 మాత్రమే వచ్చాయి.

జైల్లో లైబ్రరీ క్లర్క్‌గా రేవణ్ణ

బెంగళూరు: అత్యాచారం కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న కర్నాటకలోని హసన్ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు పరప్పన అగ్రహార జైలులో లైబ్రరీ క్లర్క్‌గా పని కేటాయించారు. తోటి ఖైదీలకు పుస్తకాలు జారీ చేయడం, వాటి రికార్డులను నిర్వహించడం వంటి బాధ్యతలు ఆయన నిర్వహించాలి. ఈ పని చేసినందుకు రోజుకు రూ.522 చెల్లిస్తారు. కాగా, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ మనవడు, జేడీ(ఎస్) సీనియర్ నేత, హొలెనరసిపుర ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణ కుమారుడైన ప్రజ్వల్ రేవణ్ణపై నమోదైన అత్యాచారం కేసులో ట్రయల్ కోర్టు జీవిత ఖైదు విధించింది. జైలు నిబంధనల ప్రకారం జీవిత ఖైదు శిక్ష పడిన వారు జైలులో ఏదో ఒక పని చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో పరిపాలనా పరమైన పనులు చేయడానికి రేవణ్ణ ఆసక్తి చూపినట్లు జైలు అధికారులు తెలిపారు. అయితే ఆయనకు లైబ్రరీ క్లర్క్ పని అప్పగించినట్లు చెప్పారు. మరోవైపు ఖైదీలు సాధారణంగా వారానికి మూడు రోజులు, నెలలో కనీసం 12 రోజులు జైలులో పని చేయాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం కోర్టు విచారణలకు హాజరు కావడం, న్యాయవాదులను కలిసేందుకు ప్రజ్వల్ రేవణ్ణ ఎక్కువ సమయం కేటాయిస్తున్నట్లు జైలు అధికారులు తెలిపారు.

కోల్‌కతాలో యువతిపై సామూహిక అత్యాచారం

కోల్‌కతా : కోల్‌కతాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. 20 ఏళ్ల యువతిపై సామూహిక అత్యాచారం జరిగింది. ఆమె పుట్టినరోజున తెలిసిన ఇద్దరు యువకులే ఆ యువతిపై సామూహిక అత్యాచారానికి ఒడిగట్టినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం నగర దక్షిణ శివార్లలోని రీజెంట్ పార్క్ ప్రాంతంలో ఈ సంఘటన జరిగింది. నేరం తర్వాత అదృశ్యమైన ఇద్దరు నిందితులను చందన్ మాలిక్, దీప్‌గా గుర్తించారు. దీప్ ప్రభుత్వ ఉద్యోగి అని సమాచారం. పోలీసు వర్గాల ప్రకారం, ఆమె పుట్టిన రోజు సాకుతో చందన్‌ను ఆ యువతిని దీప్ ఇంటికి తీసుకువెళ్లినప్పుడు ఈ అత్యాచార ఘటన జరిగిందని బాధితురాలు ఆరోపించారు. 'ఆ మహిళ పుట్టినరోజు శుక్రవారం. ఆ సందర్భంగా నిందితుడు చందన్, దీప్ బాధితురాలిని ఆమె ఫ్లాట్‌కు తీసుకెళ్లారు. అక్కడ వారు భోజనం చేశారు. ఆమె ఇంటికి తిరిగి రావాలనుకున్నప్పుడు నిందితులు ఆమెను ఆపారని ఆమె చెప్పింది. వారు తలుపు తాళం వేసి ఆమెపై సామూహిక అత్యాచారం చేశారని ఆరోపించారు' అని పోలీసు వర్గాల్లో ఒకరు తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలోనే బాధితురాలు తప్పించుకోగలిగిందని, ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత ఆమె తన కుటుంబ సభ్యులకు ఈ సంఘటన గురించి తెలియజేసిందని వివరించాయి. ఆ తర్వాత శనివారం సంబంధిత సెక్షన్ల కింద ప్రథమ సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్) నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు ప్రారంభించినట్లు పోలీసు అధికారి ఒకరు తెలిపారు. తన ఫిర్యాదులో చందన్ తనకు చాలా నెలల క్రితం పరిచయమయ్యాడని కూడా ఆ మహిళ చెప్పింది. దక్షిణ కోల్‌కతాలోని ఒక పెద్ద దుర్గా పూజ కమిటీ అధిపతిగా అతను తనను తాను పరిచయం చేసుకున్నాడు. అతని ద్వారా, బాధితురాలు దీప్‌కు పరిచయం అయింది. పూజ కమిటీలో ఆమెను చేర్చుకుంటామని ఇద్దరు నిందితులు హామీ ఇచ్చారని ఆమె తన ఫిర్యాదులో తెలిపింది. తాజా జాతీయ నేర నమోదు సంస్థ డేటాప్రకారం, దేశంలో మహిళలకు అత్యంత సురక్షితమైనదిగా పరిగణించబడే నగరంలో మహిళలపై జరుగుతున్న నేరాల శ్రేణిలో ఈ సంఘటన తాజాది. జూన్ 25న దక్షిణ కోల్‌కతాలోని న్యాయ కళాశాల క్యాంపస్‌లో ఒక లా విద్యార్థినిపై అత్యాచారం జరిగిందని ఆరోపణలు ఉన్నాయి. గత సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వ అధ్వర్యంలోని ఆర్జీకర్ వైద్య కళాశాల ఆస్పత్రిలో ట్రయినీ వైద్యురాలిపై హత్యాచారం జరిగింది.

నోట్లో యాసిడ్ పోస్తా

తృణమూల్ నేత హెచ్చరిక

కోల్‌కతా: బీజేపీ ఎమ్మెల్యే శంకర్ ఘోష్‌పై తృణమూల్ కాంగ్రెస్ నేత అబ్దుర్ రహీం చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. బెంగాల్ నుంచి ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిన 30 లక్షల మందిని బంగ్లాదేశీయులు, రోహింగ్యాలుగా అభివర్ణిస్తూ అసెంబ్లీలో శంకర్ ఘోష్ చేసిన వ్యాఖ్యలను రహీం తప్పుబట్టారు. మళ్లీ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ఆయన నోట్లో యాసిడ్ పోసి బూడిద చేస్తానంటూ హెచ్చరించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాలీ వాసులను వేధిస్తున్నారని, నిర్బంధ శిబిరాల్లో ఉంచుతున్నారని ఆరోపించారు. బెంగాల్ ప్రజలకు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటున్న బీజేపీని రాష్ట్రం నుంచి బహిష్కరించాలని ప్రజలను కోరారు. అబ్దుర్ రహీం వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. అధికార టీఎంసీ రాష్ట్రంలో హింస, బెదిరింపు సంస్కృతులను పెంచుతోందని ఆరోపించింది. త్వరలో ఎన్నికలు రానుండటంతో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందనే భయంతో టీఎంసీ నేతలు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని బీజేపీ నేత ఖాగెన్ ముర్ము అన్నారు. కాగా, వివాదాల జోలికి పోవద్దని బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సూచించినప్పటికీ టీఎంసీ నేతలు నోటికి పనికల్పిస్తూనే ఉండడం గమనార్హం.

ఓటు దొంగలకు ఈసీ అండ

మల్లికార్జున ఖర్గే విమర్శ

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం 'ఓటు చోరీ' వెనుక ఉన్నవారిని సమర్థవంతంగా కాపాడుతోందని, కీలకమైన సమాచారాన్ని అడ్డుకుంటోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదివారం విమర్శించారు. 2023లో కర్నాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఫారమ్ 7ను నకిలీ చేయడం ద్వారా ఓటర్లను తొలగించే ప్రయత్నానికి సంబంధించిన కేసు నిందితులను పట్టుకోవడానికి అవసరమైన కీలకమైన డేటాను ఈసీఐ ఇంకా పంచుకోనందున ఇది చల్లారిపోయిందని ఖర్గే 'ఎక్స్' లో మీడియా నివేదికను పంచుకున్నారు. ఈ ఆరోపణలపై ఎన్నికల కమిషన్ నుంచి తక్షణ స్పందన రాలేదు. కానీ గతంలో కాంగ్రెస్ చేసిన అటువంటి వాదనలన్నింటినీ ఎన్నికల సంఘం కొట్టివేసింది. అయితే భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) ఇప్పుడు 'ఓటు చోరీ' కి బీజేపీ బ్యాక్-ఆఫీస్ అవుతుందా అని ఖర్గే అడిగారు. 'కాలక్రమాన్ని అర్థం చేసుకోండి. మే 2023 కర్నాటక ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఆలంద్ నియోజకవర్గంలో భారీ ఓట్ల తొలగింపును బహిర్గతం చేసింది. ఫారమ్ 7 దరఖాస్తులను నకిలీ చేయడం ద్వారా చాలా అధునాతనమైన ఆపరేషన్ ద్వారా వేలాది మంది ఓటర్ల హక్కులను కోల్పోయారు' అని ఆయన ఆరోపించారు. 'ఫిబ్రవరి 2023లో ఒక కేసు నమోదయింది. దర్యాప్తులో 5,994 నకిలీ దరఖాస్తులు బయటపడ్డాయి. ఓటర్లను మోసం చేయడానికి జరిగిన భారీ ప్రయత్నానికి స్పష్టమైన సాక్ష్యం. అప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం నిందితులను పట్టుకోవడానికి సీఐడీ దర్యాప్తునకు ఆదేశించింది. కానీ ఇక్కడ ఒక మలుపు ఉంది. ఈసీఐ ముందుగా ఫోర్జరీని గుర్తించడానికి అవసరమైన పత్రాలలో కొంతభాగాన్ని పంచుకున్నప్పటికీ, అది అప్పుడు కీలకమైన సమాచారాన్ని ధ్వంసం చేసింది. ఇది ఓటు చోరీ వెనుక ఉన్న వారిని సమర్థవంతంగా రక్షించడమే' అని ఖర్గే అన్నారు. ఈసీఐ అకస్మాత్తుగా కీలకమైన ఆధారాలను ఎందుకు అడ్డుకుందని ఆయన అడిగారు. 'ఇది ఎవరిని రక్షిస్తోంది? బీజేపీకి చెందిన ఓటు చోరీ విభాగం? సీఐడీ దర్యాప్తును పక్కదారి పట్టించడానికి బీజేపీ ఒత్తిడికి ఈసీఐ లోనవుతుందా?' అని కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశ్నించారు. వ్యక్తి ఓటు హక్కును, భారత ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని అన్నారు.

దేశ రాజకీయాల్లో విప్లవాత్మక మైలురాయి

రాహుల్ భారత్ జోడో యాత్రపై కాంగ్రెస్

న్యూఢిల్లీ: భారత్ జోడో యాత్ర ప్రారంభించి మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఇది దేశ రాజకీయాల్లో ఒక పరివర్తన మైలురాయి అని, ఇది ప్రతిధ్వనిస్తూనే ఉంటుందని కాంగ్రెస్ పేర్కొంది. భారత్ జోడో యాత్ర మూడు సంవత్సరాల క్రితం కన్యాకుమారిలో ప్రారంభమైందని, స్వామి వివేకానంద శిల స్మారక చిహ్నం, ఇతర ప్రసిద్ధ ప్రదేశాలను సందర్శించి చివరకు బహిరంగ సభను ఏర్పాటు చేయడంతో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్ వ్యవహారాల ఇంచార్జ్ జైరాం రమేశ్ అన్నారు. పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, తీవ్రతరం అవుతున్న సామాజిక ధ్రువణత, పెరుగుతున్న రాజకీయ నిరంకుశత్వం అనే మూడు ముఖ్యమైన, ఆందోళనకరమైన ప్రజా సమస్యలను ప్రత్యేకంగా ప్రస్తావించడానికి ఈ యాత్ర చేపట్టామని జైరాం రమేశ్ 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. 'ఇది రాహుల్ గాంధీ, కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 200 మందికి పైగా భారత యాత్రికులు కాలినడకన చేపట్టిన 4 వేల కిలోమీటర్ల పాదయాత్ర. ఇది 12 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాల గుండా 145 రోజులకు పైగా కొనసాగింది' అని తెలిపారు. 'ఈ యాత్ర మన దేశ రాజకీయాల్లో ఒక పరివర్తన కలిగించే మైలురాయి. ఇది ప్రతిధ్వనిస్తూనే ఉంది' అని అన్నారు. ఈ యాత్రలో రాహుల్ గాంధీ 12 బహిరంగ సభలు, 100 కి పైగా వీధి మూల సమావేశాలు, 13 మీడియా సమావేశాలను ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన 275 కి పైగా ప్రణాళికాబద్ధమైన నడక సంభాషణలు, 100 కి పైగా కూర్చొని ప్రజలతో సంభాషణలు నిర్వహించారు. 4 వేల కి.మీ.లకు పైగా తన పాదయాత్రలో పాల్గొన్న గాంధీ తన మద్దతుదారులతో పాటు వ్యతిరేకుల దృష్టిని ఆకర్షించగలిగారు. కమల్ హాసన్, పూజా భట్, రియా సేన్, స్వర భాస్కర్, రష్మి దేశాయ్, ఆకాంక్ష పూరి, అమోల్ పాలేకర్ వంటి చలనచిత్ర, టీవీ ప్రముఖులతో సహా సమాజంలోని వివిధ వర్గాల నుంచి ఈ యాత్రలో పాల్గొన్నారు. అంతేకాకుండా ఆర్మీ చీఫ్ జనరల్ (రిటైర్డ్) దీపక్ కపూర్, మాజీ నేవీ చీఫ్ అడ్మిరల్ (రిటైర్డ్) ఎల్.రామ్‌దాస్ వంటి రచయితలు, సైనిక అనుభవజ్ఞులు, ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్, ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి అరవింద్ మాయారామ్ వంటి ప్రముఖ వ్యక్తులు కూడా ఈ యాత్రలో పాల్గొన్నారు. అలాగే నేషనల్ కాన్ఫరెన్స్‌కు చెందిన ఫరూఖ్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా, పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీకి చెందిన మెహబూబా ముఫ్తీ, శివసేన (యూబీటీ) నాయకులు ఆదిత్య థాకరే, ప్రియాంక చతుర్వేది, సంజయ్ రౌత్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్‌పీ) నాయకురాలు సుప్రియా సులే వంటి ప్రతిపక్ష నాయకులు కూడా యాత్ర సందర్భంగా వివిధ ప్రదేశాలలో గాంధీతో కలిసి నడిచారు.

మహిళను చెట్టుకు కట్టి...

చెన్నై: మహిళను చెట్టుకు కట్టేసి జుట్టుపట్టి కొట్టి వివస్త్రను చేసిన ఘటన తమిళనాడులోని కడలూరు జిల్లా పన్రుతి సమీపంలో చోటుచేసుకుంది. ఆమెను చెట్టుకు కట్టేసి విచక్షణా రహితంగా కొట్టడంపోపాటు వివస్త్రను చేశారు. నలుగురు మహిళలు కలిసి ఓ మహిళను ఆమె చీరతోనే చెట్టుకు కట్టేశారు. అనంతరం ఆమెపై దాడిచేయడంతోపాటు జాకెట్‌ను చించివేశారు. నువ్వు కుక్కతో సమానం అంటూ ఓ మహిళ బాధితురాలిని బూతులు తిడుతుండగా, మరొకరు కర్రతో కొట్టారు. ఇంకొకరు ఆమె జుట్టుపట్టుకుని లాగింది. అక్కడితో ఆగకుండా ఆమె జాకెట్‌ను చించివేశారు. ఇదంతా అక్కడే ఉన్న కెమెరాలో రికార్డయింది. 2.13 నిమిషాల నిడివి ఉన్న ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కాగా, భూ వివాదం కారణంగా ఈ ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల్లో ఓ మహిళలను అరెస్టు చేశామని, మిగిలిన ముగ్గురు పరారీలో ఉన్నారని చెప్పారు. వారిని గాలించడం కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. దాడికి కుల వివక్ష కారణమా అనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

విభజన శక్తుల కుట్రలు తిప్పి కొట్టండి

పినరయి విజయన్

తిరువనంతపురం: మతతత్వాన్ని వ్యాప్తి చేయడం ద్వారా సమాజంలో విభజనను సృష్టించడానికి ఉద్దేశపూర్వకంగా చేసే ప్రయత్నాలను తిప్పికొట్టాలని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పిలుపునిచ్చారు. కులం మానవత్వం కంటే గొప్పదని కొందరు ప్రచారం చేస్తున్నారని... మతం, కులం ఆధారంగా వ్యాపించిన మూఢ నమ్మకాలు, దుష్ట ఆచారాలను నిర్మూలించిన కేరళలో కూడా అలాంటి ఆలోచనలు మళ్లీ బలపడుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. సామాజిక సంస్కర్త నారాయణ గురు 171వ జయంతిని స్మరించుకుంటూ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఈ వ్యాఖ్యలు చేశారు. నారాయణ గురు ఊహించిన సమాజంగా మారడానికి కుల, మతతత్వం, విభజన రాజకీయాలతో సహా మన ముందు అనేక సవాళ్లు ఉన్నాయని, ఈ అడ్డంకులను అధిగమించడానికి గురువు ఆలోచనలు, పోరాట చరిత్ర మనకు ప్రేరణగా ఉంటుందని విజయన్ అన్నారు. కేరళకు వెలుగునిచ్చిన నారాయణ గురు కూడా మతతత్వాన్ని వ్యతిరేకించారని, ఎల్లప్పుడూ మతతత్వాన్ని వ్యతిరేకించిన గొప్ప గురువని పేర్కొన్నారు. కానీ నేడు మత శక్తులు రాష్ట్రానికి మార్గదర్శక వెలుగుగా ఉన్న నారాయణ గురు వారసత్వాన్ని తమ సొంతం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాయని ఆయన అన్నారు. ప్రజలను విభజించమని గురు బోధించలేదని, వారిని ఏకం చేయాలని బోధించారని తెలిపారు. గురు మాటలు, చర్యలు ఒక మతం లేదా కులానికి మాత్రమే పరిమితం కాదని పేర్కొన్నారు. కేరళ పునరుజ్జీవనోద్యమ సారాంశంలో అద్భుతమైన తేజస్సుతో ప్రకాశించే నారాయణ గురు పుట్టినరోజు నేడని తెలిపారు. 'విద్య ద్వారా మలయాళీలు సంఘటితమై బలంగా, జ్ఞానోదయం పొందాలని నేర్పిన గురు, అనేక మతాల సారాంశం ఒక్కటేనని ప్రపంచానికి తెలియజేశారు. 1924లో అలువా అద్వైత ఆశ్రమంలో ఆయన ఏర్పాటు చేసిన సర్వమత సమావేశం మతపరమైన వైరం లేకుండా అందరూ సోదరభావంతో రాజ్యం చేసే ఒక నమూనా ప్రపంచాన్ని ఊహించింది' అని తెలిపారు.

విశాలాంధ్ర హైదరాబాద్

గణేష్ నిమజ్జన వేడుకల్లో ఎమ్మెల్యే శంకర్

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్ : రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ కాలేజీ రోడ్డు భగత్ యూత్ గణేష్ మండల్ వద్ద యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మోహన్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన గణేష్ నిమజ్జనం కార్యక్రమానికి షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. అంగరంగ వైభవంగా జరిగిన ఈ కార్యక్రమం ఎంతో శుభయమానం చేకూరింది. భక్తుల మధ్య ఆటపాటలతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఉత్సాహం కల్పించారు. భక్తులతో కలిసి ఆడి పాడారు. కనీవినీ ఎరుగని రీతిలో ఏర్పాట్లను చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, అగ్గనూర్ బస్వం, ఖదీర్ ముబారక్ అలీ ఖాన్, పురుషోత్తం రెడ్డి, జంగారి రవి, యూత్ సభ్యులు అందే శ్రీకాంత్ ముదిరాజ్, మార్గం రాజేష్ కుమార్, సాయి వంశీ, రాహుల్, అజయ్, రాజేష్ గౌడ్, నవీన్, హరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాల నరసింహ

విశాలాంధ్ర - హైదరాబాద్ : నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని లక్ష్మణాచారి భవన్లో సిపిఐ జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సమావేశాలు ఇందిరమ్మ అధ్యక్షతన జరిగాయి. ఈ సమావేశాలకు ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల నరసింహ హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రభుత్వంపై ప్రజా పోరాటాలు చేయడానికి సిపిఐ శ్రేణులు ప్రజా సంఘాలు సిద్ధం కావాలని ఆయన అన్నారు. అదేవిధంగా కొల్లాపూర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని వాటిని సరి చేయకపోతే సిపిఐ పక్షాన కొల్లాపూర్ నియోజకవర్గంలో త్వరలోనే అన్ని మండల కేంద్రాలను సిపిఐ పక్షాన ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఒకవైపు ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కమ్యూనిస్టులు ముందుంటారని సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేపదే చెప్తున్న దానికి భిన్నంగా కొల్లాపూర్ నియోజకవర్గంలో జరుగుతుందని కమ్యూనిస్టులు ఎన్నికల అప్పుడు మాత్రమే అవసరం తర్వాత వారి అవసరం లేదనే విధంగా మంత్రి ప్రవర్తిస్తున్న తీరు సరైనది కాదని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందాలని లేకపోతే విడతలవారీగా ప్రభుత్వంపై ప్రజల తరపున పోరాటం చేయడానికి వెనకడుగు వేసేది లేదని అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా పార్టీ బలం ఉన్న ప్రతి చోట పోటీ చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కేశవులు గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు టి నరసింహ, విజయుడు, జిల్లా కౌన్సిల్ సభ్యులు కృష్ణాజి, మర్యాద వెంకటయ్య, శంకర్ గౌడ్, బిజ్జా శ్రీను, బండి లక్ష్మీపతి, శివశంకర్, రవీందర్, తుమ్మల శివుడు, మల్లేష్, పరశురాములు, గద్దం శ్రీను, గోపాల్, మధు గౌడ్, నరేష్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన రైతు బిడ్డకు జాతీయ స్థాయిలో గుర్తింపు

విశాలాంధ్ర - బషీర్ బాగ్: పేద గిరిజన రైతు బిడ్డ సుగాలి శ్రీనివాస్ నాయక్ నైపుణ్య అభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖలో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (జాయింట్ సెక్రటరీ) హోదాలో పదోన్నతి పొందిన సందర్భంగా గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు డా. వెంకటేష్ చౌహాన్, గిరిజన ఉద్యోగుల సంఘం తరపున బానోత్ రాకేష్ నాయక్, అలాగే గిరిజన జెఏసి చైర్మన్ రాజేష్ నాయక్ హృదయపూర్వక తెలియజేశారు. సాధారణ రైతు కుటుంబంలో బంజారా జాతి బిడ్డ శ్రీనివాస్ నాయక్ 1985-1989 మధ్య హైదరాబాదులోని చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటి)లో ఇలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో పట్టా పొందారు. అనంతరం బెంగళూరులోని ఇండియన్ టెలిఫోన్ ఇండస్ట్రీస్‌లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా సేవలందించారు. తర్వాత యూపీఎస్సీ ద్వారా కేంద్ర హోంమంత్రిత్వ శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఎంపికై, అనేక రాష్ట్రాలలో డైరెక్టర్ స్థాయిలో కీలకపదవుల్లో పనిచేశారు. ఈశాన్య రాష్ట్రాలలో కూడా విశిష్ట సేవలు అందించారు. ప్రస్తుతం ఆయన తెలుగు రాష్ట్రాల నుండి తొలిసారిగా డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా పదోన్నతి పొందడం గిరిజన సమాజానికే కాకుండా మొత్తం తెలుగు ప్రజలకు గర్వకారణం. ఈ సందర్భంగా గిరిజన శక్తి రాష్ట్ర కమిటీ తరపున డాక్టర్ వెంకటేష్ చౌహాన్ మాట్లాడుతూ పేద గిరిజన రైతు బిడ్డ ఇంత పెద్ద హోదాకు ఎదగడం మనందరికీ స్ఫూర్తిదాయకం అన్నారు. ఇది గొప్ప కృషి అని, ఈ పదోన్నతి వారి నిజాయితీకి ప్రతీక, భవిష్యత్తులో ఇంకా గొప్ప ఉన్నత స్థానం సాధించే దిశగా పయనించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన శక్తి రాష్ట్ర కోఆర్డినేటర్ జెడి నాయక్. శ్రీమాన్ నాయక్, రామచంద్రనాయక్, చిరంజీవి నాయక్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన స్పోర్ట్స్ సెంటర్ ప్రారంభించిన గేమ్ పాయింట్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : హైదరాబాద్‌లో అగ్రగామి స్పోర్ట్స్ సెంటర్ల శ్రేణి గేమ్ పాయింట్ తన అత్యాధునిక సౌకర్యాలతో కూడిన కొత్త సెంటర్‌ను తెల్లాపూర్‌లో ప్రారంభించింది. ఈ సెంటర్‌లో 9 ఎయిర్-కూల్డ్ బ్యాడ్మింటన్ కోర్టులు, ఫుట్‌బాల్, క్రికెట్ కోసం మల్టీ-స్పోర్ట్స్ టర్ఫ్, బౌలింగ్ మెషిన్‌తో క్రికెట్ నెట్స్, టేబుల్ టెన్నిస్, పూల్ టేబుల్, ప్లేయర్లకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ బుక్, ప్లే, మెంబర్‌షిప్‌లు, టోర్నమెంట్లు, పిల్లలు, యువత, కుటుంబాలు, వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ప్రొఫెషనల్ కోచింగ్ అందించబడుతుంది. ప్రారంభ కార్యక్రమంలో జాగిల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ రాజ్ పి నారాయణం మాట్లాడుతూ ప్రపంచ స్థాయి క్రీడా సౌకర్యాలను హైదరాబాద్ కమ్యూనిటీలకు అందుబాటులోకి తెచ్చి గేమ్ పాయింట్ ఒక సానుకూల మార్పు తీసుకొస్తోంది. ఇలాంటి సెంటర్లు పిల్లలు, ప్రొఫెషనల్స్, కుటుంబాలు చురుకైన జీవనశైలిని అలవాటు చేసుకోవడానికి ప్రోత్సహిస్తాయి. తెల్లాపూర్‌లో ఈ ఇనిషియేటివ్ ప్రారంభమవ్వడం ఆనందంగా ఉంది" అన్నారు. గేమ్ పాయింట్ కో-ఫౌండర్ ఆదిత్య రెడ్డి మాట్లాడుతూ, క్రీడలను రోజువారీ జీవితంలో భాగం చేయడం మా దృష్టి. తెల్లాపూర్ సెంటర్ ఆ దిశగా మరో అడుగు. స్థానిక సమాజానికి సురక్షితమైన, ప్రొఫెషనల్, ప్రేరణాత్మక వాతావరణంలో క్రీడలను ఆడే, నేర్చుకునే, అభివృద్ధి చెందే అవకాశం కల్పించడం మాకు చాలా సంతోషంగా ఉంది" అన్నారు.

విజయవంతమైన గణేష్ నిమజ్జనోత్సవం

పారిశుద్ధ్య కార్మికుల సేవలకు ప్రత్యేక ప్రశంస

గణేష్ ఉత్సవ సమితి సభ్యులు, మీడియా, ప్రజలకు మేయర్, కమిషనర్ కృతజ్ఞతలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా గణేశ్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించిన జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది, పోలీస్, విద్యుత్, హెచ్ఎండిఎ, హైడ్రా, రెవెన్యూ, సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందికి మేయర్, కమిషనర్ అభినందనలు తెలిపారు. ఆదివారం సాయంత్రం వరకూ గ్రేటర్ వ్యాప్తంగా 2 లక్షల 70 వేల గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేశారు. చాలా మట్టుకు గణేష్ ప్రతిమలు నిమజ్జనం అయిన నేపథ్యంలో మేయర్, కమిషనర్‌లు ఓ ప్రకటన విడుదల చేసారు. పకడ్బందీ ప్రణాళిక, పటిష్టమైన ఏర్పాట్లతో కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు అభినందించారు. పారిశుద్ధ్యం, విద్యుత్, టాయ్లెట్లు, సరిపడా క్రేన్‌ల ఏర్పాటు తదితర అంశాల్లో జీహెచ్ఎంసీ చేపట్టిన చర్యలు సత్ఫలితాలిచ్చాయి. నిమజ్జనం మార్గం పొడవునా ఏర్పాటు చేసిన గణేశ్ యాక్షన్ టీమ్స్ రోడ్లపై చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాయి. ప్లాస్టిక్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలతో ఫలితం కనిపించింది. రోడ్డు సేఫ్టీ డ్రైవ్‌లో నగరంలోని రోడ్లకు మరమ్మత్తులు చేపట్టడం, ప్రధానంగా నగరంలో ఖైరతాబాద్ మహాగణపతి, బాలాపూర్ గణేష్‌లతో సహా నిమజ్జన శోభాయాత్ర జరిగే 303 కిలోమీటర్ల మేర మార్గం మరమ్మత్తులు చేపట్టడంతో ఊరేగింపు స్మూత్‌గా, సురక్షితంగా వేగంగా జరిగిందన్నారు. పారిశుద్ధ్యంకు ప్రాధాన్యతనిస్తూ 15వేల మంది సిబ్బంది 24 × 7 క్షేత్రస్థాయిలో మూడు షిఫ్టుల్లో విధులు నిర్వర్తించడంతో పారిశుద్ధ్య నిర్వహణలో ఇబ్బందులు కనిపించలేదన్నారు. 72 కృత్రిమ కొలనులతో ప్రధాన చెరువులపై ఒత్తిడి లేకుండా, ట్రాఫిక్ జామ్‌లు లేకుండా, భక్తులు స్థానికంగానే నిమజ్జనం అయ్యేలా చూడగలిగామన్నారు.

జీహెచ్ఎంసీ కల్పించిన ఉచిత భోజన సౌకర్యంకు భక్తులు, ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలకు ప్రత్యేక ప్రశంస వేడుకల్లో పారిశుద్ధ్య కార్మికుల సేవలను మేయర్, కమిషనర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. వారి నిరంతర సేవల వల్లే ఇప్పటి వరకూ 11 వేల అధిక టన్నుల వ్యర్థాలను సేకరించి ప్రాసెసింగ్ సెంటర్‌కు పంపామన్నారు. కార్మికుల సేవలు భేష్ అంటూ ప్రశంసించారు. వినాయక చవితి ఉత్సవం, మహా నిమజ్జనం కార్యక్రమం సజావుగా జరిగేలా యంత్రాగంకు తమవంతు సహకారం అందించిన గణేష్ ఉత్సవ సమితి సభ్యులు, మీడియా, ప్రజలకు మేయర్, కమిషనర్ కృతజ్ఞతలు తెలిపారు. జీహెచ్ఎంసీ యంత్రాగం, ప్రభుత్వ శాఖలు చేసిన ఏర్పాట్ల ను, అధికారుల సూచనలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మీడియా క్రియాశీలంగా వ్యవహరించిందనీ ఇరువురు కొనియాడారు.

ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివి : ఎమ్మెల్యే యెన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : విద్యా రంగంలో ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ నగరంలోని జేజేఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఎస్.అంతిరామ్ నాయక్ పదవీవిరమణ మహోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుడు అంకితభావంతో చేసిన సేవతోనే విద్యార్థికి, ఆ కుటుంబానికి తద్వారా దేశానికి ఏంతో మేలు జరుగుతుందని తెలిపారు. అంతిరామ్ నాయక్ మంచి ఆలోచన కలిగిన వ్యక్తి, సమాజానికి ఉపయోగపడే విధంగా ఆయన జీవితం సాగిందన్నారు. తన జీవిత కాలంలో 37 సంవత్సరాల పాటు ఉపాధ్యాయుడుగా వేలమంది విద్యార్థులు వారి లక్ష్యాలు చేరేందుకు కృషి చేశారనుటలో సందేహం లేదన్నారు. ఎంతో మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో అంతిరామ్ నాయక్ సఫలీకృతం అయ్యారన్నారు. ఈరోజు మీరు ఉపాధ్యాయుడిగా పదవీవిరమణ చేస్తున్నారు కానీ, ఇంకా మంచి సమాజం కోసం, మహబూబ్ నగర్ అభివృద్ధి కోసం మీ సేవలు ఎంతో అవసరం ఉన్నాయన్నారు. అనంతరం అంతిరాం నాయక్ దంపతులను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో టి పిసిసి అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, రాంచందర్, రాజ్ సింగ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారిస్తా,....

ముదిరాజ్‌లో సమస్యలు తప్పకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారిస్తామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ముదిరాజ్ లకు బిసిడి నుంచి బిసిఎలోకి మార్చాలని స్థానిక అంబెడ్కర్ కళాభవన్ లో తెలంగాణ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా గర్జన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ముదిరాజ్ రిజర్వేషన్ సమస్యను గత ప్రభుత్వం పట్టించుకోకుండా విస్మరించిందన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్లమెంటు ఎన్నికల సందర్భంగా నారాయణ పేట వేదికగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముదిరాజ్‌లను బిసిడి నుంచి బిసి ఎలోకి మార్చుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కావున మీ సమస్య వీలైనంత త్వరగా సాకారం అవుతుందని ఆయన చెప్పారు. మన ముదిరాజ్ బిడ్డ వాకిటి శ్రీహరి ఇప్పుడు రాష్ట్ర మంత్రిగా ఉన్నారు. గౌరవ మంత్రితో చర్చించి సూచనలు సలహాలు తీసుకొని ముందుకు పోతామన్నారు. మీ సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులను, ఎమ్మెల్యేలను కలుపుకొనిపోయి వీలైనంత త్వరగా పరిష్కారించేందుకు నా బాధ్యత గా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులను అలరించాయి. ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బోర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్‌పి వెంకటేష్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు దోరెపల్లి లక్ష్మి రవీందర్, మైత్రి యాదయ్య, మత్స్యకారుల సంఘం అధ్యక్షులు గోనెల శ్రీను, ముదిరాజ్ సంఘం పట్టణ మహిళా అధ్యక్షురాలు సునీత, నాయకులు ఎన్ శ్రీనివాసులు, వెంకటయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మంచిరేవులలో ఆదిమానవుని ఆనవాళ్లు

పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి

విశాలాంధ్ర - మణికొండ/ హైదరాబాద్ : హైదరాబాద్ నగర శివారులోని నార్సింగ్ మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవులలో ఆదిమానవుని ఆనవాళ్లు కనిపించాయని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్, సీఈవో, డా. ఈమని శివనాగిరెడ్డి చెప్పారు. మూసి పరిసరాల్లో ఆదివారం జరిపిన పురావస్తు అన్వేషణలో భాగంగాను, స్థానిక వీరభద్రాలయ వంశ పారంపర్య అర్చకులు మాడపాటి పరమేశ్వర ఇచ్చిన సమాచారం మేరకు, ఆలయ ప్రాంగణంలోని రాతి పరుపుపై దాదాపు 15 చోట్ల కొత్తరాతి యుగం (సా.శ.పూ.4000 సం) నాటి రాతి గొడ్డళ్లను పదును పెట్టేందుకు నూరిన (అరగదీసిన) గాళ్లు (గ్రూవ్స్) ఉన్నాయని, అవి 15 సెంటీమీటర్ల పొడవు, 3 సెంటీమీటర్లు వెడల్పు, 2 సెంటీమీటర్లు లోతు ఉన్నాయని ఆయన అన్నారు. మూసి ఒడ్డునున్న వీరభద్రాలయ చుట్టుపక్కల గల రాతి చరియల కింద గుహల్లోను కొత్త రాతియుగం వారు నివసించారని, జంతువుల వేట, పశుపోషణ, కొద్దిపాటి వ్యవసాయానికి మూసి నీటి వనరులతో జీవనం సాగించారని, ఈ ఆనవాళ్లు హైదరాబాద్ నగర చరిత్రను 6000 సంవత్సరాల పూర్వానికి తీసుకువెళుతున్నాయని శివనాగిరెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐడీసీ, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ బండా, సమతా మూర్తి శిల్పి డిఎస్‌వి ప్రసాద్, స్థపతి, రాఘవేంద్రసాగర్ పాల్గొన్నారు. కొత్త రాతి యువకు ఆనవాళ్లు చారిత్రక వివరాలతో పేరు పలకలను ఏర్పాటు చేసి, మంచిర్యాలను పురావస్తు పర్యాటక స్థావరంగా తీర్చిదించవచ్చని నార్సింగ్ మున్సిపాలిటీ అధికారులకు శివనాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

అనుమతులు లేని అక్రమ నిర్మాణం

నిజాంపేట్‌లో కొనసాగుతున్న నియంత పాలన...

చట్టాల అమలు నిబంధనలు, పేద ప్రజలకే...

డబ్బు, హోదా, రాజకీయ పలుకుబడిదారులకు నో రూల్స్

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: అనుమతులు జాంతానై... అక్రమాలకే సై అంటున్నాడు నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ లీడర్ సోదరుడు. ఇది మా అడ్డా ఇక్కడ మాకు ఎదురే లేదంటూ నిజాంపేట్ కార్పొరేషన్‌లో నియంత పోకడను సూచిస్తున్నాడు. ఎవరైనా పేద మధ్య తరగతి ప్రజలు అనుమతులకు మించి నిర్మాణం చేపడితే ఆగమేఘాల మీద వచ్చి కూల్చివేతలు చేపట్టే అధికారులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి సోదరుడి అక్రమ కట్టడంపై నీళ్ళు నమలడం చూస్తుంటే తెలుస్తుంది. ఇక్కడి నాయకులు ఏ స్థాయిలో అధికారులను ప్రభావితం చేస్తున్నారో అని స్థానికంగా చర్చ నడుస్తోంది. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి జీపిఆర్ లే అవుట్ సర్వే నెంబర్ 135,136 ప్లాట్ నెంబర్:488లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడి సోదరుడు ఎటువంటి అనుమతులు లేకుండా ఎస్ ప్లస్ 6... కమర్షియల్‌తో కూడిన ఆకాశాన్నందేలా ఓ నిర్మాణాన్ని చేపట్టాడు. ఇదే విషయమై పలుమార్లు సంబంధిత టీపీఓను అట్టి నిర్మాణానికి గల అనుమతులను తెలపాలని, ఒక వేళ అనుమతులు ఉంటే ఎన్ని ఫ్లోర్లకు అనుమతులు ఇచ్చారో చెప్పాలని, పలు మార్లు వివరణ కోరగా, సంబంధిత టీపీఓ విషయం దాటవేస్తూ నోటీసులు ఇచ్చాం. చర్యలు తీసుకుంటామని పబ్బం గడుపుతున్నారే, తప్పా చర్యలకు పూనుకోలేదు. కద్దరు చొక్కా దేనినైనా శాసిస్తుందని అధికార పార్టీ నియోజకవర్గస్థాయి నాయకుడి సోదరుడు తన పలుకుబడిని కళ్ళకు కట్టినట్టు చూపిస్తున్నాడు. చట్టం ఎవరికీ చుట్టం కాదు చట్టం ముందు అందరూ సమానులే అనే భావనను ముంచేసి, కద్దరు నాయకుల కబంద హస్తాల్లో ప్రభుత్వ యంత్రాంగం పనిచేస్తుందని, మేము ఏది చెబితే అదే అనే కోణంలో నిజాంపేట్ కార్పొరేషన్‌లో చట్టాలను ఉల్లంఘిస్తున్నాడు. కార్పొరేషన్ అధికారులు సిబ్బంది, సదరు నిర్మాణదారుడు నిర్మాణంపై అనుమతులను కోరగా ఆ నిర్మాణం ఎవరిదో, ఎవరు చేపడుతున్నారో మీకు తెలియదా మమ్మల్ని అనుమతులు వివరాలు అడగటమేంటి అని అధికారులకు సిబ్బందికి దమ్కీ ఇస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వంలో పనిచేస్తూ ప్రజలకు మేల్కొలిపి భాధ్యతగా నడుచుకోవాల్సిన కొందరు నాయకులు, ప్రభుత్వం తమదైతే ఏ అక్రమానికైనా తెగబడొచ్చు అనే పోకడలో సర్కారుకు మచ్చ తెచ్చే పనిని ఎంచుకున్నారని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఏది ఏమైనా అధికారుల కొరడా సామాన్యులపైనేనా, లేక చట్టం అందరికీ సమానం అనేలా వ్యవహరించి, అధికార పార్టీ ఓ నాయకుడి సోదరుడు నిర్మాణంపై చర్యలు తీసుకొని పౌరులకు ఆదర్శంగా నిలుస్తారా అనేది వేచి చూడాలి మరి.

ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనోత్సవం

సీఎం రేవంత్ రెడ్డి హర్షం

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా వినాయక నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా ముగియడంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తొమ్మిది రోజుల పాటు భక్తులు గణ నాథుడికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి ఘన వీడ్కోలు పలికారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తొమ్మిది రోజులపాటు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా, అత్యంత భక్తి శ్రద్ధలతో శోభాయాత్ర ప్రశాంతంగా సాగడంలో అహర్నిశలు పనిచేసిన పోలీసు, మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్, రవాణా, పంచాయతీ రాజ్ ఇతర శాఖల అధికారులు, సిబ్బందికి, ఉత్సవ కమిటీల సభ్యులు, మండపాల నిర్వాహకులు, క్రేన్ ఆపరేటర్లు అందరికీ ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. హైదరాబాద్ నగరంలో లక్షలాది విగ్రహాలు క్రమపద్ధతిలో నిర్దేశిత సమయానికి ట్యాంక్‌బండ్‌తో సహా మిగతా అన్ని ప్రాంతాల్లో నిమజ్జన కార్యక్రమం సాఫీగా, ప్రశాంతంగా సాగడానికి సహకరించిన ప్రజలందరికీ ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో జిహెచ్ఎంసి పారిశుద్ధ్య కార్మికురాలి మృతి

బాధితురాలి కుటుంబానికి జిహెచ్ఎంఈఎ ఆర్థిక సాయం

విశాలాంధ్ర - హైదరాబాద్ : జిహెచ్ఎంసిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు రేణుక (50) రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఆదివారం ఉదయం బషీర్‌బాగ్ లిబర్టీ మార్గంలో విధుల్లో ఉండగా రోడ్డు దాటే క్రమంలో ప్రమాదశాత్తు వాహనం ఢీకొటడంతో కిందపడింది. తలకు తీవ్రగాయం కావడంతో ఆసుపత్రికి తరలించే లోపే ఆమె చనిపోయింది. ఈ విషయం తెలుసుకున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు ఉదరి గోపాల్ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి ఉస్మానియా ఆసుపత్రికి వెళ్లి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం 10,000 రూపాయలు మృతురాలి తల్లికి అందజేశారు. గోషమహల్ ఏఎంఒహెచ్, జిహెచ్ఎంఇయూ యూనియన్ సభ్యులు బి.కన్నా వర్కింగ్ ప్రెసిడెంట్, సంజీవ కుమార్, హనుమంతు నాయకులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాచరణ

విశాలాంధ్ర - బషీర్ బాగ్: వచ్చే జిహెచ్ఎంసి ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాచరణ రూపొందించామని ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. లిబర్టీ, పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం పార్టీ హైదరాబాద్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో హైదరాబాద్ నగరంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించినట్లు డాక్టర్ దిడ్డి సుధాకర్ చెప్పారు. ఇందులో భాగంగా మొదటి విడతలో 50వేల సభ్యత్వం చేయాలనీ నిర్ణయించామన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ లక్ష్యాలు, ప్రజలకు చేసే సేవలను పార్టీ నేతలు వివరించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. దీని కోసం ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని, దీని కోసం నాయకులూ బుర్ర రాము గౌడ్, అబ్దుల్ ముక్తాదిర్, విజయ్ మల్లంగిలతో కూడిన కమిటీ వేశామన్నారు. త్వరలోనే ఈ కమిటీ సమావేశమై సభ్యత్వ నమోదు ఎలా చేయాలనే దానిపై నిర్ణయాలు తీసుకోవాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ కమిటీ జిహెచ్ఎంసి పరిధిలోని అన్ని ప్రాంతాలలో కొత్త సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మొదలు పెట్టి, ఆప్‌ను బలోపేతం చేసి వచ్చే జిహెచ్ఎంసి ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేయాలనీ నిర్ణయించడం జరిగిందన్నారు. ప్రజాసమస్యలను పరిష్కరించడంతోపాటు పేదల పార్టీగా పేరొందిన ఆమ్ ఆద్మీ పార్టీ సభ్యత్వం ప్రజలు ముఖ్యంగా యువత తీసుకోవాలని డాక్టర్ దిడ్డి సుధాకర్ విజ్ఞప్తి చేసారు. ఈ సమావేశంలో ఆప్ నగర నేతలు మహమ్మద్ మజీద్, హేమసుదర్శన్ జిల్లోజు, సాదిక్, శివాజీ, రమ్య గౌడ్, ఎస్ ఎన్ రెడ్డి, రాకేష్ రెడ్డి, దర్శనం రమేష్, అజీమ్ బైగ్, లియాఖట్ ఖాన్, ముక్తర్, తేజలు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Revocation/Cancellation of JDA dated 06/06/2014

This is to inform the general public that my clients **Smt. Girija W/o Late.K.Venkatesh and Sri.Poorna Chandra S/o Late.K.Venkatesh**, R/at No.133. 3rd Cross, Jeevanahalli, Cox Town, Bengaluru-560 005, have revoked the registered Joint Development Agreement (JDA) dated 04/06/2014, bearing No.HSK-1-01477-2014-15, stored in CD No.HSKD459, registered in the office of Sub-Registrar Hosakote, which document has been executed by my clients husband and father Late. K. Venkatesh in favour of **Sri.Prakash Parmar**, S/o Sri Tikamaramji, R/at No.12, 4th Floor, Godai Nivas, 29th Cross, Kilari Road, Bengaluru-560053 and **Sri.C.Jayarama Reddy**, S/o Sri.C.Subbi Reddy, R/at Flat No.302, Block No.2, Kalyani Apartment, Sahara Estate, L. B. Nagar, R.R.District, Hyderabad, in respect of schedule property mentioned below. My clients husband and father Late.K. Venkatesh has also executed Registered power of attorney 06/06/2014, bearing No. HSK-4-00187-2014-15. stored in CD No.HSKD459, registered in the office of Sub-Registrar Hosakote. As Late. K. Venkatesh passed away on 06/03/2023, leaving behind my clients as his only legal heirs to succeed the property. In view of death of Late. K.Venkatesh power of attorney dated 06/06/2014 is became unenforceable and nullity. My clients have revoked and cancelled the Joint Development Agreement (JDA) dated 04/06/2014 executed in favour of Sri Prakash Parmar, S/o Sri. Tikamaramji and Sri.C.Jayarama Reddy, S/o Sri.C.Subbi Reddy with immediate effect. Hence the public are hereby cautioned and notified not to deal with above persons in any manner whatsoever or anybody claiming through them or through their agents or henchmen in respect of the property mentioned below. In spite of this notice, if any transactions take place, the same will not binding on my clients. Hence this public notice.

SCHEDULE

All that piece and parcel of the agriculture property bearing old Sy No.62, new Sy No. 62/2, measuring 24 guntas, situated at Mallasandra Village, Kasaba Hobli, Hosakote Taluk, Bengaluru Rural district, and bounded on : **East by :** Land in same Sy No. belongs to Sri. Balakrishnappa,
West by : Land in same Sy No. belongs to Smt. Komalamma,
North by : Land belongs to Sri. Balakrishnappa,
South by : Land belongs to Sri. Krishnappa,

C.V. Manjunatha Advocate
No.3/2, Thimmaiah Towers, 2nd Floor, 1st Cross, Gandhinagar, Bangalore - 560009.
(M) 9845674305

స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : మియాపూర్ డివిజన్ పరిధిలోని మయూరి నగర్ కాలనీలోనీ దివ్య శ్రీ శక్తి అపార్ట్మెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ కార్యక్రమంలో భాగంగా వివిధ క్రీడా పోటీలలో గెలుపొందిన వారికి అసోసియేషన్ సభ్యులతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీకాంత్ మాట్లాడుతూ మయూరి నగర్ కాలనీలోనీ దివ్య శ్రీ శక్తి అపార్ట్మెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ కార్యక్రమంలో భాగంగా వివిధ క్రీడా పోటీలలో గెలుపొందిన వారికి మెడల్స్, బహుమతులను ప్రధానం చేయడం జరిగినదని, దివ్య శ్రీ శక్తి అపార్ట్మెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇలాంటి క్రీడలను నిర్వహించి వివిధ సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం పోటీలలో పాల్గొన్న వారిని ప్రోత్సహించి బహుమతులను అందజేయడం మంచి పరిణామం అని కార్పొరేటర్ శ్రీకాంత్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దివ్య శ్రీ శక్తి అపార్ట్మెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు అడుసుమిల్లి సుధీర్, రాధాకిషన్, సురేంద్ర, మోహన్, ఉమాశంకర్, సుబ్బారావు, బాలాజీ వర్మ, శశి, రాజేష్, ధనుంజయ్, విజయ కృష్ణ ప్రతిక్, అపార్ట్మెంట్స్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గణేష్ నిమజ్జన వేడుకలు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి డివిజన్ లోగల ఓల్డ్ లింగంపల్లి విలేజ్‌లో గణేష్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ నిమర్జన వేడుకలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గణేష్ నిమజ్జన సమయంలో అసాంఘిక కార్యక్రమాలకు, మతపరమైన ఘర్షణలకు పాల్పడవద్దని అన్నారు. కులమతాలకు అతీతంగా ప్రశాంతమైన వాతావరణంలో నిమజ్జన వేడుకలు జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎల్ డీసీ ప్రెసిడెంట్ గడ్డం రవి యాదవ్, రాజు యాదవ్, శ్రీ గణేష్ యూత్ మెంబర్స్, సైదులు యాదవ్, స్థానికవాసులు తదితరులు పాల్గొన్నారు.

గణేశుని లడ్డు రూ.9.99 లక్షలకు వేలం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : స్వామి వివేకానంద యూత్ క్లబ్ వ్యవస్థాపకులు నందనం విష్ణు దత్త్ ఆధ్వర్యంలో హుడాకాలనీ చందానగర్‌లో ఏర్పాటు చేసిన గణేశుని వద్ద వేలంపాటలో 25 కేజీ లడ్డును సినీనటి రోజా భారతి (ఖుషి) రూ. 9,99,999 (తొమ్మిది లక్షల తొంబై తొమ్మిది వేల తొమ్మిది వందల తొంబై తొమ్మిది)కీ కైవసం చేసుకున్నారు. అలాగే 5 కేజీ లడ్డును ఫార్మర్స్ పార్క్ అధినేత బీమాన్న ప్రగతి రెడ్డి రూ.33,333 కీ కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి పాల్గున్నారు.

కేసీఆర్ గరళకంఠుడు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తన పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో ఎమ్మెల్సీ డా.దాసోజు శ్రవణ్ ప్రత్యేక దర్శనం చేసి, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ "మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు, సతీమణి శోభమ్మకి ఆయురారోగ్యాలు కలగాలని, స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని నేను భగవంతుని ప్రార్థించానని తెలిపారు. ఎంతటి సవాళ్లు వచ్చినా కే.సి.ఆర్ వాటిని ఎదుర్కొనే శక్తి కలిగిన మహానాయకుడు. తెలంగాణ ప్రజలకు కే.సి.ఆర్ అవసరం" అని ఆయన పేర్కొన్నారు. కే.సి.ఆర్ ను గరళకంఠుడిగా పోల్చుతూ, "సముద్ర మథనంలో గరళాన్ని తన గొంతులో నిలుపుకుని, మొత్తం విశ్వాన్ని కాపాడిన పరమశివుడిలా, కే.సి.ఆర్ కూడా ప్రస్తుతం తనపై, తన కుటుంబంపై, బీఆర్ఎస్ పార్టీపై జరుగుతున్న కుట్రలు, దాడులు, వెన్నుపోట్లను తనలోనే దాచుకుంటూ, తనకు తానే భరిస్తూ, తెలంగాణ ఆకాంక్షల కోసం పోరాడుతున్నారు. ఆయన మూడోసారి ముఖ్యమంత్రిగా అవ్వాలని నేను మల్లికార్జున స్వామిని మనఃపూర్వకంగా ప్రార్థించాను" అని అన్నారు. "సంక్షోభాలు ఏవైనా వచ్చినా కే.సి.ఆర్ మళ్లీ ముఖ్యమంత్రిగా అవుతారని నాకు నమ్మకం ఉంది" అని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలు, ముందు చూపు లేకపోవడం వల్ల రాష్ట్రంలో యూరియా కొరత వంటి సమస్యలు తీవ్రతరం అవుతున్నాయని ఆయన విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కే.సి.ఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయిన వెంటనే ఆయనను ప్రత్యేకంగా శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున అమ్మవారి దర్శనానికి రమ్మని కోరుతానని డా. దాసోజు శ్రవణ్ తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన గణేష్ ఉత్సవాలు

విశాలాంధ్ర - తుర్కయంజల్ : ప్రజల భక్తి, ఉత్సాహానికి తోడు నిలిచి గణేష్ నవరాత్రి ఉత్సవాలకు తుర్క యంజాల్ మున్సిపాలిటీ సిబ్బంది, విద్యుత్, పోలీసు, హైడ్రా, ట్రాఫిక్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో రాత్రింబవళ్ళు శ్రమించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిమజ్జన కార్యక్రమాన్ని సజావుగా పూర్తి చేయడంలో అంకితభావంతో పనిచేశారనీ అందరి సహకారంతోనే గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసాయనీ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి శివకుమార్ అన్నారు. మతాలకు, రాజకీయాలకు అతీతంగా ప్రజలందరూ ఒకటై 11 రోజులు సంతోషంగా జరుపుకున్న పండుగని ఆయన తెలిపారు. మాసబ్ చెరువులో గణేష్ నిమర్జనానికి వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారనీ వారు అన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరి పైన ఉందని వారు తెలియజేశారు. ప్రత్యేకంగా చెరువు ప్రాంగణం పరిశుభ్రత, రక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్ సరఫరా, నీటి సౌకర్యం, భద్రతా ఏర్పాట్లు మొదలైన ప్రతి అంశంలో ప్రతి శాఖ నిబద్ధతతో పనిచేసిన తీరు ప్రశంసనీయమైనదనీ అన్నారు. తుర్క యంజాల్ ప్రజల తరఫున, ఈ మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన ప్రతి అధికారి, సిబ్బందికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతాభివందనాలు తెలియజేశారు.

బీసీ రిజర్వేషన్లపై కేంద్రం దిగొచ్చేలా కామారెడ్డి సభ

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఈనెల 15వ తేదీన కామారెడ్డి వేదికగా జరగనున్న బహిరంగ సభ సన్నాహక సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రతిపక్షాల భరతం పట్టే వేదికగా ఈ సభ నిలుస్తుందని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, కామారెడ్డి సభ ద్వారా కేంద్రం దిగి రాక తప్పదని ఆయన హెచ్చరించారు. మోదీ, అమిత్ షాలకు కనువిప్పు కలిగించేలా ఈ సభ జరగబోతోందని పేర్కొన్నారు. బీజేపీ నేతలు "దేవుడి పేరు చెప్పుకొని ఓట్లు అడుగుతున్న బిచ్చగాళ్లా మారిపోయారు. బండి సంజయ్ ఉదయం లేస్తే దేవుళ్ల చుట్టూ తిరిగి ఓట్లు అడుగుతారని, దేశ్ ముఖ్ మాటకు కట్టుబడి ఉన్నానని తెలిపారు. సెక్యూరిటీ లేకుండా రావడానికి దమ్ముందా? బీసీ రిజర్వేషన్లపై దొంగాట ఆడుతున్నారు" అని మండిపడ్డారు. ఈటల రాజేందర్ ముఖం చాటేసుకున్నారని ఆయన ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్‌పై కూడా తీవ్ర స్థాయిలో మహేష్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు. "కవిత లిక్కర్ రాణిగా నిజామాబాద్‌కు చెడ్డపేరు తెచ్చారు. కేసీఆర్ కుటుంబం అంతా దొంగల ముఠా. రాష్ట్రాన్ని దోచుకున్నామని కవిత స్వయంగా అంగీకరించటం హర్షణీయమని, కానీ ఐదేళ్ళ ముందే చెబితే సన్మానించేవాళ్లం" అని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల నాటికి బీఆర్ఎస్ కనుమరుగవుతుందని తేల్చి చెప్పారు. దోచుకున్న సొమ్ములో వాటాల పంపకాల్లో తేడాల వల్లే కేసిఆర్ కుటుంబంలో కుమ్ములాటలు అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ సమానత్వానికి మారు పేరు అని టీపిసిసి చీఫ్ పేర్కొన్నారు. "కార్యకర్తల కృషివల్లే పార్టీ అధికారంలోకి వచ్చింది. రాహుల్ గాంధీ ఆశయమైన ఎవరు ఎంతో వారి వాటా వారికంత నినాదానికి సీఎం రేవంత్ రెడ్డి ఊపిరి పోశారు" అని తెలిపారు. కుల సర్వేలో 56.33 శాతం బీసీలు ఉన్నారని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని ఆయన చెప్పారు. ఈ సభలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ సురేష్ షెట్కర్, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి మృతిపై కేటీఆర్ ఆరా..!

విశాలాంధ్ర - హైదరాబాద్ : ములుగు మున్సిపాలిటీలో పనిచేస్తూ పెండింగ్ వేతనం రాకపోవడంతో కార్మికుడు మైదం మహేశ్ పురుగుల మందు తాగి ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. కార్మికుడి మృతిపై బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరా తీశారు. ఈ మేరకు రెడ్కో మాజీ చైర్మన్ ఏరువ సతీశ్‌రెడ్డి కేటీఆర్ ఆదేశాల మేరకు ఆదివారం మాధవరావుపల్లిలోని మృతుని ఇంటికి చేరుకొని పరామర్శించారు. విషయాన్ని కేటీఆర్‌కు ఫోన్‌లో తెలియజేయగా కేటీఆర్ మృతుని తల్లితో మాట్లాడి మైదం మహేశ్ చనిపోవడానికి గల కారణాలను అడిగారు. ఈ మేరకు మృతుని తల్లి కేటీఆర్‌తో ఫోన్ మాట్లాడుతూ గత 6 నెలలుగా వేతనం రాకపోవడంతో మనస్థాపంలో మృతి చెందాడని తెలియజేశారు. తన కొడుకుకు నలుగురు ఆడపిల్లలు కాగా గతంలో ఒక పాపకు గతంలో జ్వరంతో ఆ సమయంలో సైతం జీతం రాలేదని తెలియజేసింది. పైసల కోసం తిప్పలు పడితే ఒక రెండు వేలు మాత్రమే ఇచ్చారని, ఆ సమయంలో అవి సరిపోక బిడ్డ చనిపోయిందని వివరించారు. ఆరు నెలలగా జీతం పైసలు ఇవ్వకుండా ఇబ్బందులు చేస్తూ స్మశానంలో పనిచేయించారని, ఇంట్లో భార్య పిల్లలు, తిండి టికాన లేక అవస్థలు పడ్డారని వాపోయింది. కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ తరుపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కేసీఆర్ తరుపున ముగ్గురు ఆడబిడ్డలను ఆదుకుంటామని, పార్టీ తరుపున పిల్లల పేర్లపై ఆర్థిక సాయం అందిస్తామని చెప్పారు. రెండు రోజులో సతీశ్‌రెడ్డితో సాయం అందిస్తారని అధైర్యపడవద్దని ధైర్యం చెప్పారు. మృతుని అన్న కుమార్తె మైదం జ్యోతి సతీశ్‌రెడ్డి దృష్టికి మైదం మహేశ్‌తో చనిపోయే ముందు ఎవరు లేని సమయంలో వచ్చి వీడియో తీయించుకున్నారని, నీళ్ళు అనికొని మందు తాగినట్లు చెప్పించారని తెలిపింది. తామంతా ఆ సమయంలో దావాఖానలోనే ఉన్నామని, రెండు, మూడు రోజుల నుండి నీళ్ళు కావాలని అడుగుతుండే వాడని, ఈ క్రమంలో కిరిటి, రఘు అనే ఇద్దరు వచ్చి తన బాబాయ్ అయిన మహేశ్‌తో వారికి అనుకూలంగా మాటలు మాట్లాడించుకొని వీడియోను తీశారని, జీతం రాకపోవడం, వారు పెట్టిన ఇబ్బందుల వల్లనే చనిపోయాడని తెలిపారు. స్పందించిన సతీశ్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం కేటీఆర్ ఆదేశాల మేరకు పార్టీ తరుపున సాయం అందిస్తామని, మహేశ కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రభుత్వంతో కొట్లాడుతామని తెలియజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేశ్‌రెడ్డి, నాయకులు పోరిక పోమానాయక్, వేముపల్లి భిక్షపతి, పోరిక విజయ్‌రామ్‌నాయక్, గజ్జి నగేశ్, కోగిల మహేశ్, ఆకుతోట చంద్రమౌళి, గరిగె రఘు తదితరులు ఉన్నారు.

అక్రమ కేసు ఫిర్యాదు బూటకం

విశాలాంధ్ర - హైదరాబాద్ : కార్మికులకు జరుగుతున్న అన్యాయాలపై నిత్యం కార్మికుల హక్కులకై సంక్షేమానికి నిస్వార్థంగా అలుపెరగని కార్మిక పోరు సల్పుతున్న ఏఐటీయూసీ అనుబంధం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ పై పెట్టిన అక్రమ కేసు ఫిర్యాదు పచ్చి బూటకమని తెలం గాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి బ్రాంచ్ అధ్యక్షులు నరసింహ ఆరోపించారు. మహబూబ్ నగర్ జనరల్ ఆస్పత్రి పారిశుద్ధ్య కార్మికులపై వేధింపులపై, వేతనాల పెంపుకై మాట్లాడడానికి వెళ్లిన మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ పై జనరల్ ఆసుపత్రి సిహెచ్ఓ రాం నాయక్, యస్ హెచ్ ఓ నరేందర్ లు కుట్రపూరితంగా అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాక దాడి చేసి వారే మళ్లీ దొడ్డి దారిన యూనియన్ నేతలపై అక్రమ కేసుల ఫిర్యాదులు చేయడం నిరసిస్తూ ఆదివారం జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కాంట్రాక్టు కార్మికులు భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ కార్మికులకు జరుగుతున్న అన్యాయం అక్రమాలపై మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ చేస్తున్న పోరాటాలతో శానిటరీ అధికారుల, ఏజెన్సీల కాంట్రాక్టర్ల చీకటి ఒప్పందాలు వారి అవినీతి అక్రమాలు, అధికారుల నీచ వ్యసనాలు బయటపడుతున్నాయని, యూనియన్ పోరాటాన్ని ఎదుర్కోలేకే దుర్బుద్ధితోనే యూనియన్ నేత పి.సురేష్ పై తప్పుడు కేసులు దౌర్జన్యాలు దాడులు చేస్తున్నారని వండిపడ్డారు. గత నాలుగు రోజులుగా కార్మికులను వేధిస్తున్న కార్మికులు సిహెచ్ఓ రామ్ నాయక్ ఎస్ హెచ్ ఓ నరేందర్‌లను సస్పెండ్ చేయాలని ఆందోళనలో జరుగుతున్నాయని దేనికి నాయకత్వం వహిస్తున్న సురేష్ పై అక్రమ కేసులు ఫిర్యాదులు చేశారని దీని తీవ్రంగా ఖండిస్తున్నామని తక్షణమే రామ్ నాయక్ నరేందర్‌లపై విచారణ జరిపి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రి కార్మికులు నవీన్, శేఖర్, రవిందర్, ఫేర్మల్, విజయలక్ష్మి, మన్నెమ్మ, పద్మ, అలివేలు, లక్ష్మి నరసమ్మ, భార్గవి, నీరజా, శివలీల, సుక్కమ్మ, స్వాతి, నరసమ్మ, మంగమ్మ, అంజమ్మ పాల్గొన్నారు.

పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర - మొయినాబాద్ : అధిక వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షులు సామ మాధవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో భారతీయ కిసాన్ సంఘ్ అధ్యక్షులు మామిడి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధిక వర్షపాతంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని , పసల్ బీమా అందించాలన్నారు. పంటలకు లాభసాటి ధరను అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నారాయణ, రామ్ చందర్, యాదయ్య, సత్యనారాయణ, ఆంజనేయులు, దయానంద్ గౌడ్, యాదయ్య, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పెంపును తక్షణం అమలు చేయాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : ఎన్నికలలో హామీ ఇచ్చిన విధంగా పింఛన్ల పెంపును తక్షణం అమలు చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఎమార్పీఎస్ ఆధ్వర్యంలో ప్రమోద్ ఏర్పాటు చేసిన సభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, నిరాశ్రయ మహిళలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. కాంగ్రెస్ నేతృత్వం లోని రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి 21 నెలలు పూర్తయ్యాయన్నారు. ఆయన విజయం కుటుంబం, సామాజిక వర్గం వేసిన ఓట్లు కారణం కాదన్నారు. 55 లక్షల పేద ప్రజలు పింఛన్ పై నమ్మకంతో వేసిన ఓట్లే ఆయన గెలుపునకు కారణమన్నారు. ఎన్నికల ముందు 45 లక్షల మంది పింఛన్దారులు ఉన్నార న్నారు. అప్పటి నుంచి మరో 10 లక్షల మంది అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో దివ్యాంగులకు రూ.6,000, వృద్ధులు, వితంతువులు, నిరాశ్రయ మహిళలు, ఒంటరి మహిళలు రూ.4,000 పింఛన్ అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. గత ప్రభుత్వం నుంచి పెండింగ్లో ఉన్న 10 లక్షల మంది దరఖాస్తుదారులకు కూడా ఈ పరిహారం వర్తిస్తుందని, డిసెంబర్ 9, 2023 నుంచి ఆ డబ్బును నేరుగా పింఛన్దారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని రేవంత్ రెడ్డి స్వయంగా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ అంశాన్ని అసెంబ్లీలో గానీ, వెలుపల గానీ ప్రతిపక్ష పార్టీలు, నాయకులు మాట్లాడకపోవడం శోచనీయం అన్నారు. తమ మేనిఫెస్టోలో కూడా రూ.6,000 పింఛన్ హామీ ఇచ్చిన బీఆర్ఎస్ పార్టీ కూడా దీనిపై ఒత్తిడి చేయడం లేదని విమర్శించారు. ఈ సందర్భంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కొల్లూరు గ్రామ అధ్యక్షులు వై ప్రమోద మాదిగ మాట్లాడుతూ చిన్నారుల గుండె సమస్యలపై పోరాటం చేసిన మహానుభావుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఈ మహా గర్జనలో తెలంగాణ నుంచి భారీగా ప్రజలు తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ ఇన్చార్జ్ వీఎస్ రాజు మాదిగ పాల్గొన్నారు.

యదేచ్చగా అక్రమ నిర్మాణాలు

విశాలాంధ్ర - జవహర్‌నగర్ : జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో యదేచ్చగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. జవహర్ నగర్ ప్రధాన రహదారిని ఆనుకొని మున్సిపల్ కార్యాలయం ఎదురుగానే అక్రమ సెల్లార్ తవ్వకాలు, ఎలాంటి అనుమతులు లేకుండానే బహుళ అంతస్తుల కమర్షియల్ బిల్డింగ్ నిర్మాణ పనులు చక చక జరుగుతున్నాయి. ఇంత దర్జాగా నిర్మాణం చేపడుతున్న అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరించడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేసే సిబ్బంది అక్రమ నిర్మాణదారులు మధ్య దళారుల నుంచి బేరసారాలు నడుపుతూ లక్షలలో ముడుపులు దండుకొని వారి కనుసనల్లోనే కార్పొరేషన్ పరిధిలో వందల సంఖ్యలో నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జవహర్ నగర్ కార్పొరేషన్ పరిధిలో పేదలు 60 గజాలలో రేకుల రూములు నిర్మాణం చేసుకుంటే రాత్రి రాత్రే జెసిబిలతో విరుచుకుపడి పోలీసుల బందోబస్తుతో నిర్దాక్షిణంగా కూల్చివేతలు జరుపుతున్న అధికార యంత్రాంగం ఇలాంటి నిర్మాణాల పైన మౌనం వహించడం అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలుకుతున్నారనేది స్పష్టంగా అర్థమవుతుంది. ఈ అక్రమ నిర్మాణాలపై మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా పురపాల శాఖ అధికారులకు ఇప్పటికే అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసువాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినప్పటికీ ఇక్కడ అవినీతికి అలవాటు పడ్డ అధికారులు పైఅధికారుల ఆదేశాలను తుంగలోతొక్కి సర్కార్ ఆదాయానికి గండి కొడుతూ ఇక్కడ నిర్మాణాలపై ఇంతవరకు ఏ ఒక్క నిర్మాణం పైన సరైన చర్యలు తీసుకొని నిర్మాణాన్ని కూల్చివేసిన దాఖలాలు లేవు. ఇప్పటివరకు అక్రమ నిర్మాణం ఏ ఒక్కటి కూడా పూర్తిగా తొలగించిన సందర్భాలు లేవు. మీదికి మాత్రం మొక్కుబడిగా నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారంటే దీన్ని బట్టి అర్థమవుతుంది అధికారులు ఎంతటి నిబద్ధతతో విధి నిర్వహణలో నిజాయితీగా విధులు నిర్వహిస్తున్నారో తేటతెల్లమవుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపడతారా అధికారుల మెప్పు కోసం హడావుడి చేసి తూతుమంత్రంగా అక్రమ నిర్మాణాలను తొలగించి చేతులు దులుపుకుంటారా కఠిన చర్యలు తీసుకుంటారా వేచి చూడాలి.

చిలుకూరు బాలాజీ ఆలయం తాత్కాలిక మూసివేత

విశాలాంధ్ర - మొయినాబాద్ : ప్రసిద్ధ చిలుకూరు బాలాజీ దేవాలయాన్ని చంద్రగ్రహణం కారణంగా సాయంత్రం 4 గంటల నుంచి మూసివేశారు. ఆలయ ప్రధానార్చకులు రంగరాజన్ తెలిపిన వివరాల ప్రకారం, గ్రహణం అనంతరం ఆలయ సంప్రోక్షణ, అభిషేకాల తర్వాత సోమవారం ఉదయం 8 గంటలకు ఆలయాన్ని తిరిగి తెరుస్తారు. భక్తులు సోమవారం ఉదయం 8 గంటల తర్వాత దర్శనానికి రావాలని ఆయన సూచించారు. ఈ తాత్కాలిక మూసివేతపై భక్తులు గమనించాలని కోరారు.

రాజ్యాంగబద్ధ పాలనను అందిచడంలో విఫలం

విశాలాంధ్ర - బషీర్ బాగ్: మనువాద పార్టీలకు రాజకీయ ప్రత్యామ్నాయ జాతీయ ప్రజాస్వామిక లౌకిక కూటమి మాత్రేమేనని ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ ప్రకటించారు. ఆదివారం హైదరాబాద్, హిమాయత్ నగర్‌లో ఫ్రంట్ కేంద్ర కార్యక్రమంలో జరిగిన స్టీరింగ్ కమిటీ సమావేశానికి కృష్ణ స్వరూప్ అధ్యక్ష వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బీజేపీ న్యాకత్వంలోలోని ఎన్ డి ఏ, కాంగ్రెస్ న్యాకత్వంలోని ఈ,పి,ఏ, పక్షాలు రాజ్యాంగ బద్ధ పాలనను అందిచడం లో విఫలం చెందారు అని ఆరోపించారు. ఈ దోపిడీ మనువాద రాజకీయలతో ప్రజలకి అన్యాయం జరుగుతుందన్నారు. ఈ రొండు కూటమిలను సారిస్తున్న ఆర్థిక విధానాలతో దేశంలోని మెజార్టీటి దళిత, బహుజనుల ప్రజల భవిష్యత్తుకు పెను ప్రమాదం అని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరస్థితిలో ఎస్సి, ఎస్టీ, బీసీ మత మైనారిటీలాల న్యాకత్వంలో ఉన్న రాజకీయ పార్టీలు కుల ప్రజా సంఘాలు అంత ఐక్య ఫ్రంట్ ఏర్పాటు ద్వారా మాత్రమే మనువాద పార్టీలను ఓడించాగలతమన్నారు. దోపిడీ కుల కార్పొరేట్ మాఫియా రాజకీయాలను ప్రత్యానం గా రాజకీయ శక్తిగా ఎదిగినప్పుడు మాత్రమే అణగారిన ప్రజలకు సోషల్ జస్టిస్ సాధించకాలుగుతాం అని, రాజ్యాంగని సంపూర్ణగా అమలుపంచుకుంటాం అని ఈ సందర్భంగా ఫ్రంట్ రాజకీయ భవిష్యత్తు రాజకీయ కార్యాచరణం రూపొదించడం జరిగిందన్నారు. అక్టోబర్ నెలకార్లో ఫ్రంట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఒక ర్యాలీ నిర్వహించాలని, ర్యాలీ ప్రదానంగా, మనువాద పాలకుల నుండి రాజ్యాంగని రక్షించుకుందాం దళిత బహుజనుల హక్కులని కాపాడుకుందాం అంటూ పిలుపునిస్తూ ర్యాలీ చేపడుతాం అన్నారు. ఈ సమావేశంలో ఎస్, అశోక్, కోళ్ల సుధాకర్, వి, ఎల్ రాజు, ఊళ్లూరు వెంకట రాజేష్‌రావు, ఏ.సుదర్శన్, షేక్ బాషా, అజ్మీరా లాకపతి, సంపత్ ఎం, ఆర్, పీఏ స్, ఎం, తిక్కయ్య, ఎస్.రావు, నక్క దేవేందర్ రావు, కాసాని అశోక్ కుమార్ గౌడ్, ఇటికాల గణేష్, జనా చింటూ, మద్యల రాయప్ప పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా బీసీలు ఏకం కావాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి డివిజన్ లోగల దూబే కాలనీ మెయిన్ రోడ్డు వద్ద నిరూస బ్యాంక్వెట్ హాల్‌లో బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ అధ్యక్షతన బీసీ కులాల, బీసీ సంఘాల ఐక్యవేదిక సమావేశంలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ 80 శాతం ఉన్న బీసీలకు రాజకీయంగా, సామాజికంగా ఆర్థికంగా తీవ్రమైన అన్యాయం జరిగిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి గత పాలకుల బీసీల పట్ల వహించిన నిర్లక్ష్యం వలన బీసీలకు నష్టం జరిగిందని, ఒక గొప్ప సంకల్పంతో పోరాడి కృషి చేసి 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చిన ఘనత సీఎంకి చెందుతుందని తెలిపారు. అందులో భాగంగా బీసీలకు వచ్చే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలంటే తెలంగాణ రాష్ట్రంలోని బీసీలందరూ ఏకమై ఒకే నినాదంతో ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపిసిసీ జనరల్ సెక్రటరీ జగదీశ్వర్ గౌడ్, ఆర్ కృష్ణయ్య తనయుడు డాక్టర్ అరుణ్, ఓ శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు వీరేశం గౌడ్, మహిపాల్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్, గోపినగర్ బస్తీ అధ్యక్షులు గోపాల్ యాదవ్, సైదులు యాదవ్, వెంకటేష్ ముదిరాజ్ బీసీ సంక్షేమ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గణపతి లడ్డు రూ.2 లక్షల 66 వేలకు భాస్కర్ కైవసం

విశాలాంధ్ర - మొయినాబాద్ : గణపతి నవరాత్రులను పురస్కరించుకుని కేతిరెడ్డిపల్లి గ్రామంలో దుర్గా అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి స్వామి వారి లడ్డూను గ్రామానికి చెందిన భాస్కర్ రూ.2 లక్షల 66 వేలకు దక్కించుకున్నారు. తొలుత స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ లడ్డూను అందజేశారు. మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో కూడా లడ్డూలను హోరాహోరీగా వేలంపాటలు నిర్వహించారు. అనంతరం గణపతి విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించి సమీపంలో ఉన్న ప్రాంతాల్లోని చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు.

ఆర్ట్ గ్యాలరీలో కొలువుదీరిన సామూహిక ఆర్ట్ ఎగ్జిబిషన్

విశాలాంధ్ర - జూబిలీహిల్స్ : ఇంటీరియర్స్, రిటర్న్ టు అన్‌డిస్కవర్డ్ సెల్ఫ్ అనే థీమ్ తో, ఢిల్లీకి చెందిన గ్యాలరీ డాట్‌వాక్ ఆధ్వర్యంలో సామూహిక ఆర్ట్ ఎక్సిబిషన్ ప్రదర్శన ప్రారంభం అయ్యింది. ఈ ప్రదర్శన హైదరాబాద్‌లోని కావూరి హిల్స్, మాధాపూర్ స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో, 6 నుంచి 13 వరకు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 5 గంటల వరకు కొనసాగుతుంది. ఈ ప్రదర్శనను, సిబ్‌దాస్ సేన్ గుప్తా క్యురేట్ చేయగా, భారతీయ కళా రంగంలో ఆయనకు ఇరవై సంవత్సరాలకుపైగా అనుభవం ఉన్న శ్రీజిత్ సి.ఎస్. స్థాపించిన ఆధునిక కళా గ్యాలరీ, గ్యాలరీ డాట్‌వాక్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది. ఈ ప్రధాన ప్రదర్శనలో భారతదేశం నలుమూలల నుండి వచ్చిన 33 మంది కళాకారుల కృతులు ఉంటాయి. వీటిలో పలు తరాలు, పలు కళా రూపాలు ఒకేచోట కలుస్తాయి. అలాగే వారంపాటు అనుబంధ కార్యక్రమాలు జరుగుతాయి. వీటిలో క్యురేటోరియల్ వాక్‌త్రూ, సినిమా ప్రదర్శనలు, అనుభవజ్ఞులైన కళాకారుల ప్రదర్శనలు ఉంటాయి.

నిజాం వెన్నులో వణుకు పుట్టించిన ధీరుడు రావి

సీపీఐ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర-హైదరాబాద్: నిరంకుశ పాలన, భూస్వామ్య దోపిడీ వర్గాల నుంచి ప్రజలను రక్షించడమే కాకుండా భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తే లక్ష్యంగా సాగిన మహత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ వెన్నులో వణుకు పుట్టించిన పోరాట యోధుల్లో రావి నారాయణరెడ్డి ధీరుడని సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ తెలిపారు. హైదరాబాద్, బంజారా హిల్స్, రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో ఆదివారం పద్మవిభూషణ్ రావి నారాయణరెడ్డి 34వ వర్ధంతి సభ తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ కార్యదర్శి కందిమళ్ల ప్రతాప్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ముందుగా రావి నారాయణరెడ్డి విగ్రహానికి డా. కె. నారాయణ, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, రాజి రెడ్డి, స్మారక ట్రస్ట్ సభ్యులు ఉజ్జిని రత్నాకర్‌రావు, రావి నారాయణరెడ్డి కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం డా. కె. నారాయణ మాట్లాడుతూ 1925లో భారత కమ్యూనిస్టు పార్టీ దున్నే వాడిదే భూమి అన్న నినాదంతో ప్రారంభమైందని, ఈ నినాద స్ఫూర్తితోనే రావి నారాయణరెడ్డి భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాటాలు ప్రారంభించారన్నారు. నిజాం వ్యతిరేక తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మఖ్దూం మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డితో కలిసి రావి కీలక భూమిక పోషించారని చెప్పారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో భాగంగా తనకున్న 700ఎకరాల్లో 500ఎకరాలను పేదలకు పంచారని, ఈ స్ఫూర్తితోనే ఆచార్య వినోబాభావే భూదాన ఉద్యమం ప్రారంభించారని పేర్కొన్నారు. 1951-52లో స్వాతంత్ర్యానంతరం దేశంలో జరిగిన తొలి లోక్ సభ ఎన్నికల్లో నల్గొండ నియోజకవర్గం నుంచి పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) పార్టీ అభ్యర్థిగా పోటీచేసి దేశంలోనే అత్యధిక మెజారిటీ పొందిన ఘనత సాధించిన పార్లమెంటు సభ్యుడిగా రికార్డు సృష్టించాడని తెలిపారు. సీపీఐ నాయకుడిగా నిజాం నిరంకుశ పాలనను పెకలించేందుకు పిడికిలి బిగించిన ధీశాలి అని, నమ్మిన సిద్ధాంతాన్ని తుదిశ్వాస వరకూ ఆచరించిన మహనీయుడు రావి నారాయణరెడ్డి అని, ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని నేటి యువత సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలపై పోరాటాలు నిర్మించాలని నారాయణ కోరారు. కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో రావి నారాయణరెడ్డి వంటి కమ్యూనిస్టుల త్యాగాలతోనే హైదరాబాద్ స్టేట్ భారత యూనియన్ లో విలీనం ఆయిందని, ఆనాడు హిందువులు, ముస్లింలు అంత ఏకమై నియంతృత్వ నిజాం కు వ్యతిరేకంగా పోరాడి నిజాం సంస్థానాన్ని కూల్చివేశారని, నేడు కొందరు దీనికి మతం రంగు పులిమి తమ రాజకీయ లబ్ధిపొందేందుకు కుట్రలు చేస్తున్నారని దీనిని సహించబోమని హెచ్చరించారు. రావి నారాయణరెడ్డి సేవలు ఈ నేలపై అజరామరం. భావితరాలకు ఆదర్శనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు పీ ప్రేమ్ పావని, విజయలక్ష్మి పండిట్, రామస్వామి, ప్రభులింగం, కె. నరసింహ రెడ్డి, ఆరుట్ల రాజ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజలు గర్వించదగ్గ మహానేత రావి

సీపీఐ ఏపీ కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర- హైదరాబాద్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి ప్రజలు గర్వించదగ్గ మహానేత రావి నారాయణరెడ్డి యని సీపీఐ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి కె.రామకృష్ణ కొనియాడారు. రావి నారాయణరెడ్డి 34 వర్ధంతి సందర్భంగా సీపీఐ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ అధ్వర్యాన ఆదివారం మఖ్దూంభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాగిన పోరాటంలో గాంధీ చేస్తున్న ఉద్యమానికి ప్రభావితుడైన రావి నారాయణరెడ్డి కాకినాడలో జరిగిన సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. తన నిజం రాచరికానికి, భూస్వాముల పీడనకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో ఆంధ్ర మహాసభ లో చేరారన్నారు. ఆంధ్ర మహాసభకు రెండుసార్లు అధ్యక్షునిగా ఎన్నికైన రావి నారాయణ రెడ్డి... దొరలు, భూస్వాముల ఎదిరించాలంటే సాయిధ పోరాటమే పరిష్కారమని భావించి... మఖ్దూం, బద్దం ఎల్లారెడ్డితో కలిసి సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారన్నారు. వేలాది గ్రామాలను విముక్తి చేసి లక్షలాది ఎకరాల భూములను పేద ప్రజలకు పంచారని తెలిపారు. గ్రామాలలో నిజాం ప్రైవేట్ సైన్యంగా కొనసాగుతున్న రజాకారుల ఆగడాలను ఎదిరించి ప్రజా పోరాటాలను ఉధృతం చేయడంలో క్రియాశీల పాత్ర పోషించారన్నారు. దేశంలో తొలిసారిగా జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో జవహర్‌లాల్ నెహ్రూ కంటే అత్యధిక ఓట్లు సంపాదించి పార్లమెంటు లోకి తొలి అడుగు వేసిన ఘనత రావి నారాయణరెడ్డి గారికి దక్కిందని తెలిపారు. రావి నారాయణ రెడ్డి గారి సేవలను గుర్తించిన ఆంధ్ర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయగా... కేంద్ర ప్రభుత్వం పద్మ విభూషణ్ అవార్డు ఇచ్చి గౌరవించిందని తెలియజేశారు.

యువతరాన్ని ప్రోత్సహించిన ఆదర్శ నాయకులు రావి: ఈటీ నరసింహ

భూమికోసం, భుక్తి కోసం, సాగిన మహత్తర తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన రావి నారాయణ రెడ్డి అనంతరం పార్టీ పరంగా , ప్రజాప్రతినిధి పరంగా అనేక అవకాశాలు ఉన్నప్పటికీని వాటన్నింటిని త్యజించి యువతరానికి అవకాశాలు కల్పించాలని క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నారని సీపీఐ తెలంగాణ సహాయకార్యదర్శి ఈటీ నరసింహ కొనియాడారు. హైదరాబాద్ స్టేట్ లో సంవత్సరాల తరబడి వివక్ష అనుభవిస్తూ విద్యకు దూరంగా ఉన్న దళితుల కోసం అనేక పాఠశాలలో నెలకొల్పి వారి వారిని ఉన్నత విద్యావంతులుగా, ఉద్యోగులుగా తీర్చిదిద్దడంలో రావి నారాయణరెడ్డి పాత్ర చిరస్మరణీయమన్నారు. భవిష్యత్తులో వారి స్ఫూర్తితో మరిన్ని ప్రజా పోరాటాలను చేసి వారికి ఘనమైన నివాళులు అర్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ, నాయకులు కొండలరావు, రవి, సైదులు విజయ్ అడివయ్య, ఏఐఎస్ఎఫ్ నాయకులు అనిల్ ,అరుణ్ సుశాంత్, కె.అరుణ్, మౌలాలి, కార్యాలయ సిబ్బంది శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పంజాబ్ బాధితులకు సీపీఐ వరద సాయం

ఫజిల్కాలో ఎంపీ సంతోశ్ కుమార్ పర్యటన

న్యూదిల్లీ: పంజాబ్‌ను వర్షాలు, వరదలు ముంచెత్తాయి. భారత్-పాకిస్థాన్ సరిహద్దులోని ఫజిల్కా జిల్లా ఎక్కువగా ప్రభావితమైంది. జిల్లా మొత్తం ముంపునకు గురైంది. ఇళ్లు నీటమునిగి ఆహారం, నీళ్ల లేక ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. దీంతో సీపీఐ రంగంలోకి దిగి బాధితులకు వరద సహాయాన్ని అందించింది. వరద నష్టం, పంట నష్టం, పునరావాసం కోసం ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మళ్లీ వరదలు వస్తే ఇలా నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని కోరింది. పార్లమెంటులోనూ ఈ డిమాండ్ చేస్తామని తెలిపింది. జల దిగ్బంధంలో ఉన్న ఫిజిల్కా పరిధి గ్రామాలను సీపీఐ ఎంపీ పి.సంతోశ్ కుమార్ సందర్శించారు. పడవలో బాధితులను చేరుకున్నారు. వలంటీర్లతో కలిసి వరద సాయం పంపిణీ చేశారు. అందరినీ ఆత్మీయంగా పలుకరించారు. వారి కష్టాలు పంచుకున్నారు. సీపీఐ ఎల్లప్పుడు అండగా నిలుస్తుందని బాధితులకు భరోసానిచ్చారు. సంతోశ్ కుమార్ వెంట ఏఐవైఎఫ్ ప్రధాన కార్యదర్శి సుఖ్‌జిందర్ మహేసరి, సీపీఐ ఫజిల్కా జిల్లా కార్యదర్శి హన్స్ రాజ్ గోల్డెన్‌తో పాటు అనేక మంది యువజన, విద్యార్థి నాయకులు ఉన్నారు. పంజాబ్‌తో పాటు హిమాచల్ ప్రదేశ్, కశ్మీర్‌లోనూ వరదలు బీభత్సం సృష్టించడం విదితమే.

వృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక కమిషన్

సీఎంకు ముప్పాళ్ల లేఖ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అక్టోబర్ 1వ తేదీ లోగా రాష్ట్రంలోని వృద్ధులు, వితంతువులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు సీఎం నారా చంద్రబాబు నాయుడుకు ఆదివారం లేఖ రాశారు. రాష్ట్రంలో 13 శాతం పైగా 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులు జీవిస్తున్నారని, వీరుగాక తీవ్ర అనారోగ్య సమస్యలతో ప్రభుత్వం అందిస్తున్న రూ.15 వేలు నెలసరి పెన్షన్ పొందుతున్న వారితోపాటు విభిన్న ప్రతిభావంతులు, వితంతువులు సుమారు 80 లక్షలకు పైగా అనేక ఇబ్బందులతో తమ జీవితాలను కొనసాగిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.4 వేల సామాజిక పెన్షన్ కొంత ఉపశమనం, ఆత్మస్థైర్యం కలిగించడానికి తోడ్పడిందని, అయితే పూర్తిస్థాయిలో తోడ్పాటు అందించాలని ఆయన కోరారు. అందుకుగాను అనేక అంశాలను ముప్పాళ్ల లేఖలో ప్రస్తావించారు. రాష్ట్రంలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, వివిధ అనారోగ్య కారణాలతో క్షోభను అనుభవిస్తున్న వారి నిరంతర సంక్షేమం అమలు జరుపుటకు 'ఒక ప్రత్యేక రాష్ట్ర స్థాయి కమిషన్' ఏర్పాటు చేయాలని, సంక్షేమ పెన్షన్ నిబంధనలను సడలించి...అర్హత కలిగిన వయసున్న భార్యభర్తలిరువురికీ పెన్షన్ మంజూరు చేసి న్యాయం చేకూర్చాలని, ప్రతి జిల్లాలో ప్రభుత్వపరంగా వృద్ధాశ్రమాలను ఏర్పాటు చేయాలని, ఔత్సాహికులు ఏర్పాటుచేసిన వృద్ధాశ్రమాలకు తగిన గ్రాంట్లు, ప్రోత్సాహాలను అందించాలని, వృద్ధాశ్రమా లకు అవసరమైన నిత్యావసర వస్తువులను సివిల్ సప్లై శాఖ ద్వారా అందించాలని, ప్రాంతీయ లేక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ఆయా వృద్ధాశ్రమాలలో నివసిస్తున్న వారికి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించి తగిన మందులు అందించాలని, అన్ని రకాల రైళ్లు, బస్సులు, విమానాలలోనూ సీనియర్ సిటిజన్స్‌కు 50 శాతం రాయితీపై ప్రయాణ సదుపాయాన్ని కల్పించాలని, సీనియర్ సిటిజన్లకు పిల్లలు సరిగా చూడని పరిస్థితులు ఏర్పడినప్పుడు బహుమతిగా ఇచ్చిన ఆస్తులను తిరిగి తమ పేరున ఉంచుకొనేలా ప్రత్యేక జీఓ తేవాలని, బ్యాంకులలో రివర్స్ మా ర్టగేజ్ స్కీమ్ అమలుకు అవకాశం కల్పించాలని, సీనియర్ సిటిజన్స్ సంక్షేమానికి రాష్ట్రస్థాయి కమిషన్‌తో పాటు ప్రత్యేక డిపార్ట్‌మెంట్‌ను, అన్ని జిల్లాల్లో సీనియర్ అధికారితో కూడిన వ్యవస్థను ఏర్పాటు చేయించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వయోవృద్ధుల, విభిన్న ప్రతిభావంతుల, వితంతువుల, వ్యాధి పీడితుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలపై రేడియో, టీవీ, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రజలలో అవగాహన కల్పించాలని కోరారు. ఆయా అంశాలను చర్చించి తక్షణ చర్యలు చేపట్టాలని ముప్పాళ్ల సీఎంకు విజ్ఞప్తి చేశారు.

జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్: మావోయిస్టు మృతి

చైబాసా: జార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లాలో ఆదివారం భద్రతా దళాలతో జరిగిన ఎదురు కాల్పుల్లో రూ.10 లక్షల రివార్డుతో ఉన్న ఒక మావోయిస్టు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గోయిల్‌కేరా పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని బుర్జువా హిల్ వద్ద ఉదయం ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. కొల్హాన్ డీఐజీ అనురంజన్ కిస్పొట్ట పీటీఐతో మాట్లాడుతూ 'ఉదయం మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది. ఆ తర్వాత జరిగిన సెర్చ్ ఆపరేషన్‌లో ఒక మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు' అని తెలిపారు. ఐజీ (ఆపరేషన్స్), జార్ఖండ్ పోలీసు ప్రతినిధి ఎస్.మైఖేల్ రాజ్ పీటీఐతో మాట్లాడుతూ 'మృతదేహం సీపీఐ (మావోయిస్టు) స్వయం ప్రకటిత జోనల్ కమాండర్ అమిత్ హన్స్‌దా అలియాస్ ఆప్టాన్ ది అని గుర్తించారు. అతనికి రూ.10 లక్షల రివార్డు ఉంది' అని అన్నారు. ఈ ప్రాంతంలో ఇంకా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. 'గోయిల్‌కెరా పోలీస్ స్టేషన్ పరిధిలోని రేలాపరల్ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నట్లు చైబాసా పోలీసు సూపరింటెండెంట్‌కు సమాచారం అందింది' అని మరొక అధికారి తెలిపారు. సమాచారం ఆధారంగా, భద్రతా దళాల బృందాలు ఉదయం గాలింపు చర్యలు నిర్వహించాయి. ఉదయం 6 గంటల ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగింది' అని తెలిపారు. 'భద్రతా దళాలు తమపై దాడి చేస్తున్నాయని గమనించిన మావోయిస్టులు దట్టమైన అడవుల్లోకి పారిపోయారు. ఈ తర్వాత జరిగిన గాలింపు ఆపరేషన్‌లో హన్స్‌దా మృతదేహం తుపాకీతో పాటు దొరికింది' అని ఆ అధికారి వివరించారు.

అమెరికాపై 75% సుంకాలు వేయగలరా?

ప్రధాని మోదీకి కేజ్రీవాల్ సవాల్

కేంద్రం చర్యతో పత్తి రైతులకు తీరని నష్టం



న్యూదిల్లీ: డిసెంబర్ 31వ తేదీ వరకు అమెరికా నుంచి పత్తి దిగుమతులపై 11 శాతం సుంకాన్ని మినహాయించాలన్న కేంద్రంలోని మోదీ సర్కారు నిర్ణయం భారత పత్తి రైతులను దెబ్బతీస్తుందని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఇది అమెరికా రైతులను ధనవంతులుగా, గుజరాత్ సాగుదారులను పేదలుగా మారుస్తుందని ఆయన అన్నారు. ప్రధాని మోదీకి ధైర్యముంటే అమెరికా దిగుమతులపై ధైర్యంగా 75 శాతం సుంకాలు విధించాలని సవాల్ విసిరారారు. "ప్రధాని ధైర్యం చూపించాలని మేం కోరుతున్నాం. దేశం మొత్తం మీ వెనుక ఉంది. భారతదేశం నుంచి వచ్చే ఎగుమతులపై అమెరికా 50 శాతం సుంకం విధించింది. మీరు అమెరికా నుంచి వచ్చే దిగుమతులపై 75 శాతం సుంకం విధించండి. దేశం దానిని భరించడానికి సిద్ధంగా ఉంది. దానిని విధించండి. అప్పుడు ట్రంప్ తలొగ్గుతుందో లేదో చూడండి" అని కేజ్రీవాల్ అన్నారు. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే పత్తిపై 11 శాతం సుంకం విధించాలని, కనీస మద్దతు ధరను నిర్ణయించాలని కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. 20 కిలోలకు రూ. 2,100 చొప్పున పత్తిని సేకరించాలని, అలాగే ఎరువులు, విత్తనాలపై సబ్సిడీని కూడా ఆయన డిమాండ్ చేశారు. భారత్‌పై అమెరికా విధించిన 50 శాతం సుంకం వజ్రాల కార్మికులను కూడా ప్రభావితం చేసిందని, ఎందుకంటే మోదీ ప్రభుత్వం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందు మోకరిల్లిందని ఎద్దేవా చేశారు. డిసెంబర్ 31 వరకు పత్తిపై దిగుమతి సుంకం మినహాయింపును పొడిగించాలనే నిర్ణయం ఎగుమతి మార్కెట్లలో భారత్ స్థానాన్ని బలోపేతం చేస్తుందని కేజ్రీవాల్ తెలిపారు. ట్రంప్ భారత్?పై 50 శాతం సుంకం విధించినప్పుడు, మోదీ దానికి ప్రతిగా పెంచలేదని తెలిపారు. కానీ దానిని (అమెరికా నుంచి పత్తి దిగుమతులపై) 11 శాతం తగ్గించారని, ప్రధాని ఎందుకు వంగి బలహీనంగా మారారని ప్రశ్నించారు. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద మార్కెట్ అని, ఇక్కడి ప్రజలు మోదీ వెనుక నిలబడతారని అన్నారు. "దేశం మొత్తం మోదీజీ వెనుక నిలబడి ఉంది. ఆయన (ట్రంప్) 50 శాతం సుంకం విధించారు. మోదీజీ పత్తిపై 100 శాతం సుంకం విధించి ఉండాలి. ట్రంప్ తలవంచాల్సి వచ్చేది. ట్రంప్ ఒక పిరికివాడు. తనను ధిక్కరిస్తే అన్ని దేశాల ముందు ఆయన తలవంచుతారు. నాలుగు అమెరికన్ కంపెనీలను మూసివేయండి, వారు ఇబ్బందుల్లో పడతారు" అని ఆయన పేర్కొన్నారు. అమెరికా నుండి దిగుమతి చేసుకునే పత్తిపై 11 శాతం సుంకాన్ని తొలగించాలనే భారత్ విధాన నిర్ణయం కారణంగా, అక్టోబర్-నవంబర్‌లో రైతులు మార్కెట్‌కు తీసుకువచ్చినప్పుడు వారి ఉత్పత్తులను విక్రయించబోమని కేజ్రీవాల్ అన్నారు. "అమెరికా నుంచి పత్తి (భారతదేశంలోకి) వచ్చినప్పుడు, ఇక్కడి రైతులకు మార్కెట్లో రూ. 900 కంటే తక్కువ లభిస్తుంది. రైతుల విషయంలో ఇదే జరుగుతోంది. అమెరికా రైతులు ధనవంతులుగా మారుతున్నారు. గుజరాత్ రైతులు పేదలుగా మారుతున్నారు" అని తెలిపారు. "ఇప్పుడు మన దేశంలోని రైతులు తమ పత్తిని అమ్మడానికి మార్గం లేదు. రుణాలు తీసుకొని విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేశారు. వ్యవసాయ కూలీలకు డబ్బు చెల్లించారు. ఇప్పుడు వారు రుణం ఎలా తిరిగి చెల్లిస్తాడు? బలవన్మరణకు పాల్పడడం తప్ప వేరే మార్గం ఉండదు" అని కేజ్రీవాల్ ఆవేదన వ్యక్తపర్చారు. అమెరికా ముందు భారత్ నిస్సహాయతను కూడా ఆయన ప్రశ్నించారు. ట్రంప్ సుంకాలు విధించిన ఇతర దేశాలు తీవ్రంగా స్పందించినప్పటికీ... భారత్ ఎటువంటి చర్య తీసుకోలేదని పేర్కొన్నారు.

కొత్త వైద్య కళాశాలలపై విపక్ష అసత్యం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కొత్తగా నిర్మిస్తున్న వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేస్తున్నారన్న విపక్ష ఆరోపణలను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ ఖండించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. పీపీపీ విధానంలో నిర్మాణం జరుగుతున్న కళాశాలలు పూర్తయ్యాక యాజమాన్యం ప్రభుత్వానికే ఉంటుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం 17 వైద్య కళాశాలలు తెచ్చామని చెప్పుకున్నా ఒక్కటీ పూర్తిచేయలేదని, చాలా చోట్ల నిర్మాణం 15-20 శాతానికే పరిమితమైందని మంత్రి విమర్శించారు. కూటమి ప్రభుత్వం మాత్రం సగంలో ఆగిపోయిన ప్రాజెక్టులను పీపీపీ మోడల్‌లో పూర్తి చేస్తోందని తెలిపారు. పాడేరు వైద్య కళాశాల ఇప్పటికే ప్రారంభమైందని, మార్కాపురం, ఆదోని, మదనపల్లె, పులివెందుల తదితర చోట్ల కళాశాలలను వేగంగా పూర్తి చేస్తామన్నారు. పీపీపీ మోడల్‌లో ఆసుపత్రుల్లో ఔట్‌పేషెంట్ సేవలు ఉచితంగా, 70 పడకలు ప్రభుత్వ పథకాల కింద ఉచిత చికిత్సకు అందుబాటులో ఉంటాయని దుర్గేశ్ స్పష్టం చేశారు.

జాతీయ చిహ్నానికి అవమానం

తక్షణమే హజ్రత్బల్‌లో శిలాఫలకం తొలగించాలి: నారాయణ

న్యూదిల్లీ: జాతీయ చిహ్నాన్ని బీజేపీ అవమానించిందని సీపీఐ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. అశోక చక్ర ఏ పార్టీకీ, వ్యక్తికీ సంబంధించినది కాదని, దీనిని రాజకీయ ప్రచారాల కోసం మతప్రదేశాలలో వినియోగించరాదని ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. జమ్మూకశ్మీర్‌లోని హజ్రత్బల్ ప్రార్థనా స్థలంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. జాతీయ చిహ్నాన్ని రాజకీయ పార్టీలు దుర్వినియోగించకుండా ప్రభుత్వం భరోసా ఇవ్వాలని నారాయణ కోరారు. 'కశ్మీరులో దాల్ సరస్సు తీరంలోగల హజ్రత్బల్ ప్రాంగణంలో బీజేపీ నాయకురాలు డా.దరాక్షన్ ఆంద్రబీ ఇటీవల ఒక శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. దానిపై ఆమె పేరు పక్కనే జాతీయ చిహ్నం ఉంది. దేశ గణతంత్ర ప్రతిష్ఠను దిగజార్చేలా వ్యక్తులు తమ గొప్పతనాన్ని చాటుకోవడానికో, రాజకీయ ప్రయోజనాల కోసమే జాతీయ చిహ్నాన్ని సాధన చేసుకోవడం ఆక్షేపణీయం' అని నారాయణ పేర్కొన్నారు. పవిత్ర స్థలంలో రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్దేశపూర్వకంగా జాతీయ చిహ్నంతో కూడిన శిలాఫలకం ఏర్పాటు చేయడాన్ని ఖండిస్తున్నట్లు వెల్లడించారు. జాతీయ చిహ్నాన్ని అవమానించడమే కాకుండా, పుండు మీద కారం జల్లిన విధంగా బీజేపీ ప్రభుత్వ వైఖరి ఉందని విమర్శించారు. ఇటువంటి చర్యలు మతపరమైన భావోద్వేగాలను దెబ్బ తీయడమే కాకుండా, రాజ్యాంగ విలువలను దిగుజారుస్తాయన్నారు. ఈ చర్యను ప్రతిఘటించిన వారిపై ఉగ్రవాదులుగా ముద్రవేసిందనీ, ప్రజాస్వామ్యబద్ధంగా అసమ్మతిని, నిరసన హక్కును నేరంగా చిత్రీకరించే ప్రయత్నాన్ని చేస్తుందని, దీనిని సీపీఐ ఖండిస్తోందని నారాయణ తెలిపారు.

అమరావతిపై దుష్ప్రచారం చేస్తే ప్రజలే ఛీకొడతారు: మంత్రి నారాయణ

విశాలాంధ్ర-సచివాలయం: అమరావతి రాజధాని మునిగి పోయిందని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, అబద్ధాలు మాట్లాడితే ప్రజలే ఛీకొడతారంటూ మంత్రి నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం అమరావతి రాజధానిలో మంత్రి నారాయణ పర్యటించారు. నేలపాడులో నిర్మాణంలో ఉన్న గెజిటెడ్ అధికారుల టైప్-1, టైప్ 2 ఇళ్లను పరిశీలించారు. పనుల పురోగతిపై సీఆర్డీయే ఇంజనీర్లు, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణంతో పాటు మౌలిక వసతుల కల్పన వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతిలో గెజిటెడ్, గ్రూప్-డి అధికారుల కోసం మొత్తం 14 టవర్స్‌లో 1,440 ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. టైప్-1లో 384 ఇళ్లు, టైప్ 2లో 336 ఇళ్లు, గ్రూప్-డి అధికారుల కోసం 720 ఇళ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 31 లోగా అన్ని టవర్లను పూర్తి చేస్తామన్నారు. రోడ్లు, డ్రెయిన్లు పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఫిబ్రవరి 1వ తేదీ నాటికి నిర్మాణం పూర్తి చేసి అధికారులకు అప్పగిస్తామని చెప్పారు. ఐఏఎస్ అధికారుల టవర్ల నిర్మాణం దాదాపు పూర్తయిందన్నారు. మొత్తం 4,400 ఇళ్లలో 3,750 ఇళ్లను వచ్చే మార్చి నాటికి అధికారులకు, ఉద్యోగులకు అప్పగిస్తామన్నారు. ట్రంక్ రోడ్లు ఏడాదిలో, లే అవుట్ రోడ్లు రెండున్నరేళ్లలో, ఐకానిక్ టవర్లను మూడేళ్లలో పూర్తి చేస్తామన్నారు. అమరావతిపై ఏసీ రూములో కూర్చుని కొంతమంది ఇష్టానుసారం మాట్లాడుతున్నారన్నారు. అమరావతిలో మిగిలిన కొద్ది భూములను భూసేకరణ ద్వారా తీసుకునేందుకు అథారిటీ ఆమోదించిందని, భూసేకరణ కంటే భూసమీకరణ వల్ల రైతులకు ఎక్కువ లాభమని మంత్రి తెలిపారు.

బీజేపీ ఎంపీలకు ప్రత్యేక శిక్షణ

న్యూదిల్లీ: ఉప రాష్ట్రపతి ఎన్నికకు సర్వం సిద్ధమైన వేళ ఓటింగ్ ప్రక్రియపై తమ ఎంపీలకు అవగాహన కల్పించడం కోసం బీజేపీ రెండు రోజుల శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేసింది. '2027 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్', 'ఎంపీలు సమర్థంగా సామాజిక మాధ్యమాలు వినియోగించడం' అనే రెండు అంశాలపై మొదటి రోజు వర్క్‌షాపు నిర్వహించారు. ప్రారంభోత్సవంలో పార్టీ కార్యకర్తలతో కలిసి ప్రధాని మోదీ చివరి వరుసలో కూర్చున్నారు. జీఎస్టీలో తెచ్చిన సంస్కరణలకుగాను బీజేపీ ఎంపీలంతా ఈ సందర్భంగా మోదీని సన్మానించారు. ఆదివారం ఉదయం 9 గంటలకు జ్యోతి ప్రజ్వలన, వందే మాతరం గీతాలాపన ద్వారా శిబిరాన్ని ప్రారంభించుకున్నారు. ప్రారంభోపన్యాసం, సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం ఎంపీలంతా మధ్యాహ్నం కమిటీలుగా ఏర్పడి వ్యవసాయం, రక్షణ, ఇంధనం, విద్యా, రైల్వే, రవాణాపై చర్చించారు. రాబోయే పార్లమెంటు సమావేశాలు, పార్లమెంటరీ కార్యకలాపాలు, చట్టాల రూపకల్పన, సభలో సమయ పాలన వంటి అంశాలపైనా ఎంపీలకు అవగాహన కల్పించారు. రెండవ రోజు అనగా సోమవారం ఉప రాష్ట్రపతి ఎన్నిక, ఓటింగ్‌పై ఎంపీలకు శిక్షణ ఇవ్వనున్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నిక మంగళవారం జరగనున్నది.

సంక్షేమ బోర్డు కోసం పోరాటం: వెంకట సుబ్బయ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భవన కార్మికుల సంక్షేమ బోర్డు కోసం పోరాడదామని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య పిలుపునిచ్చారు. బిల్డింగ్ వర్కర్ యూనియన్ 12వ నగర మహాసభ విజయవాడ దాసరి భవన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను బిల్డింగ్ వర్కర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పల్లా సూర్యారావు ఎగురవేశారు. అనంతరం యూనియన్ నగర అధ్యక్షులు పసుపులేటి కోటేశ్వరరావు అధ్యక్షతన సభ జరిగింది. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, నిలిచిపోయిన క్లెయిమ్‌లన్నీ పరిష్కరిస్తామని, ప్రతి భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉంటామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినప్పటికీ ఇప్పటివరకు ఏమీ చేయలేదని, ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల కోరికలు తీర్చకుంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. పడాల వెంకటరమణ మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం బూటకపు హామీలు ఇచ్చి... కార్మికులను మోసగించిందన్నారు. సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ విజయవాడలో లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు పనులు లేక అల్లాడిపోతున్నప్పటికీ ఎవ్వరూ పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎం.సాంబశివరావు, ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సోనా రాజు, నాయకులు కె.ఆర్.ఆంజనేయులు, బుజ్జి, భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హిట్‌పై 10న అనంతపురంలో 'కూటమి' సభ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సూపర్ సిక్స్ విజయంపై రాష్ట్రంలో కూటమి పార్టీలు భారీ బహిరంగ సభ నిర్వహించనున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చాక తొలిసారి ఉమ్మడి సభ నిర్వహిస్తోంది. డబుల్ ఇంజన్ సర్కార్ 15 నెలల పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లేలా అనంతపురంలోని ఇంద్రప్రస్థ నగర్‌లో ఈ సభను నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎన్డీఏ కూటమి తొలి ఉమ్మడి సభకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, బీజేపీ అగ్ర నేతలు పీవీఎన్ మాధవ్, మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు హాజరు కానున్నారు. ఈ నెల 10వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ భారీ బహిరంగ సభకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి లక్షల మంది ప్రజలు హాజరయ్యేలా భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఏడాది కాలంలోనే అత్యంత కీలకమైన నిర్ణయాలతో పాటు ఎన్నికల్లో హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను పూర్తి చేసి ప్రజలకు సంక్షేమం అందించటంపై ఈ సభలో ప్రధానంగా ప్రస్తావించనున్నారు. మొత్తంగా 15 నెలల పాలనా విజయాలను ఆవిష్కరించేలా సభను నిర్వహించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.